

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 13-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 277 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: నవమి సా.4:38 తదుపరి దశమి, నక్షత్రం: హస్త పూర్తి, వర్జ్యం: మ.3:05 నుంచి 4:51, దుర్ముహూర్తం: ఉ.6:40-8:07, అమృతఘడియలు: రా.1:41-3:26, రాహుకాలం: ఉ.9:00-10:30 సూర్యోదయం: 6:40, సూర్యాస్తమయం: 5:38

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





పడిపోదాం మెస్సీ మాయలో..

లియోనెల్ మెస్సీ.. ఫుట్‌బాల్ ప్రపంచంలో ఓ సంచలనం. కోట్లాది ప్రేక్షకుల ఆరాధ్య దైవం. మైదానంలో చిరుతలా పరిగెత్తుతూ.. తనకు మాత్రమే సాధ్యమనిపించే అసాధారణ డ్రిబ్లింగ్‌తో బంతిని తన అధీనంలోకి తీసుకుంటూ గోల్ పోస్టుపై చేసే దాడిని ఎలా వర్ణించగలం? ఇప్పటిదాకా టీవీల్లో కళ్లప్పగించి చూసిన అతడి విన్యాసాలను భారత ప్రేక్షకులు ప్రత్యక్షంగా తిలకించబోతున్నారు. ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈ అర్జెంటీనా దిగ్గజం భారత పర్యటన నేటి నుంచే. ముందుగా కోల్‌కతాలో అడుగుపెట్టనున్న మెస్సీ.. ఆ తర్వాత మన భాగ్యనగరాభిమానులను అలరించబోతున్నాడు. వాస్తవానికి తెలుగు ఫుట్‌బాల్ ప్రేమికులకు ఇది జీవితకాల అనుభవమే కానుంది. మెస్సీలాంటి ప్రపంచ ప్రఖ్యాత ఆటగాడు హైదరాబాద్‌కు వస్తాడని బహుశా ఎవరూ కలలో కూడా ఊహించి ఉండరేమో.. కానీ ఆ అసాధ్యుడు స్థానిక ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తన మంత్రముగ్ధమైన ఆటను ప్రదర్శించనున్నాడు. సో.. మెస్సీ అభిమానులారా.. గెట్ రెడీ!

నేడు కోల్‌కతా, హైదరాబాద్‌లో సందడి
రేపు ముంబైకి.. ఎల్లుండి ఢిల్లీ

భారత పర్యటనకు సాకర్ దిగ్గజం

తెలంగాణ సీఎం రేవంత్‌తో ఫ్రెండ్లీ మ్యాచ్



కోల్‌కతా: దేశ ఫుట్‌బాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సాకర్ సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ గోట్ (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) భారత టూర్ మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. మెస్సీతోపాటు అతడి ఇంటర్ మియామి జట్టు సహచరులు రోడ్రిగో డీ పాల్, సువారెజ్ కూడా అభిమానులను అలరించనున్నారు. శనివారం, తొలిరోజు కోల్‌కతా నుంచి మెస్సీ పర్యటన మొదలవుతుంది.

మొదటి రోజు (శనివారం)

తెల్లవారుజాము 1.30 కోల్‌కతా చేరిక; **ఉ. 9.30-10.30 మీట్ అండ్ గ్రీట్; ఉ.10.30-11.15** కోల్‌కతా కళాకారుడు మోంటీ పాల్ రూపొందించిన 70 అడుగుల తన విగ్రహం 'మాన్యుమెంట్ డీ మెస్సీ'ని మెస్సీ ఆవిష్కరిస్తాడు. లేక్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని భద్రత దృష్ట్యా వర్చువల్‌గా ప్రారంభిస్తాడు.

ఉదయం 11.15-12.00: సాల్ట్‌లేక్ స్టేడియానికి చేరిక; **మ. 12.12-12.30:** ఫ్రెండ్లీ మ్యాచ్, సన్మానం. కోచింగ్ క్లినిక్. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్‌ను కలుస్తాడు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ పయనం.

భాగ్యనగరంలో ఇలా..

- శంషాబాద్ విమానాశ్రయానికి సాయంత్రం 4 గంటలకు చేరుకోనున్నాడు.
- సా. 5 గంటలకు ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఫ్యాన్స్‌తో మీట్ అండ్ గ్రీట్.
- రాత్రి 7 గంటలకు ఉప్పల్ స్టేడియంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో ఎగ్జిబిషన్ మ్యాచ్‌కు హాజరు; రాత్రికి ఫలక్‌నుమాలో బస.
- ఆదివారం ఉదయం ముంబైకి పయనం.

రెండో రోజు (ఆదివారం) ముంబై

మ.3.30: క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలో క్రికెట్ స్టార్లతో రాకెట్ స్పోర్ట్స్ మ్యాచ్. ఈ మ్యాచ్‌లో సచిన్ ఆడతాడు. రోహిత్, ధోనీ కూడా పాల్గొనే అవకాశం.
సా.4.00: సెలెబ్రిటీ ఫుట్‌బాల్ మ్యాచ్
సా.5.00: వాంఖడే స్టేడియంలో చారిటీ ఫ్యాషన్ షో. జాన్ అబ్రహాం, కరీనా, జాకీ ష్రాఫ్ పాల్గొంటారు.

మూడో రోజు (సోమవారం), ఢిల్లీ

'గోట్' టూర్‌లో చివరి అంకం. ప్రధాని మోదీతో సమావేశం.
మ. 1.30: అరుణ్ జైట్లీ స్టేడియంలో సన్మాన కార్యక్రమం.

మ్యాచుంటే ఆ కిక్కే వేరు!

మెస్సీ పర్యటన దేశ సాకర్ అభిమానుల్లో ఉత్సాహం, ఉద్వేగం కలిగిస్తోంది. అదే సమయంలో అతడు ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడకపోవడం వారిని నిరుత్సాహ పరుస్తోంది. సీరియస్ సాకర్ మ్యాచ్ ఉంటే ఆ కిక్కే వేరంటున్నారు. 2011 టూర్‌లో కోల్‌కతా సాల్ట్‌లేక్ స్టేడియంలో మెస్సీ పాల్గొన్న ఫుట్‌బాల్ మ్యాచ్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించింది. ఆ పర్యటనలో భాగంగా వెనిజులా-అర్జెంటీనా జట్ల మధ్య జరిగిన స్నేహపూర్వక పోటీకి 85 వేల మంది ఫ్యాన్స్ పోటెత్తారు. స్టేడియం పూర్తిగా నిండిపోవడంతో..మైదానంలో మెస్సీ మాయను తిలకించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్టేడియం రేకులపైకి ఎక్కారు. కానీ ఈసారి 'గోట్ టూర్'లో సీరియస్ సాకర్ మ్యాచ్ లేకపోవడంతో అభిమానులు ఉసూరుమంటున్నారు.

మెస్సీ.. మెస్సీ.. మెస్సీ.. ఇది ఒక పదం కాదు.. ప్రపంచ ఫుట్‌బాల్ భావోద్వేగం. 'ఎదుగుదల' లోపంతో ఏమైపోతాడో? అనుకొన్న వాడు.. తన ప్రతిభతో కోట్లాది మనసులను కొల్లగొట్టాడు. ఆటను ప్రేమించాడు.. కష్టాలకు ఓర్చాడు.. ఓర్పుతో నిలిచాడు.. పట్టుదలతో పోరాడాడు.. పడిలేచిన కెరటంలా ఉవ్వెత్తున ఎగిశాడు.. విశ్వమే బంతిగా మారి.. తన కాలికింద వాలిపోయిందేమో అనేంతలా.. మైదానంలో మాయ చేసి.. సాకర్ మహోన్నత శిఖరంలా నిలిచాడు.. ఒకప్పుడు పొట్టిగా, పలుచగా, గాలొస్తే ఎగిరిపోయేలా కనిపించిన ఆ కుర్రాడు.. ఆ సమస్యలన్నింటినీ అధిగమించి తనదైన సామర్థ్యంతో ఫుట్‌బాల్ అంటే మెస్సీ.. మెస్సీ అంటే ఫుట్‌బాల్ అనే స్థాయికి ఎదిగాడు. ఈ దిగ్గజ ఆటగాడి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అందరివాడు

అమ్మమ్మ చలవే..

మెస్సీ ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాలర్ అయ్యాడంటే అది అతడి అమ్మమ్మ సెలియా ఒలివేరా చలవే. సాకర్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని మెస్సీ చిన్నప్పుడే నిర్ణయించుకున్నాడు. కానీ పొట్టిగా ఉండడంతో ఆటకు పనికి రాడని స్వస్థలం రొసారియోలో కోచ్‌లు ఎద్దేవా చేశారు. కానీ ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్‌గా ఎదిగే సత్తా, నైపుణ్యాలు మనుమడికి పుష్కలంగా ఉన్నాయని భావించిన సెలియా..కోచ్‌లను ఒప్పించి శిక్షణ ఇప్పించారు. ఆమె నమ్మకం వమ్ముకాలేదు. అలా మెస్సీ దిగ్గజ సాకర్ ఆటగాడయ్యాడు. అయితే మెస్సీకి 11 సంవత్సరాల వయస్సులో సెలియా కన్నుమూశారు. దాంతో అతడి గుండె బద్దలయ్యింది. ఆ విషాదం నుంచి కోలుకొని తిరిగి ఆటపై మనసు లగ్నం చేయడానికి మెస్సీకి చాలాకాలం పట్టింది. అమ్మమ్మకు నివాళిగా..తాను చేసిన ప్రతి గోల్ తర్వాత మెస్సీ తన రెండు చేతులు ఆకాశంవైపు చూపుతుంటాడు.



హార్మోన్ లోపంతో సతమతం..

మెస్సీ చిన్నతనం నుంచే సిగ్గరి. దీంతోపాటు ఎత్తు కూడా తక్కువే. కానీ, ఎప్పుడైతే ఫుట్‌బాల్‌ను టచ్ చేశాడో.. అతడిలో ఏదో తెలియని అనుభూతి.. సంతోషంతో ముఖం వెలిగిపోయింది. ఇక్కడి నుంచి సర్వం మారిపోయింది. ఎప్పుడో ఒక్కసారి మాట్లాడే పిల్లవాడు.. హఠాత్తుగా డ్రిబ్లింగ్, పాస్‌లు, గోల్స్‌తోనే తన ఆనందాన్ని వ్యక్తం చేయడం ఆరంభించాడు. అయితే, 11 ఏళ్ల వయసులో హార్మోన్ ఎదుగుదల లోపం (హార్మోన్ గ్రోత్ డెఫిషియెన్సీ) బయటపడడంతో సాకర్‌లో అతడి మనుగడ ప్రశ్నార్థకమైంది. ఎన్నో క్లబ్‌లు అతడి ప్రతిభను కొనియాడినా.. చికిత్స ఖర్చులు భరించేందుకు వెనకడుగేశాయి. కానీ, బార్సిలోనా క్లబ్ ముందుకురావడంతో కెరీర్ మలుపు తిరిగింది.

'న్యాప్కిన్'పై కాంట్రాక్ట్



న్యాప్కిన్ కాంట్రాక్ట్.. బార్సిలోనా ఫుట్‌బాల్ క్లబ్ చారిత్రక ఘట్టాల్లో ఒకటి. 2000 సంవత్సరంలో ఆ క్లబ్ యూత్ అకాడమీ లా మాసా లో ట్రయల్స్ కోసం మెస్సీ అర్జెంటీనా నుంచి బార్సిలోనా వచ్చాడు. అతడి ప్రతిభా పాటవాలు బార్సిలోనా యాజమాన్యాన్ని అబ్బురపరిచినా.. ఒప్పందంపై చర్చలు కొలిక్కి రాలేదు. కానీ, మెస్సీని వదులుకోరాదనుకున్న ఆ క్లబ్ టెక్నికల్ డైరెక్టర్ కార్లోస్ రెక్సాచ్.. చివరకు యాజమాన్యాన్ని ఒప్పించి అప్పటికప్పుడే అగ్రిమెంట్ కుదిర్చాడు. కానీ ఒప్పందం రాసుకొనేందుకు తెల్ల పేపర్ లేకపోవడంతో అక్కడి ఓ పేపర్ న్యాప్కిన్‌పై అగ్రిమెంట్ రాసి మెస్సీ తండ్రి జార్జ్, రెక్సాచ్ సంతకాలు చేశారు. ఆ ఏడాది డిసెంబరు 14న జరిగిన ఈ ఘటనను 'ఇది ఒక కాంట్రాక్ట్ కాదు.. నవ శకానికి నాంది' అని సాకర్ పండితులు అభివర్ణిస్తారు. ఈ న్యాప్కిన్‌ను గతేడాది వేలం వేస్తే ఏకంగా రూ. 8 కోట్లకు పైగా అమ్ముడవడం ఆటలో మెస్సీ శక్తి, సామర్థ్యాలకు నిదర్శనం.

దాతృత్వం.. అపారం

చిన్నప్పుడు అనారోగ్యంపాలైన మెస్సీ..ఏ అర్జెంటీనా చిన్నారీ వాటిని ఎదుర్కోకూడదని తలిచాడు. తన ఫౌండేషన్ తరఫున ఎందరో అర్జెంటీనా చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్నాడు. వారికి స్పెయిన్‌లో చికిత్స చేయించి, తిరిగి అర్జెంటీనా తీసుకురావడం, వారు కోలుకొనేందుకు అయ్యే ఖర్చు వరకు మొత్తం తానే భరిస్తున్నాడు. అంతేకాదు కొన్ని ప్రత్యేక చికిత్సలకు సంబంధించి అర్జెంటీనా వైద్యులు స్పెయిన్‌లో శిక్షణ పొందేందుకు అవసరమైన ఆర్థిక సాయమూ చేస్తున్నాడు.

దర్పం మచ్చుకైనా లేదు

విఖ్యాత ఫుట్‌బాలర్‌గా పేరు ప్రఖ్యాతులు..వేలాది కోట్ల ఆస్తి..అయినా హంగు, ఆర్భాటం, దర్పం మచ్చుకైనా కనిపించవు మెస్సీలో. 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి' అనే సామెతకు నిలువుటద్దంగా నిలుస్తాడు. లగ్జరీలకు అతడు ఆమడ దూరంలో ఉంటాడు. పైగా..'ఫుట్‌బాల్‌ను అమితంగా ఇష్టపడే రొసారియోకు చెందిన సాధారణ బాలుడిని' అని మెస్సీ అనడం అతడి వినమ్రతకు నిదర్శనం.

మ్యాచ్‌కు ముందు వాంతులు..



తొలి నాళ్లలో మ్యాచ్‌లకు ముందు మెస్సీ ఎంతో ఆందోళన చెందేవాడు. దరిమిలా వాంతులు చేసుకొనేవాడు. ఒక్కోసారి మ్యాచ్ మధ్యలోనూ వాంతులయ్యేవి. ఆహారం విషయంలో పట్టింపులు లేకుండా వ్యవహరించడంతో అలా అయ్యేదట. తర్వాత డైట్ విషయంలో కఠినంగా ఉండడంతో వాంతుల సమస్య తగ్గిపోయింది.



'ఎడారి'లో దాహం తీరింది

2022 కతార్‌లో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్.. ఒకరకంగా మెస్సీకి చివరి అవకాశం. మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే సౌదీ అరేబియా చేతిలో ఓటమి. ఇంత గొప్ప ఆటగాడి కెరీర్ వరల్డ్‌కప్‌ను అందుకోకుండానే ముగుస్తుందా? అనే నిర్వేదం. కానీ, డీలా పడిన జట్టులో స్ఫూర్తిని రగిల్చిన మెస్సీ.. వరుస విజయాలతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఫ్రాన్స్‌తో టైటిల్ ఫైట్‌లో డ్రామా నడిచినా.. షూటౌట్‌లో అర్జెంటీనాను గెలిపించిన మెస్సీ.. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్'గా తనపేరును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకొన్నాడు.



టియాగో కారు అలా...

2016లో టాటా గ్రూప్ విడుదలజేసిన టియాగో కారుకు అంతకుముందు జికా అన్న పేరుండేది. ఆ సమయంలో జికా వైరస్ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న సమయంలో జికా పేరును మార్చాలని టాటా గ్రూప్ అనుకుంది. అప్పుడు టాటా సంస్థకు లియోనెల్ మెస్సీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాడు. మెస్సీ పెద్ద కుమారుడి పేరు థియాగో. ఈ పేరు కలిసొచ్చేలా జికాకు మార్పులు చేసి టాటా టియాగో అన్న కొత్త కారును మార్కెట్‌లోకి విడుదలజేసింది టాటా సంస్థ. దీంతో ఈ కార్ల విక్రయాలు భారీగా జరిగి టాటా సంస్థ లాభాలు గడించింది. అలా..టాటా గ్రూప్‌కు మెస్సీతో ప్రత్యేక అనుబంధం ఏర్పడింది.

ఆ అవార్డు ఎనిమిది సార్లు..



'బాలన్ డి వోర్' అవార్డు సాకర్ ఆటగాళ్లకిచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. అలాంటి ఈ పురస్కారాన్ని మెస్సీ ఏకంగా ఎనిమిది సార్లు గెలుచుకోవడం విశేషం. ఈ అవార్డును ఇన్నిసార్లు బహుశా మరే ఫుట్‌బాలర్ చేరుకోకపోవచ్చు. ఇంకా..ప్రపంచ కప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే ప్లేయర్‌కు ప్రదానం చేసే 'గోల్డెన్ బాల్'ను రెండుసార్లు (2014,. 2022) అందుకున్నదీ మెస్సీనే.

ఇప్పటికీ చెదరని రికార్డు

మెస్సీ పేరిట ఓ రికార్డు ఇప్పటికి పదిలంగా ఉంది. అదేంటంటే..ఒక కేలండర్ ఇయర్‌లో అత్యధిక గోల్స్ చేయడం. 2012లో 91 గోల్స్ కొట్టాడు. ఇంకా..ఒకే క్లబ్, (బార్సిలోనా) తరఫున అత్యధికంగా 672 గోల్స్ చేసిన రికార్డూ లియోనెల్ సొంతం. లా లిగా టోర్నీలో అత్యధిక గోల్స్ (474) కూడా మెస్సీ పేరిటే రికార్డు ఉంది.



స్ఫూర్తినింపిన విజయమిది

అంధ మహిళా క్రికెటర్లతో డిప్యూటీ సీఎం పవన్ భేటీ
క్రీడాకారిణికి రూ.5 లక్షలు.. సిబ్బందికి రూ.2 లక్షలు అందజేత

అమరావతి (ఆంధ్రజ్యోతి): అంధ మహిళా క్రికెటర్లు చూపిన అంకిత భావం, పడిన కష్టం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొనియాడారు. ఇటీవలి ప్రపంచకప్‌లో వీరు సాధించిన విజయం భారత క్రీడా చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని, దివ్యాంగులెవరూ తమకున్న వైకల్యం పట్ల బాధపడకుండా చేశారని అభిప్రాయపడ్డారు. శుక్రవారం డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రపంచ కప్ గెలిచిన మహిళల అంధ క్రికెటర్లు ఆయన్ని కలిశారు. ఈ సందర్భంగా వారందరినీ ఆయన సత్కరించారు. ఒక్కో క్రికెటర్‌కు తనవంతు ప్రోత్సాహకంగా రూ.5 లక్షలు, సహాయ సిబ్బందికి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.84 లక్షలు అందజేశారు. అలానే ప్రతి క్రికెటర్‌కు పట్టుచీర ప్రదానం చేసి, శాలువాతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళకు సంబంధించిన జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీ డబ్బాలతో కూడిన ప్యాక్ అందించారు. ఈ విజయం వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

తిరుపతిలో స్పోర్ట్స్ సిటీ

అమరావతి (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్పోర్ట్స్ సిటీను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. శుక్రవారం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కు తిరుపతిలోని దామినేడు వద్ద 28.37 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాప్ ఛైర్మన్ రవినాయుడు కృషితో ఆధ్యాత్మిక నగరంలో స్పోర్ట్స్ సిటీ స్థాపనకు అంకురార్పణ జరిగింది. స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు భూమి కేటాయించేందుకు శ్రద్ధ తీసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు రవినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు చంద్రబాబు నాయుడు చారిత్రక నిర్ణయం తీసుకున్నారని కీర్తించారు. తిరుపతిలో త్వరలోనే స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుడతామని, అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.


సీఎంతో రవి నాయుడు

వైభవ్ విధ్వంసం

95 బంతుల్లో 171
- యూఏఈపై 234 పరుగులతో భారత్ ఘన విజయం
- అండర్-19 ఆసియాకప్



దుబాయ్: ఏ విభాగం మ్యాచ్ అయినా.. వేదిక ఎక్కడైనా 14 ఏళ్ల చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ విధ్వంసానికి ఎదురులేకుండా పోతోంది. తాజాగా అండర్-19 ఆసియా కప్ ఆరంభ మ్యాచ్‌లో తన బ్యాట్ పదునేంటో యూఏఈ బౌలర్లకు రుచి చూపించాడు. 95 బంతుల్లోనే 9 ఫోర్లు, 14 సిక్సర్లతో చెలరేగిన వైభవ్ 171 పరుగులతో అదుర్స్ అనిపించాడు. అతడి ధాటికి ప్రత్యర్థి యూఏఈ 234 పరుగుల భారీ తేడాతో చిత్తు కావడం గమనార్హం. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత కుర్రాళ్లు 50 ఓవర్లలో 6 వికెట్లకు 433 పరుగులతో బెంబేలెత్తించారు. అండర్-19 విభాగంలో భారత్‌కిదే అత్యధిక స్కోరు. ఈక్రమంలో 2004లో చేసిన 425 పరుగుల రికార్డు బ్రేక్ అయ్యింది. ఆరోన్ జార్జి (69), విహాన్ (69) అర్ధసెంచరీలతో రాణించారు. 55 బంతుల్లోనే శతకం బాదిన వైభవ్-జార్జి మధ్య రెండో వికెట్‌కు 212 పరుగులు జత చేరాయి. ఆ తర్వాత కష్టసాధ్యమైన ఛేదనలో యూఏఈ 50 ఓవర్లలో 199/7 స్కోరుకే పరిమితమైంది. ఉద్దీష్ సూరి (78), పృథ్వీ మధు (50) మాత్రమే ఆకట్టుకున్నారు. భారత్ నుంచి ఏకంగా తొమ్మిది మంది బౌలింగ్ చేయగా, దీపేష్‌కు రెండు వికెట్లు దక్కాయి.

పాక్ 297 రన్స్ తేడాతో..: మరోవైపు గ్రూప్ 'ఏ'లోనే జరిగిన ఇంకో మ్యాచ్‌లో పాక్ 297 రన్స్ తేడాతో మలేసియాపై నెగ్గింది. పాక్ తొలుత 50 ఓవర్లలో 345/3 స్కోరు చేయగా, మలేసియా 19.4 ఓవర్లలో 48 పరుగులకే కుప్పకూలింది. ఈ జట్టులోని ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు.

నితీశ్ హ్యాట్రిక్ తీసినా.. ఆంధ్ర పరాజయం

పుణె: తొలుత బ్యాటింగ్ (25)..ఆపై బౌలింగ్‌లో హ్యాట్రిక్ (3/17)తో నితీశ్ కుమార్ ఆల్‌రౌండ్ షోతో రాణించినా మధ్యప్రదేశ్‌తో ముస్తాక్ అలీ ట్రోఫీ సూపర్ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుకు పరాజయం తప్పలేదు. శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తొలుత ఆంధ్ర 19.1 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. అనంతరం మధ్యప్రదేశ్ 17.3 ఓవర్లలో 113/6 స్కోరు చేసి గెలుపొందింది.

భారత క్రికెటర్లు వ్యసనపరులు

మా ఆయన బంగారం ● జడేజా భార్య రివాబా సంచలన వ్యాఖ్య

ద్వారక (గుజరాత్): ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా భార్య, గుజరాత్ రాష్ట్ర మంత్రి రివాబా భారత క్రికెటర్లపై సంచలన ఆరోపణలు చేశారు. తన భర్త జడేజా చాలా మంచి వ్యక్తి అని, ఇతర ఆటగాళ్లు మాత్రం వ్యసనపరులంటూ స్థానికంగా జరిగిన ఓ కార్యక్రమంలో రివాబా పేర్కొంది. 'నా భర్త జడేజా క్రికెట్ మ్యాచ్‌ల కోసం లండన్, దుబాయ్, ఆస్ట్రేలియావంటి చోట్లకు జట్టుతో పాటు వెళుతుంటారు. అక్కడ ఏమైనా చేయగల స్వేచ్ఛ అతడికుంది. కానీ తను మాత్రం ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాలేదు. బాధ్యతగా ఎలా ఉండాలో ఆయనకు తెలుసు. అయితే జట్టులోని కొందరు ఆటగాళ్లు దురలవాట్లకు బానిసలయ్యారు. అలాగే ఈ విషయంలో వారి కుటుంబాల నుంచి కూడా ఎలాంటి ఆంక్షలు లేవు' అని రివాబా తెలిపింది. ఎవరి పేర్లూ చెప్పకపోయినప్పటికీ.. ఆమె కామెంట్స్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 13-12-2025
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

పొందూరు ఖద్దరుకు జీఐ ట్యాగ్

ఫలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ కృషి

శ్రీకాకుళం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పొందూరు ఖద్దరుకు పూర్వ వైభవం సాధించేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన ప్రయత్నం ఫలించింది. పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు ప్రకటిస్తూ వాణిజ్య పరిశ్రమల శాఖ పరిధిలోని భౌగోళిక సూచికల రిజిస్ట్రీ శుక్రవారం అధికారిక పత్రాన్ని జారీ చేసింది. ఈ ప్రకటనపై కేంద్ర మంత్రి, శ్రీకాకుళం జిల్లావాసులు

మిగతా 12వ పేజీలో...



విశాఖపట్నం పర్యాటకంగానే కాకుండా టెక్నాలజీ కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. భవిష్యత్తులో కాగ్నిజెంట్ తన ప్రధాన కార్యాలయం ఏపీకి మార్చుకునేంతగా ఇక్కడ అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నాను. ఆ సంస్థలో అమెరికన్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్, సీఈఓ తదితర ఉన్నత స్థానాల్లో ఉన్నవారంతా తెలుగువారు కావడం గర్వకారణం.

పరిశ్రమలు తీసుకొస్తే ఉత్తరాంధ్రలో వలసలు పూర్తిగా నిలిచిపోతాయి. అవసరానికి మించి డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించవద్దు. ఐటీ, ఏఐ సంస్థలకు అధికారులు అధిక ప్రాధాన్యమివ్వాలి.

విభిన్న పంటల సాగుకు విశాఖ రీజియన్ ఎంతో అనుకూలం. ఆయిల్ పామ్‌ను ప్రోత్సహిస్తూనే అంతర పంటలుగా కోకో, అరటి, మిరియాలు వంటివి పండించేలా చూడాలి. ఏజెన్సీలో మసాలా దినుసులు, స్ట్రాబెర్రీ సహా అన్ని పంటలూ పండించేందుకు అవకాశముంది.

\- సీఎం చంద్రబాబు



విశాఖలో కాగ్నిజెంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్

టెక్ హబ్‌గా విశాఖ

నాలెడ్జ్ ఎకానమీ సిటీగా అభివృద్ధి చెందుతుంది.. కాగ్నిజెంట్ శంకుస్థాపన సభలో సీఎం

- గ్రీన్ ఎనర్జీ వల్లే డేటా సెంటర్లు వస్తున్నాయి
- 99 పైసలకే భూములివ్వడం గేమ్ చేంజర్
- కాగ్నిజెంట్ ముఖ్యుల్లో ఎక్కువ మంది తెలుగువారు కావడం గర్వకారణం
- అన్ని విధాలా విశాఖ ఉత్తమ నగరం
- కాగ్నిజెంట్ ప్రధాన కేంద్రం ఏపీకి రావాలి
- పెట్టుబడులకు ఆ సంస్థ సీఈవో బ్రాండ్ అంబాసిడర్‌గా మారాలి: సీఎం
- మంత్రి లోకేశ్‌తో కలిసి కాగ్నిజెంట్, మరో 8 సంస్థలకు శంకుస్థాపన
- కాగ్నిజెంట్ రాక ఓ మైలురాయి: లోకేశ్

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఫ్యూచర్ నాలెడ్జ్ ఎకానమీ సిటీగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఐటీ హబ్‌గా మారుతున్న విశాఖలోని కాపులుప్పాడలో కాగ్నిజెంట్ శాశ్వత భవన నిర్మాణానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌తో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం అనంతరం కాగ్నిజెంట్ ఏర్పాటుచేసిన సమావేశంలో ఐటీ పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ఏపీలో గ్రీన్ ఎనర్జీ పుష్కలంగా ఉండడం వల్ల డేటా సెంటర్లు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఒక్క గూగుల్ డేటా సెంటరే రూ. 1.35 లక్షల కోట్ల పెట్టుబడులు

మిగతా 11వ పేజీలో...

ఉత్తరాంధ్రలో చంద్రబాబు ఏరియల్ సర్వే

- ఐటీ, టూరిజం హబ్‌లు, 'భోగాపురం' పనుల పరిశీలన
- గూగుల్ డేటా సెంటర్ పెట్టే ప్రాంతాన్ని కూడా..
- వివిధ ప్రాజెక్టుల పురోగతిపై ఆరా

11

విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు మహర్దశ


గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి: సీఎం

- అవసరానికి మించి డేటా సెంటర్లను ప్రోత్సహించొద్దు
- ఐటీ, ఏఐ సంస్థలకు అధిక ప్రాధాన్యమివ్వాలి
- 2032నాటికి 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- 30 లక్షల ఉద్యోగాలే లక్ష్యం.. 7 గ్రోత్ డ్రైవర్స్,
- 10 పాలసీలతో ఆర్థిక ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు
- వీఈఆర్‌పై సీఎం తొలి సమీక్ష.. 49 ప్రాజెక్టులపై చర్చ

2029 ఎన్నికలు.. పాత సీట్లతోనే!

నియోజకవర్గాల పునర్విభజనకు 'జనగణన' అడ్డు

- వచ్చే ఏప్రిల్ నుంచి దేశవ్యాప్తంగా జనాభా లెక్కల ప్రక్రియ
- 2028 జూన్‌కు పూర్తయ్యే అవకాశం
- ఆ తర్వాత పునర్విభజనకు మరో ఏడాదిన్నర
- అప్పటికి ముగిసిపోనున్న 2029 ఎన్నికలు
- ఇక 2034 ఎన్నికల నాటికే కొత్త స్థానాలు!



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పాత నియోజకవర్గాలతోనే జరుగనున్నాయి. ఎందుకంటే.. నియోజకవర్గాల పునర్విభజనకు జనగణన ప్రక్రియ ప్రధాన అవరోధంగా నిలుస్తోంది. జనాభా లెక్కల సేకరణ, దాని తర్వాత నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయ్యే సమయానికి 2029 ఎన్నికలు ముగిసిపోతాయి. నియోజకవర్గాల పునర్విభజనపై 2001లో తీసుకొచ్చిన 84వ రాజ్యాంగ సవరణలో.. ఆ రోజుకు ఉన్న అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పరిధిని ఫ్రీజ్ చేశారు. 2026 తర్వాత చేపట్టే జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలని అందులో నిర్దేశించారు. అయితే రాష్ట్ర విభజన చట్టం(2014)లోని సెక్షన్ 26(1) ప్రకారం ఏపీలో విభజన నాటికి ఉన్న 175 అసెంబ్లీ సీట్లను గరిష్ఠంగా 225కి.. తెలంగాణలో 119 ఉన్న అసెంబ్లీ సీట్లను 153కి పెంచుకునే వెసులుబాటు కల్పించారు. దీని ఆధారంగా 2029 ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని రాజకీయ పార్టీలు ప్రచారం చేస్తూ వచ్చాయి. జనగణన ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరగాలని విభజన చట్టంలో ఎక్కడా లేదని.. ప్రజల సౌకర్యం, పాలనాసౌలభ్యం, భౌగోళిక సమస్యలు తలెత్తకుండా మాత్రమే

మిగతా 2వ పేజీలో...

జనగణనకు రూ.11,718 కోట్లు

- రెండు దశల్లో నిర్వహణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం 2
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్పు
- పని దినాల సంఖ్య 100 నుంచి 125కు!.. ఎండు కొబ్బరి కనీస మద్దతు ధర పెంపునకు పచ్చజెండా
- బీమా రంగంలో 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఓకే.. ఉన్నత విద్యకు ఒక్కటే నియంత్రణ సంస్థ
- పనికిరాని 71 పాత చట్టాల రద్దుకు సై.. కోల్‌సేతుకు ఆమోదం.. 50% బొగ్గు ఎగుమతికి అవకాశం

ఘాట్‌లో ఘోరం

లోయలో పడ్డ టూరిస్టు బస్సు
9 మంది దుర్మరణం
21 మందికి గాయాలు



చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో పైనుంచి పడి తుక్కుతుక్కైన ట్రావెల్స్ బస్సు

- చింతూరు-మారేడుమిల్లి ఘాట్‌రోడ్‌లో ఘటన
- మృతులంతా ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులే
- పంచారామం పుణ్యక్షేత్రాల సందర్శనకు 37 మంది
- మూడు రోజులు సాఫీగా సాగిన తీర్థయాత్ర
- భద్రాచలం చేరడానికి అరకు మీదుగా ప్రయాణం
- తెల్లవారుజామున అదుపు తప్పి లోయలోకి బస్సు
- చీకటి.. పొగమంచు.. ఆపై డ్రైవర్ అతి వేగమే శాపం!
- ఘాట్‌రోడ్లలో రాత్రి ప్రయాణాలు నిషేధిస్తూ ఆదేశాలు


తీర్థయాత్ర విషాదాంతం

చింతూరు, చిత్తూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు ఆనందంగా సాగిన తీర్థయాత్ర చివరకు వారికి విషాదయాత్రనే మిగిల్చింది. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించడానికి బయలుదేరిన వారి ట్రావెల్స్ బస్సు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదానికి గురైంది. బస్సు అదుపు తప్పి ఘాట్ రోడ్డులో పైరోడ్డుకు కింద రోడ్డుకు

మిగతా 10వ పేజీలో...

అతి వేగానికి మరో 5 ప్రాణాలు బలి


- కొబ్బరికాయల లోడు వాహనం కాల్వలో బోల్తా
- ముగ్గురు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- రెండు బైక్‌లు ఢీకొని ఇరువురి దుర్మరణం



గుడ్డు ధర పైపైకి..

- విశాఖలో 100 గుడ్ల హోల్‌సేల్ ధర రూ.660 12
- విజయవాడలో రూ.690
- ధర మరింత పెరిగే అవకాశం
- డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడమే కారణం

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ధర్మేంద్ర ప్రధాన్?



- పార్లమెంట్ సమావేశాలు ముగియగానే ప్రక్రియ వేగవంతం
- పరిశీలనలో భూపేంద్ర యాదవ్, శివరాజ్‌సింగ్, ఖట్టర్ పేర్లూ..
- ధర్మేంద్రకే అవకాశాలు అధికం.. కొత్త ఏడాదికి కొత్త అధ్యక్షుడు!
- ఇప్పటికే 29 రాష్ట్రాల్లో పూర్తైన బీజేపీ సంస్థాగత ఎన్నికలు
- యూపీ, కర్ణాటక పార్టీ అధ్యక్షుల ఎంపిక మాత్రమే పెండింగ్

2

అవును.. నేను విన్నాను!

జయచంద్రారెడ్డి ఇంట్లోనే నకిలీ మద్యం తయారీపై చర్చ



వీరస్వామి అన్నురసు

3

- పోలీసులకు సహాయకుడు వీరస్వామి అన్నురసు వాంగ్మూలం
- డైరీలో సంతకం చేసి కట్టా రాజు దగ్గర రూ.8 లక్షలు తెచ్చా
- జయచంద్రారెడ్డి సూచనతో ఆ నగదు పీఏ రాజేశ్ చేతికి
- ఇంట్లోని స్కార్పియోలోనే నకిలీ మద్యం సరఫరా
- ఆయన, గిరిధర్‌రెడ్డి, జనార్దన్‌రావు కలసి పనిచేశారు
- ఆయన ఆదేశాలతో నా ఫోన్‌ను ధ్వంసం చేశా
- ములకలచెరువు కేసులో అన్నురసు రిమాండ్ రిపోర్టు

జనగణనకు 11,718 కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 12: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం.. 2027 జనాభా లెక్కల సేకరణకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.11,718.24 కోట్లు మంజూరు చేసింది. రెండు దశలుగా నిర్వహించే ఈ జనాభా లెక్కల సేకరణలో భాగంగా.. తొలిసారి కులగణన కూడా చేయనున్నారు. దీంతోపాటు.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, కోల్ సేతు విధానం సులభతరం, ఉన్నత విద్యకు సంబంధించి ఒకటే నియంత్రణ సంస్థ ఏర్పాటు, పనికిరాని 71 పాత చట్టాల రద్దు వంటి నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అనంతరం మీడియాతో భేటీ అయిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్.. క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. దాదాపు 30 లక్షల మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటారని, ఇంటింటికీ వెళ్లి గృహజాబితా, ప్రజల వివరాలు సేకరిస్తారని.. తొలిసారి పూర్తిగా డిజిటల్ పద్ధతిలో(మొబైల్ యాప్స్ ద్వారా) ఈ ప్రక్రియను నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈసారి పౌరులు తమ వివరాలను తామే ఆన్‌లైన్‌లో నింపుకొనే (సెల్ఫ్ ఎన్యూమరేషన్) అవకాశాన్ని కల్పించనున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఇప్పటిదాకా 15 జనగణనలు జరిగాయి. 2027లో జరపబోయేది 16వ జనగణన. నిజానికి 2021లో జరగాల్సిన ఈ ప్రక్రియ.. కొవిడ్ కారణంగా అప్పట్లో వాయిదా పడిన సంగతి తెలిసిందే. తాజా జనగణన రెండు దశల్లో జరుగుతుందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు దాకా జరిగే మొదటి దశలో గృహాల జాబితా రూపొందిస్తామని (హౌస్ లిస్టింగ్), 2027 ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని తెలిపారు. లద్దాఖ్‌లో, మంచుతాకిడి ఎక్కువగా ఉండే జమ్మూకశ్మీర్‌తోపాటు, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో 2026 సెప్టెంబరులోనే జనాభా లెక్కలను సేకరిస్తామని తెలిపారు. ఈ భారీ ప్రక్రియలో భాగంగా 18,600 మంది సాంకేతిక సిబ్బందిని దాదాపు 550రోజులపాటు నియమిస్తారని.. తద్వారా 1.02 కోట్ల పనిదినాల ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. జనగణనలో సేకరించే సమాచారానికి 'డేటా భద్రత చట్టాలు' వర్తిస్తాయని.. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, జనగణనకు సంబంధించిన స్థూల వివరాలు మాత్రమే ప్రచురిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో పాల్గొనేవారందరికీ గౌరవ పారితోషికం అందిస్తామన్నారు. జనగణన ప్రక్రియ మొత్తాన్నీ నిర్వహించేందు, రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేందుకు 'సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్)' పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్టు కేంద్ర మంత్రి వెల్లడించారు. అలాగే.. సేకరించిన డేటా ఆధారంగా విధానాలు రూపొందించడానికి అవసరమైన సమాచారాన్ని ఒక్క క్లిక్కుతో పొందేలా చేస్తామన్నారు. అలాగే.. పౌర అణు రంగంలో ప్రైవేటు కంపెనీలు కూడా పాల్గొనే అవకాశాన్ని కల్పించే బిల్లుకు కూడా కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. 2047 నాటికి 100 గిగావాట్ల అణు ఇంధన సామర్థ్యాన్ని సాధించే లక్ష్యంలో భాగంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.



క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

మరిన్ని నిర్ణయాలు..

రెండు దశాబ్దాల క్రితం యూపీఏ సర్కారు ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును.. 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా మార్చే బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ పథకం కింద ప్రస్తుతం ఉన్న పనిదినాలను (ఏడాదికి) 100 నుంచి 125కి పెంచనున్నారు. ఇక.. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రస్తుతం ఉన్న 74% నుంచి 100 శాతానికి పెంచుతూ రూపొందించిన బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. విదేశీ పెట్టుబడులకు 100% అవకాశం కల్పిస్తున్నప్పటికీ.. ఉన్నతస్థాయి యాజమాన్యంలో (అంటే చైర్మన్, ఎండీ, సీఈవో వంటి స్థానాల్లో) కనీసం ఒక్కరు తప్పనిసరిగా భారతీయులు ఉండాలని ఈ బిల్లులో ప్రతిపాదించినట్టు సమాచారం. అలాగే.. ఉన్నత విద్యకు సంబంధించి ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) వంటి సంస్థలన్నింటి స్థానంలో ఒకే ఒక నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసే బిల్లుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ 'ఉన్నత విద్య నియంత్రణ సంస్థ'ను 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షణ్'గా వ్యవహరించనున్నారు. వైద్య, న్యాయ కళాశాలలు మాత్రం ఈ నియంత్రణ సంస్థ పరిధిలోకి రావు. ఇక.. ఉపయోగంలోని 71 పాత చట్టాలను తొలగించేందుకు కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. 2014లో మోదీ సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటిదాకా ఇలా 1562 పాత చట్టాలను తొలగించిన సంగతి తెలిసిందే. ఈ 71 చట్టాల తొలగింపు బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభిస్తే.. ఆ చట్టాల సంఖ్య 1633కు చేరుతుంది. అలాగే.. ఎలాంటి 'ఎండ్-యూజ్' ఆంక్షలూ లేకుండా బొగ్గు లింకేజీలను వేలం వేసే కొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్ కోల్‌సేతుకు ప్రధాని నేతృత్వంలోని 'ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ' ఆమోదం తెలిపింది. ఎండ్-యూజ్ ఆంక్షలు లేకపోవడంవల్ల.. తమకు కేటాయించే బొగ్గును దేనికి ఉపయోగించాలో స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే వీలు కంపెనీలకు కలుగుతుంది. బొగ్గు అవసరమైన ఏ వినియోదారు అయినా దీని ద్వారా వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలాగే.. 2026 సీజన్‌కుగాను మిల్లింగ్ కొప్రా (ఎండుకొబ్బరి చిప్పల) కనీస మద్దతు ధరను రూ.445 మేర పెంచి క్వింటాలుకు రూ.12,027గా కేంద్రం నిర్ణయించింది. బాల్ కొప్రా (ఎండు కొబ్బరి కురిడీ) ధరను క్వింటాలుకు రూ.400 మేర పెంచి రూ.12,500గా నిర్ణయించింది. ఈమేరకు 'ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ' నిర్ణయం తీసుకున్నట్టు అశ్విని వైష్ణవ్ తెలిపారు.

భారతీయులు మాత్రమే ఓటర్లుగా నమోదయ్యేలా చూసే అధికారం ఈసీదే!

- ఓటర్ల సమాచారం తనిఖీ చేయడానికే ఎస్ఐఆర్
- పౌరసత్వాన్ని గుర్తించడానికి కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 12: భారత పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదయ్యేలా చూసే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా దాఖలైన పలుపిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్‌లో భాగంగా గతంలో ఉన్న ఓటర్ల జాబితాలోని పేర్లే కాపీ, పేస్ట్ చేయరాదని పేర్కొంది. ఈ ప్రక్రియ ఓటర్ల జాబితాలోని వివరాలను తనిఖీ చేయడానికే కానీ, పౌరసత్వాన్ని గుర్తించడానికి కాదని తెలిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదనలు వినిపిస్తూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఈసీపై అపనమ్మకంతో ప్రారంభం కాకూడదని అన్నారు. ప్రతి ఓటరు పౌరసత్వాన్ని పరీక్షించడం ఈసీ పని కాదని చెప్పారు. ఓటరు జాబితాలో విదేశీయులు ఉన్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే, దానిపై ఇతర సంస్థలు దర్యాప్తు చేస్తాయని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్నికల పర్యవేక్షణ అధికారం రాజ్యాంగబద్ధంగా ఈసీకి ఉందని స్పష్టం చేసింది.

బీజేపీ అధ్యక్షుడిగా ధర్మేంద్ర ప్రధాన్?

- 'పార్లమెంట్' ముగియగానే ప్రక్రియ వేగవంతం

న్యూఢిల్లీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీకి త్వరలో కొత్త జాతీయ అధ్యక్షుడు రానున్నారు. డిసెంబర్ 19న పార్లమెంట్ సమావేశాలు పూర్తయిన వెంటనే నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను వేగిరం చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. 29 రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక పార్టీ అధ్యక్షుల ఎంపిక మాత్రమే పెండింగ్‌లో ఉందని ఈ వర్గాలు తెలిపాయి. ఆదివారం నాటికి యూపీ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ పూర్తవుతుందని, కర్ణాటకలో పార్టీ అధ్యక్షుడి ఎంపిక పెండింగ్‌లో పెట్టే అవకాశాలున్నాయని తెలుస్తోంది. యూపీలో డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్యకు పార్టీ అధ్యక్షుడయ్యేందుకు అత్యధిక అవకాశాలున్నాయని, ఇతర ఓబీసీ నేతలు పంకజ్ చౌదరి, బీఎల్ వర్మ, సాధ్వీ నిరంజన తదితరుల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ శనివారం పార్టీ ఎన్నికల పరిశీలకుడుగా లక్నో వెళ్లిన తర్వాత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి యూపీ బీజేపీ చీఫ్ పదవికి నామినేషన్ వేస్తారని సమాచారం. ఆదివారం యూపీ బీజేపీ అధ్యక్షుడి పేరును ప్రకటిస్తారు. కర్ణాటకలో లింగాయత్ నేత జగదీశ్ శెట్టర్, వక్కలిగ నేత సీటీ రవి పేర్లపై చర్చలు జరుగుతున్నాయి. ఏకాభిప్రాయం వస్తే కర్ణాటక బీజేపీ అధ్యక్షుడి ఎంపిక కూడా త్వరలో పూర్తవుతుందని, లేకపోతే పెండింగ్‌లో పెట్టే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది

పరిశీలనలో కేంద్ర మంత్రుల పేర్లు!

బీజేపీ జాతీయ అధ్యక్షుడుగా ధర్మేంద్ర ప్రధాన్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉందని, బిహార్ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల్లో పార్టీ గెలుపులో ఆయన కీలక పాత్ర పోషించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు కేంద్ర మంత్రులు భూపేంద్ర యాదవ్, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్‌లాల్ ఖట్టర్ పేర్లు కూడా చర్చలో ఉన్నప్పటికీ ప్రధాన్‌కే ఎక్కువ అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది.

భారత్‌తో పంచ దేశాల కూటమి?

- అందులో అమెరికాతో పాటు రష్యా, చైనా, జపాన్

న్యూఢిల్లీ, డిసెంబరు 12: అమెరికా అధ్యక్షుడు మరో కొత్త వ్యూహానికి తెర తీస్తున్నారు. భారత్, రష్యా, చైనా, జపాన్‌తో పాటు అమెరికాను కూడా కలుపుకొని పంచ దేశాల కూటమి కోర్-5 (సీ5)ను ఏర్పాటు చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఈ ఎలైట్ గ్రూప్ ద్వారా యూరప్ ఆధిపత్యం ఉన్న జీ7, ఇతర సంప్రదాయ ప్రజాస్వామ్య, సంపద ఆధారిత దేశాల కూటములకు చెక్ పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. ప్రస్తుతానికి దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేనప్పటికీ అమెరికన్ ప్రచురణ సంస్థలు 'పొలిటికో', 'డిఫెన్స్ వన్' కథనాల ప్రకారం.. వైట్‌హౌస్ గత వారం విడుదల చేసిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ (ఎన్ఎస్ఎస్)కి సంబంధించిన సుదీర్ఘ, అముద్రిత వెర్షన్‌లో ఈ సరికొత్త శక్తిమంతమైన కూటమికి సంబంధించిన వివరాలున్నాయి. కాగా, ఈ కథనాలను వైట్‌హౌస్ ఖండించింది.

థాయ్ పార్లమెంట్ రద్దు

- 3 నెలలే అధికారంలో ఉన్న అనుతిన్

బ్యాంకాక్, డిసెంబర్ 12: థాయ్‌లాండ్ రాజకీయాలు మరోసారి అనూహ్య మలుపు తిరిగాయి. మూడు నెలల క్రితమే అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్ విజ్ఞప్తి మేరకు, థాయ్ పార్లమెంట్ రద్దుకు శుక్రవారం రాజముద్ర లభించింది. ఈ పరిణామంతో వచ్చే ఏడాది ఆరంభంలో దేశం సాధారణ ఎన్నికలకు వెళ్లనుంది. గత ప్రధాని పేతోంగ్ తార్న్ షినవత్రాను.. రాజ్యాంగ న్యాయస్థానం పదవి నుంచి తొలగించింది. దీంతో పీపుల్స్ పార్టీ మద్దతుతో అనుతిన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయినప్పటికీ, అంతర్గత రాజకీయ విభేదాలు, సంస్కరణల విషయమై ప్రతిపక్షాల మద్దతు లేకపోవడంతో పార్లమెంట్ రద్దు అనివార్యమైంది.

అక్కడ ఏదో తప్పు జరుగుతోంది!

- మద్రాస్ హైకోర్టులో కేసుల లిస్టింగ్, విచారణకు పాటిస్తున్న నియమాలు ఏంటి?: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 12: తమిళనాడులో జరిగిన కరూర్ తొక్కిసలాట ఘటన కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేసుల లిస్టింగ్, విచారణ విషయంలో మద్రాస్ హైకోర్టులో 'ఏదో తప్పిదం' జరుగుతోందని వ్యాఖ్యానించింది. కోర్టు అనుసరిస్తున్న నియమాలపై పరిశీలన చేస్తామని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ల ధర్మాసనం పేర్కొంది. కేసుల లిస్టింగ్, విచారణకు సంబంధించి అనుసరిస్తున్న నియమాలపై మద్రాస్ హైకోర్టు నుంచి సమాధానం కోరింది. మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ అందించిన నివేదిక అనంతరం సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి చెందిన కేసులో మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఇంప్లీడ్ చేస్తూ నోటీసులు జారీచేసింది. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్ ఏర్పాటుపై మద్రాస్ హైకోర్టు ఆదేశాలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ విజయ్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై అంతకుముందు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం మద్రాస్ హైకోర్టు చెన్నై బెంచ్ తీరుపై కీలక ప్రశ్నలు, అభ్యంతరాలు లేవనెత్తింది. రోడ్‌షోలు నిర్వహించడానికి మార్గదర్శకాలు కోరుతూ పిటిషన్ దాఖలైతే.. సిట్‌తో దర్యాప్తు చేయాలని ఆదేశించడాన్ని తప్పుబట్టింది. అంతేకాకుండా ఈ ఉత్తర్వులు అంతకుముందు సీబీఐ దర్యాప్తునకు మదురై బెంచ్ తిరస్కరిస్తూ ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని పేర్కొంది. కరూర్ తొక్కిసలాట ఘటనపై ఒకే హైకోర్టుకు చెందిన రెండు బెంచ్‌ల నుంచి విరుద్ధమైన తీర్పులు రావడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సమగ్ర నివేదిక ఇవ్వాలని హైకోర్టును ఆదేశించింది.

2029 ఎన్నికలు.. పాత సీట్లతోనే!

(మొదటి పేజీ తరువాయి)

పునర్విభజన జరగాలని అందులో ఎన్నికల కమిషన్(ఈసీ)కి నిర్దేశించారని వాదిస్తూ వచ్చాయి. కేంద్రం మాత్రం జనగణన తర్వాతే రెండు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని స్పష్టం చేసింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ సమయంలోనూ తన వైఖరిని తేల్చిచెప్పింది. జనగణన తర్వాత ఏపీ, తెలంగాణలో నియోజకవర్గాలు పెంచుకోవచ్చని కోర్టుకు నివేదించింది.

జనగణన.. సుదీర్ఘ ప్రక్రియ

జనగణన ప్రక్రియ 2020లోనే ప్రారంభం కావలసి ఉంది. అయితే కరోనా కారణంగా కేంద్రం వాయిదా వేసింది. ఆ తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికలు రావడంతో మళ్లీ వాయిదా పడింది. ఎట్టకేలకు కేంద్రం ఈ ఏడాది జూన్ 4న 2027 జనగణనకు షెడ్యూల్ ప్రకటించింది. ఈ ప్రక్రియకు రూ.11,718 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారం 2026 ఏప్రిల్‌లో గృహగణన చేపడతారు. తర్వాత 2027 ఫిబ్రవరిలో జనగణన మొదలవుతుంది. సాధారణంగా జనగణన ప్రారంభమై తుది నోటిఫికేషన్ ఇవ్వడానికి కనీసం ఏడాదిన్నర నుంచి రెండేళ్లు పడుతుంది. అంటే 2028 మధ్యలోనే జనాభా లెక్కలపై తుది నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ఆ నోటిఫికేషన్ ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలంటే ఎంత లేదన్నా ఇంకో ఏడాది నుంచి ఏడాదిన్నర పడుతుంది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపట్టేందుకు ముందుగా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్‌ను నియమించాల్సి ఉంటుంది. ఈ కమిషన్ రాష్ట్రమంతా తిరిగి ప్రజాభిప్రాయాలను సేకరించి తుది నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన 2029 ఏప్రిల్, మే నెలల్లో జరిగే ఎన్నికలకు కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేయడం అసాధ్యం. ఆ తర్వాత పునర్విభజన చేపడితే.. 2034 ఎన్నికలకు మాత్రమే కొత్త నియోజవకర్గాలు అందుబాటులోకి వచ్చే వీలుంది.


కొత్త స్థానాలపై ఇప్పటికే నేతల కన్ను..

రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని అన్ని పార్టీల నేతలూ ఆశలు పెంచుకున్నారు. పునర్విభజన జరుగుతుందనే ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యేలు, సిటింగ్ ఎమ్మెల్యేలు సైతం కొత్తగా ఏ నియోజకవర్గాలు ఏర్పడే అవకాశముందో అంచనాలు వేసుకుంటూ ఆయా స్థానాల్లో బరిలోకి దిగితే తమకు ఎంత వరకు అనుకూలిస్తుందనే అంశాలను అప్పుడే బేరీజు కూడా వేసుకుంటున్నారు. చాలా మంది నేతలు ఆ నియోజకవర్గాల్లో 2029 ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలూ సిద్ధం చేసుకుంటున్నారు. వీరందరి ఆశలపై జనగణన ప్రక్రియ నీళ్లు చల్లింది.

లోకం తీరు



కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ కన్నుమూత



లాతూర్, ముంబై, డిసెంబరు 12: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివ్‌రాజ్ పాటిల్(90) తన స్వస్థలం మహారాష్ట్రలోని లాతూర్ పట్టణంలో శుక్రవారం ఉదయం మరణించారు. స్వల్ప అస్వస్థతకు గురై ఆయన మృతి చెందారని బంధువులు తెలిపారు. ఆయనకు కుమారుడు శైలేష్ పాటిల్, కోడలు అర్చన, ఇద్దరు మనవరాళ్లు ఉన్నారు. శివ్‌రాజ్ పాటిల్ తుది శ్వాస వరకు నెహ్రూ-గాంధీ కుటుంబ విధేయుడిగా కాంగ్రెస్‌తోనే ఉన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన రాజకీయ జీవితంలో పలు కీలక పదవులు నిర్వహించారు. 2008లో ముంబై దాడులు జరిగినప్పుడు కేంద్ర హోంమంత్రిగా ఉన్నారు. ఆ దాడులు జరిగిన నవంబరు 26వ తేదీ రాత్రి మూడు సార్లు వేర్వేరు దుస్తులు ధరించి కనిపించడంతో ప్రజలు, మీడియా నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. దీంతో ఆ విమర్శలకు జవాబిస్తూ.. ప్రజలు తన పనితీరును చూడాలని దుస్తులను కాదని పేర్కొన్నారు. అయితే ఈ దాడుల ప్రభావం ఆయన పదవిపై పడింది. దీంతో ఆయన 2008 నవంబరు 30వ తేదీన కేంద్ర హోం మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు పలువురు నేతలు పాటిల్ మృతికి సంతాపం తెలిపారు. ప్రధాని మోదీ 'ఎక్స్'లో తన సంతాపం తెలియజేస్తూ.. సమాజ సంక్షేమంపై శివ్‌రాజ్ పాటిల్‌కు ఎంతో ఆసక్తి అని పేర్కొన్నారు. ఇటీవలే ఆయన్ను కొద్ది నెలల క్రితం తన నివాసంలో కలుసుకొన్నానని తెలిపారు.

ఇండిగోపై కాంపిటీషన్ కమిషన్ నజర్!

- పోటీ నిబంధనలను ఉల్లంఘించిందా?
- అనే అంశంపై పరిశీలన
- కొనసాగుతున్న డీజీసీఏ దర్యాప్తు
- నలుగురు ఫ్లైట్ ఆపరేషన్ ఇన్‌స్పెక్టర్లపై వేటు

న్యూఢిల్లీ, డిసెంబరు 12: ఇండిగో సంక్షోభంపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా దృష్టిపెట్టింది. భారీ సంఖ్యలో ఇండిగో విమానాల రద్దుతో లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందిపడిన నేపథ్యంలో.. ఈ అంశాన్ని సుమోటోగా పరిశీలనకు తీసుకుంది. దేశ విమానయాన రంగంలో 65శాతానికిపైగా వాటాతో ఆధిపత్యం కలిగి ఉండటం, కొన్ని మార్గాల్లో పూర్తి ఆధిపత్యం వంటివి ప్రయాణికుల ఇబ్బందులకు కారణమయ్యాయా? సహజ పోటీ నిబంధనలను ఇండిగో ఏమైనా ఉల్లంఘించిందా? తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేసిందా అనే అంశాలను పరిశీలిస్తున్నట్టు సీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ పరిశీలనలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. ఇక ఇండిగో సంక్షోభంపై డీజీసీఏ ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే దర్యాప్తు చేపట్టింది. ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, ఇతర ఉన్నతాధికారులు శుక్రవారం మరోసారి డీజీసీఏ ఎదుట హాజరయ్యారు. ఇక ఇండిగో సర్వీసుల భద్రత, నిర్వహణ ప్రమాణాలను పర్యవేక్షించే నలుగురు 'ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌వోఐ)'లపై డీజీసీఏ వేటు వేసింది. భారీగా విమానాల రద్దు పరిస్థితికి దారితీసిన కారణాలను తేల్చేందుకు నిపుణులతో పరిశీలన జరిపించాలని ఇండిగో బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు 'చీఫ్ ఏవియేషన్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌సీ' సంస్థకు బాధ్యత అప్పగించింది. మరోవైపు 2020-21 నాటి పన్ను చెల్లింపులకు సంబంధించి ఇండిగోకు తాజాగా వాణిజ్య పన్నుల శాఖ రూ.58.75 కోట్లు జరిమానా విధించింది.

సుదీర్ఘకాలం విమాన చార్జీలపై నియంత్రణ విధించలేం

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, డిసెంబరు 12: విమాన చార్జీలపై సుదీర్ఘ కాలం నియంత్రణలు విధించలేమని పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో చార్జీలు పెరగడం సాధారణమేనని చెప్పారు. కానీ కఠిన నియంత్రణలు లేని మార్కెట్‌తో అంతిమంగా వినియోగదారులకే ప్రయోజనం ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో విమాన చార్జీల నియంత్రణ కోసం లోక్‌సభ ఎదుటకు వచ్చిన ప్రైవేటు బిల్లుపై రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. వేగవంతమైన అభివృద్ధి సాధించడమే నియంత్రణల సడలింపు ఉద్దేశం అని పేర్కొన్నారు. అలా నియంత్రణలు సడలించిన దేశాలన్నీ అద్భుతమైన వృద్ధిని సాధించాయన్నారు. విమానయాన రంగం వృద్ధి చెందాలంటే.. నియంత్రణలను సడలించాల్సిందేనని, అప్పుడే ఎక్కువ సంస్థలు ఈ రంగంలోకి వచ్చి పోటీ పెరుగుతుందని పేర్కొన్నారు. కంపెనీలకు ఇచ్చే వెసులుబాటు దుర్వినియోగమయ్యే అవకాశం ఉన్నప్పుడు, మరేదైనా అసాధారణ పరిస్థితుల్లో.. చార్జీలను నియంత్రించేందుకు, కంపెనీలను దారిలో పెట్టేందుకు ప్రస్తుతమున్న విమానయాన చట్టాలు సరిపోతాయని చెప్పారు.

పశ్చిమ బెంగాల్‌లో 58 లక్షల ఓట్ల తొలగింపు

- మమత నియోజకవర్గంలో 44,787 ఓట్లు..
- సువేందు అధికారి సెగ్మెంట్‌లో 10,599.. వివరాలు వెల్లడించిన ఈసీ

న్యూఢిల్లీ, డిసెంబరు 12: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై ప్రస్తుతం నడుస్తున్న రాజకీయ వివాదం.. దుమారంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో తొలగించిన ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ శుక్రవారం నియోజకవర్గాల వారీగా విడుదల చేయడమే ఇందుకు కారణం. ఎన్యూమరేషన్ పత్రాల సమర్పణకు గురువారం చివరిరోజు కాగా, మరుసటి రోజునే తొలగించిన ఓటర్ల వివరాలు వెల్లడయ్యాయి. తొలిదశలో భాగంగా రాష్ట్రం మొత్తమ్మీద 58 లక్షలకుపైగా ఓటర్ల పేర్లను జాబితాల నుంచి ఈసీ తొలగించింది. సీఎం మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న కోల్‌కతా నగరంలోని భబానీపూర్ నియోజవర్గంలో 44,787 ఓట్లను తొలగించింది. ఈ నియోజవర్గంలో జనవరి నాటికి 1,61,509 మంది ఓటర్లు నమోదు కాగా, ప్రస్తుతం వారిలో చెప్పుకోదగ్గ సంఖ్యలోనే పేర్లను తొలగించింది. మరణాలు, ఓటర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం, డూప్లికేట్ ఓట్లు ఉండడం వంటి కారణాలను ఎన్నికల కమిషన్ చూపించింది. ప్రతిపక్ష నేత, బీజేపీ నాయకుడు సువేందు అధికారి ప్రాతినిధ్యం వహిస్తున్న నందిగ్రాం నియోజకవర్గంలో మొత్తం 2,78,212 మంది ఓటర్లు నమోదు కాగా, వారిలో 10,599 మంది పేర్లను తొలగించింది. తృణమూల్‌కు స్థావరాల్లాంటి చౌరింగీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 74,553 ఓట్లు, కోల్‌కతా పోర్టు నియోజకవర్గంలో 63,730 మంది పేర్లను టాలీగంజ్‌లో 35,309 మంది పేర్లను అధికార్లు తొలగించారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న అసన్‌సోల్ సౌత్‌లో 39,202, సిలిగురిల్లో 31,181 మంది పేర్లు తొలగింపునకు గురయ్యాయి. జిల్లాల వారీగా విశ్లేషిస్తే దక్షిణ 24 పరగణాల జిల్లాలో అత్యధికంగా 8,16,047 మంది ఓటర్లను అధికారులు తొలగించారు. తృణమూల్‌కు కంచుకోటలాంటి ఈ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ గత ఎన్నికల్లో ఏడు లక్షల మెజార్టీలో విజయం సాధించడం విశేషం. అత్యల్పంగా బంకురా జిల్లాలోని కొతుల్‌పూర్ నియోజకవర్గంలో కేవలం 5,678 ఓట్లను మాత్రమే తీసివేశారు. వలసవచ్చిన వారి సంఖ్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా తొలగింపులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. ఎంతమందిని తొలగించారు, ఎంత మందిని చేర్చారన్న సమాచారం వాటి ద్వారా వెల్లడికానుంది. ఇంటింటి తనిఖీలు సక్రమంగా జరగలేదని ఇప్పటికే విమర్శలు వస్తున్న నేపథ్యంలో వాటిపై మరిన్ని అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉంది.

8 రాష్ట్రాలకు 'సర్' పరిశీలకులు

'సర్' నిర్వహించనున్న ఎనిమిది రాష్ట్రాలకు ఎన్నికల కమిషన్ పరిశీలకులను నియమించింది. 'ప్రత్యేక జాబితా పరిశీలకుడు'(స్పెషల్ రోల్ అబ్జర్వర్-ఎస్ఓఆర్) పేరుతో శుక్రవారం వీరిని ఎంపిక చేసింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరిగే 'సర్'ను వారు పర్యవేక్షించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఓటర్ల తుది జాబితా ప్రచురించే వరకు వారు ఈ విధుల్లో ఉండనున్నారు. మరోవైపు తమిళనాడు, గుజరాత్‌ల్లో ఎన్యూమరేషన్ గడువును ఈ నెల 14 వరకు, ముసాయిదా జాబితా విడుదల గడువును ఈ నెల 19వరకు ఎన్నికల కమిషన్ పొడిగించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్-నికోబార్ దీవుల్లో పేర్ల నమోదు గడువును ఈనెల 18 వరకు, ఓటర్ల జాబితా గడువును 23 వరకు పెంచింది. ఉత్తరప్రదేశ్‌లో పేర్ల నమోదు గడువును ఈ నెల 26 వరకు, ఓటర్ల జాబితా ప్రకటన గడువును 31 వరకు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది.

భేష్! మనం బాగా పని చేశాం!

- వందేమాతరం, ఎస్ఐఆర్‌లపై ప్రభుత్వ వాదనను తిప్పికొట్టాం
- కాంగ్రెస్ ఎంపీలతో భేటీలో రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, డిసెంబరు 12: వందేమాతరం, ఎన్నికల సంస్కరణల అంశాలపై పార్లమెంటు ఉభయ సభల్లో ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు చిత్తు చేశాయని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. విపక్షాల దాడితో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిపోయి ఒత్తిడిని ఎదుర్కొందన్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల నేపథ్యంలో.. కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీలతో రాహుల్‌గాంధీ శుక్రవారం సమావేశమయ్యారు. వారితో మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. అనంతరం, పార్లమెంటు కాంప్లెక్స్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ, 150 ఏళ్ల వందేమాతరం, ఎస్ఐఆర్ ప్రక్రియలపై పార్లమెంటులో పోటాపోటీగా సాగిన చర్చ తనకు బాగా నచ్చిందని, అధికార పక్షం వాదనను తాము తుత్తునియలు చేశామన్నారు. ఎస్ఐఆర్‌పై చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గందరగోళంగా కనిపించారని, అందువల్లే ఓ అనుచిత పదాన్ని కూడా ఉపయోగించారని రాహుల్ విమర్శించారు. 'ఆయన మానసికంగా ఒత్తిడిలో ఉన్నారు. దానికి కారణం ఉంది. ఓట్‌చోరీ గురించి ఇప్పుడు యావత్ దేశానికి తెలిసిపోయింది' అని పేర్కొన్నారు. ఓట్‌చోరీ అంశంపై చర్చకు రావాలని రాహుల్ గాంధీ సవాల్ చేసినప్పుడు అమిత్‌షా వణికిపోయారని లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ ఎద్దేవా చేశారు.

హాజరుకాని శశిథరూర్

కాంగ్రెస్ ఎంపీల సమావేశానికి తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ హాజరుకాలేదు. శుక్రవారం ఓ పెళ్లికి వెళ్లాల్సి ఉందని, తన సోదరి పుట్టినరోజు వేడుక కూడా ఉందని ఎక్స్‌లో శశిథరూర్ ఓ పోస్ట్ పెట్టారు. పార్టీ సమావేశానికి ఆయన గైర్హాజరు కావటం ఈ మధ్య కాలంలో ఇది మూడోసారి. గత నెలలో సోనియాగాంధీ, మల్లికార్జునఖర్గే అధ్యక్షతన జరిగిన రెండు సమావేశాలకూ ఆయన హాజరు కాలేదు. అక్టోబరులో జరిగిన కాంగ్రెస్ కేరళ శాఖ సమావేశంలో మాత్రం ఆయన పాల్గొన్నారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ సమావేశాలకు సిద్ధం కావటానికి ఆ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఆ భేటీలో వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ కూడా పాల్గొన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ అధికారంలోకి వస్తే తనకు ముఖ్యమంత్రి పీఠం అప్పగించాలని శశిథరూర్ డిమాండ్ చేస్తుండగా.. కాంగ్రెస్ అధిష్ఠానం అందుకు సిద్ధంగా లేదని సమాచారం.

అది దీపస్తంభం కాదు.. సర్వే రాయి!

- తిరుప్పరంకుండ్రం వివాదంపై హైకోర్టుకు నివేదించిన తమిళనాడు ప్రభుత్వం

చెన్నై/న్యూఢిల్లీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం పర్వతంపై ఉన్నది దీపస్తంభం కాదని, అది సర్వే రాయి మాత్రమేనని తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టు మదురై బెంచ్‌కు నివేదించింది. తిరుప్పరంకుండ్రం పర్వత శిఖరాగ్రంపై ఉన్న రాతి స్తంభంపై కార్తీక దీపోత్సవం సందర్భంగా దీపాన్ని వెలిగించాలంటూ మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ మదురై జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌పై జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ రామకృష్ణన్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. మరోవైపు.. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ అభిశంసన యత్నం న్యాయవ్యవస్థను భయపెట్టేందుకేనని సుప్రీం కోర్టు, హైకోర్టు మాజీ జడ్జిల బృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. దానిని అడ్డుకోవాలని పార్లమెంట్ సభ్యులను గట్టిగా కోరింది. తమ రాజకీయాలు లేదా భావజాలాలను అనుగుణంగా లేని జడ్జిలను అభిశంసనతో బెదిరించాలని చూస్తున్నారని 56 మంది మాజీ జడ్జిల బృందం తమ సంయుక్త ప్రకటనలో మండిపడింది.

మార్చి నుంచి 60 టీటీడీ ఆలయాల్లో అన్నప్రసాదాలు

తిరుమల, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాలన్నింటిలో మార్చి నుంచి రెండు పూటా అన్నప్రసాద వితరణకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. తిరుమల తరహాలోనే టీటీడీ ఆలయాలన్నింటిలోనూ అన్నప్రసాదాల వితరణ చేయాలని సీఎం చంద్రబాబు సూచించడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీటీడీ పరిధిలో దేశవ్యాప్తంగా 60 ఆలయాలున్నాయి. ప్రస్తుతం 50 శాతానికి పైగా ఆలయాల్లో మధ్యాహ్నం అన్నప్రసాదాల వితరణ జరుగుతోంది. మార్చి మొదటివారం నుంచి మధ్యాహ్నం, రాత్రి సమయాలలోనూ ఈ 60 ఆలయాల్లో అన్నప్రసాదాలను అందిస్తారు. దీని కోసం అన్నప్రసాదం ట్రస్టులో ఉన్న నిధులతో పాటు శ్రీవాణి ట్రస్టు నుంచి నిధులను వినియోగించుకోవాలని టీటీడీ భావిస్తోంది. తొలిదశలో టీటీడీ నిధులతో అన్నప్రసాదాలు చేపట్టినా ఆ తర్వాత ఆయా ఆలయాల పరిధిలోని దాతల సహకారంతో వీటిని నడుపుతారు. హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు, కురుక్షేత్ర వంటి ప్రాంతాల్లోని టీటీడీ ఆలయాల నిర్వహణకు ఏడాదికి రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు ఖర్చు అవుతోంది. ప్రతి ఆలయంలో కనీసం రూ.60 కోట్లు కార్పస్ ఫండ్ సిద్ధం చేస్తే దానిపై వచ్చే వడ్డీ ద్వారా ఆలయాల నిర్వహణ తేలికవుతుందని టీటీడీ భావిస్తోంది.

జనవరి 23 నుంచి 'బీచ్ ఫెస్టివల్'

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భీమిలి, అరకు ఉత్సవాలను రద్దు చేసి అన్నీ కలిపి విశాఖ ఉత్సవ్‌తో కలిపి నిర్వహిస్తామని పేర్కొన్న పర్యాటక శాఖ జనవరి 23 నుంచి 31 వరకు 'బీచ్ ఫెస్టివల్' నిర్వహించనున్నట్టు ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం రుషికొండ ఏ-1 గ్రాండ్‌లో ఆవిష్కరింపజేశారు. విశాఖపట్నం నుంచి భీమిలి వరకూ బీచ్ ఫెస్టివల్, అలాగే అనకాపల్లి, అరకు లోయల్లో పర్యాటక ఉత్సవాలను ఒకే సమయంలో నిర్వహిస్తారు. ఏ తేదీల్లో ఏయే కార్యక్రమాలు ఉంటాయనే దానిపై కలెక్టర్లతో చర్చించి షెడ్యూల్ ప్రకటిస్తారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, చీఫ్ సెక్రటరీ విజయానంద్, పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, విశాఖ, అనకాపల్లి కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయకృష్ణన్ పాల్గొన్నారు.



బీచ్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

ఆర్టీసీ పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం
- ఎన్ఎంయూఏ మహాసభల్లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

విజయవాడ సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని పరిరక్షించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగుల వేస్తోందని ప్రజా రవాణా సంస్థ(ఏపీపీటీడీ) చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ప్రాధాన్యతా క్రమంలో కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం అమలులో ఉద్యోగులు, కార్మికులు, అధికారులు చేస్తున్న సహకారాన్ని కొనియాడారు. విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ద్వితీయ మహాసభలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సభలకు చైర్మన్ కొనకళ్ల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆర్టీసీ అభివృద్ధిలో కార్మికులు కీలక భాగస్వాములయ్యారని, కార్మికుల కృషి, సహకారం లేనిదే ప్రజా రవాణా వ్యవస్థ ఒక్క అడుగు ముందుకు వేయలేదని తెలిపారు.

ఎన్ఎంయూఏ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్షులుగా వై.శ్రీనివారావు, ప్రధాన కార్యదర్శిగా పి.వి.రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఈ మహాసభల్లో భాగంగా ఈ ఎన్నిక నిర్వహించారు. ఇరువురిని ఆయా పదవులకు సభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. మూడేళ్ల పాటు వీరు పదవుల్లో కొనసాగుతారు. అనంతరం కార్మికులు, ఉద్యోగుల సమస్య పరిష్కారంపై పలు తీర్మానాలు చేశారు.

రాష్ట్రాన్ని చెత్త దిబ్బగా మార్చిన వైసీపీ ప్రభుత్వం

- స్వచ్ఛాంధ్రకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు
- అనంతలో డంపింగ్ యార్డు పరిశీలనలో పట్టాభిరామ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చెత్తపై పన్ను వేసి రాష్ట్రాన్ని చెత్త దిబ్బగా మార్చిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. ఆ చెత్తను తొలగించి రాష్ట్రాన్ని స్వచ్ఛ, స్వర్ణాంధ్రగా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారన్నారు. అనంతపురంలోని డంపింగ్ యార్డులో బయో మైనింగ్‌ను శుక్రవారం ఆయన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్‌తో కలిసి పరిశీంచారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను ప్రజలపై రుద్దిపోయిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చేసేందుకు బయో మైనింగ్ ప్రక్రియకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని తెలిపారు. సుమారు 40 ఏళ్ల డంపింగ్ యార్డు సమస్యకు టీడీపీ కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా డంపింగ్ యార్డులు లేకుండా ఫ్రెష్ వేస్ట్ సాలిడ్ మేనేజ్‌మెంట్ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని చెప్పారు. గత ప్రభుత్వంలో పరకామణిలో మొదలుపెట్టి చెత్త, ఇసుక, మద్యం, మైనింగ్, దేవాలయాలు.. ఇలా అన్నింటా అక్రమాలు, దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు.

విద్య ఉన్నత ప్రమాణాలతో ఉండాలి

హిందూ భావజాలంతో కాదు

- ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య
- మోదీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోంది: జస్టిస్ చంద్రు



ఇటీవల నెల్లూరులో హత్యకు గురైన పెంచలయ్య చిత్రపటాన్ని, విప్లవ జ్యోతిని ఎస్ఎఫ్ఐ బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షుడు ఆదర్శ్ ఎం.సాధికి అందజేస్తున్న మాజీ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు

తిరుపతి (విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'విద్య అనేది హిందూ భావజాలంతో కాకుండా.. ఉన్నత ప్రమాణాలతో ఉండాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎస్ఎఫ్ఐ) జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య పేర్కొన్నారు. తిరుపతిలో మూడు రోజులపాటు జరిగే ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ర్యాలీ అనంతరం ఎస్వీజేఎన్ఎం గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేస్తోందని, ఇది దేశానికి ఎంతో చేటు కలిగిస్తుందన్నారు. అంబేడ్కర్, పూలే భావజాలంతో ఎస్ఎఫ్ఐ ముందుకు వెళుతుందని, తాము రాజా రామ్మోహన్‌రాయ్ వారసులమని తెలిపారు. ఇలాంటి భావజాలాన్ని అణచివేసేలా కేంద్రంలోని బీజేపీ కుట్రలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల ఐక్యత ద్వారా సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ అన్ని వ్యవస్థలనూ ధ్వంసం చేస్తున్నాయని మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రు ధ్వజమెత్తారు. బీజేపీ అంతర్లీన ఆలోచనలు వేరని... ప్రజలకు చెప్పేది మరొకటని.. మోదీ, అమిత్‌షా కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. పేద, మధ్యతరగతి పిల్లలకు ఉచిత విద్యకోసం ఎస్ఎఫ్ఐ పోరాడాలని పిలుపునిచ్చారు. 'ఈ 18 నెలల్లో ఒక తరగతి గదీ కట్టలేదు. రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వలేదు. అలాంటప్పుడు వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ ఎలా తీసుకొస్తారు' అని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ ప్రశ్నించారు. విద్యార్థులకు వాస్తవ చరిత్ర తెలియకుండా కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని తీసుకొస్తోందని ఎస్ఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నూతన విద్యావిధానాలవల్ల పేదలు, ముఖ్యంగా ఆదివాసీలు చదువుకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని జాతీయ కార్యదర్శి శిల్ప ఆవేదన వ్యక్తంచేశారు.

అవును.. నేను విన్నాను!

జయచంద్రారెడ్డి ఇంట్లోనే నకిలీ మద్యం తయారీపై చర్చ

- ఎక్సైజ్ పోలీసులకు సహాయకుడు వీరస్వామి అన్బురసు వాంగ్మూలం
- డైరీలో సంతకం చేసి కట్టా రాజు దగ్గర రూ.8 లక్షలు తెచ్చా
- జయచంద్రారెడ్డి సూచనతో ఆ నగదు పీఏ రాజేశ్ చేతికి
- ఆయన, గిరిధర్‌రెడ్డి, జనార్దన్‌రావు కలిసి పనిచేశారు
- ఆయన ఆదేశాలతో నా ఫోన్‌ను ధ్వంసం చేశా


వీరస్వామి అన్బురసు అలియాస్ బాబు

రాయచోటి/ములకలచెరువు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): "అవును.. నేను విన్నాను. జయచంద్రారెడ్డి ఇంట్లోనే నకిలీ మద్యం తయారీపైన చర్చ జరిగింది. నకిలీ మద్యం తయారు చేసి అమ్మితే భారీగా లాభాలు వస్తాయని అద్దేపల్లె జనార్దన్‌రావు చెప్పారు. ఇందుకు జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి, కట్టా సురేంద్రనాయుడు, రాజేశ్ అంగీకరించారు. జయచంద్రారెడ్డి తరపున నకిలీ మద్యం తయారీ ప్లాంటుకు వెళ్లి కట్టా రాజు డైరీలో సంతకం చేసి రూ.8 లక్షల నగదు తీసుకొచ్చాను. జయచంద్రారెడ్డి సూచన మేరకు ఆ మొత్తాన్ని ఆయన వ్యక్తిగత సహాయకుడు (పీఏ) రాజేశ్‌కు ఇచ్చాను".. అని ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుడు, టీడీపీ నుంచి సస్పెండైన తంబళ్లపల్లె నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఇంట్లో పనిమనిషి వీరస్వామి అన్బురసు అలియాస్ బాబు ఎక్సైజ్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం తయారీ, విక్రయం కేసులో ఏ19గా ఉన్న వీరస్వామి అన్బురసును ఈ నెల 10న ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. 11వ తేదీ రాత్రి తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచి, 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. కోర్టుకు సమర్పించిన వీరస్వామి అన్బురసు రిమాండ్ రిపోర్టు ప్రకారం.. 2021 నుంచి జయచంద్రారెడ్డి బావమరిది గిరిధర్‌రెడ్డితో అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2023లో జయచంద్రారెడ్డి ఇంట్లో నెలకు రూ.15 వేల వేతనంతో.. వ్యవసాయ పొలాలు, తోటల్లో పనులు పర్యవేక్షించే సహాయకుడిగా చేరాడు. 2024 ఎన్నికల్లో జయచంద్రారెడ్డికి టికెట్ రావడంతో.. ఆయన స్నేహితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు(ఏ1) విజయవాడ నుంచి వచ్చి ఎన్నికల ప్రచారం, ఇతర వ్యవహారాలను చూసుకునేవాడు. ములకలచెరువు మండలంలో జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్, పెద్దతిప్పసముద్రం మండలంలో కట్టా సురేంద్రనాయుడు పేర్ల మీద మద్యం దుకాణాలకు అనుమతులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ దుకాణాలలో నష్టాలు వచ్చాయి. దీంతో ఈ రెండు దుకాణాల నిర్వహణను తాను చూసుకుంటానని జనార్దన్‌రావు.. జయచంద్రారెడ్డి ఇతరుల సమక్షంలో ఒప్పుకొన్నాడు. నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తే భారీగా లాభాలు వస్తాయని జనార్దన్‌రావు చెప్పాడు. ఆ మాటలను అప్పుడు అక్కడే ఉన్న వీరస్వామి విన్నాడు. నకిలీ మద్యం తయారీకి బెంగళూరుకు చెందిన బాలాజీ స్పిరిట్, ముడి పదార్థాలు సరఫరా చేస్తాడని జనార్దన్‌రావు చెప్పడంతో అందరూ అంగీకరించారు. జనార్దన్‌రావు సూచనల మేరకు ఆయన తరపున నకిలీ మద్యం తయారీ ప్లాంటుకు వెళ్లి మూడు దఫాలుగా మొత్తం రూ.8 లక్షలు తీసుకుని కట్టా రాజు డైరీలో వీరస్వామి అన్బురసు సంతకం చేశాడు. తరువాత జయచంద్రారెడ్డి సూచనల మేరకు ఆ నగదును రాజేశ్‌కు అందజేశాడు. నకిలీ మద్యాన్ని బెల్టుషాపులకు సరఫరా చేసేందుకు జనార్దన్‌రావు.. అన్బురసుకు ఫోన్ చేసి జయచంద్రారెడ్డి ఇంట్లో ఉన్న నలుపు రంగు స్కార్పియో వాహనం తాళాలు డ్రైవర్ అష్రఫ్ (ఏ21) వచ్చినప్పుడల్లా ఇవ్వమని చెప్పాడు. డ్రైవర్ అష్రఫ్ నకిలీ మద్యం పెట్టెలను ఆ వాహనంలో తీసుకెళ్లి బెల్ట్‌షాపులకు సరఫరా చేసేవాడు. స్కార్పియోలో నకిలీ మద్యం సరఫరా జరుగుతోందని జయచంద్రారెడ్డికి తెలుసు. జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి, జనార్దన్‌రావు, రాజేశ్, కట్టా రాజు తరచూ నకిలీ మద్యం తయారీతో భారీ లాభాలు సంపాదించాలని సమన్వయంతో పనిచేశారు. ఇలా తయారు చేసిన నకిలీ మద్యాన్ని తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లోని మద్యం దుకాణాల ద్వారా బెల్టుషాపులకు సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. నకిలీ మద్యం కేసు నమోదైనప్పుడు జయచంద్రారెడ్డి ఆదేశాలతో తన ఫోన్‌ను ధ్వంసం చేశానని వీరస్వామి అన్బురసు ఎక్సైజ్ పోలీసులకు తెలిపాడు. ఆయన సూచనలతో మొత్తం డేటాను ఫార్మాట్ చేసి, ధ్వంసం చేసి ఫోన్‌ను పారేశానని చెప్పాడు. జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ సైతం.. ఆయన సూచనలతోనే తన రెండు ఫోన్లను ధ్వంసం చేశాడు.

తిరుపతికి చేరిన నెల్లూరు మేయర్ రాజకీయం!

- వైసీపీ ఎత్తుగడకు టీడీపీ బ్రేక్

నెల్లూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానం విషయంలో టీడీపీ పట్టు బిగించింది. ఈ నెల 18న అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గి తీరాలన్న నిర్ణయంతో మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ పక్షాన 37 మంది కార్పొరేటర్లు క్యాంపులో ఉన్నారు. వీరంతా తిరుపతిలోని ఓ స్టార్ హోటల్‌లో బస చేసినట్లు సమాచారం. వీరితోపాటు మరో ముగ్గురు వైసీపీ కార్పొరేటర్లు కూడా పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో వైసీపీ నాయకులకు ఊపిరాడటం లేదు. గురువారం సాయంత్రం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన ఐదుగురు కార్పొరేటర్లలో ఇద్దరు అరగంట వ్యవధిలోనే స్పందిస్తూ.. తాము టీడీపీలోనే కొనసాగుతున్నట్లు ప్రకటించారు. వాస్తవానికి గురువారం ఉదయం నుంచి చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో మేయర్ స్రవంతిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కొంత ఉత్కంఠ నెలకొంది. ఏడాది క్రితం టీడీపీలో చేరిన ఐదుగురు కార్పొరేటర్లు గురువారం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిలు ఈ ఫిరాయింపులకు నాయకత్వం వహించారు. దీంతో టీడీపీ నాయకుల్లో టెన్షన్ మొదలైంది. ఇబ్బందికర పరిస్థితులను గమనించి శరవేగంగా స్పందించిన టీడీపీ నాయకత్వం.. జగన్ సమక్షంలో చేరిన ఐదుగురిలో ఇద్దరు కార్పొరేటర్లను(5, 6వ డివిజన్లు) తిరిగి తమ వైపునకు తిప్పుకొంది. దీంతో టీడీపీ మ్యాజిక్ ఫిగర్‌ను అధిగమించింది. తమవైపు ఉన్న 37 మంది కార్పొరేటర్లను గురువారం రాత్రికి రాత్రే క్యాంపునకు తరలించారు. ప్రస్తుతం వీరంతా తిరుపతిలో బస చేసినట్లు తెలిసింది. దీంతో టీడీపీ బలం 40కి చేరింది. మ్యాజిక్ ఫిగర్(38) కన్నా రెండు ఓట్లు అధికంగా ఉండటంతో టీడీపీకి అనుకూలంగా అవిశ్వాసం నెగ్గే అవకాశాలు మెరుగుపడ్డాయి.

ఆరు నెలల గర్భిణి సహా భర్త బలవన్మరణం

- ఒకే చీరకు ఉరివేసుకుని జంట అనంతలోకాలకు.. నెల్లూరు జిల్లాలో ఘోరం


నరేష్, ప్రమీల

తోటపల్లిగూడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్యోన్యంగా ఉంటున్న ఆ జంటకు ఏ కష్టం వచ్చిందో తెలియదు. గర్భిణి అని కూడా ఆలోచించుకోకుండా ఆ దంపతులు ఒకే చీరకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం వరకవిపూడి దళితకాలనీకి చెందిన ఈదూరు నరేశ్ (34), వెంకటాచలం మండలం కొమ్మలపూడి గ్రామానికి చెందిన ప్రమీలతో (28) ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ముత్తుకూరు మండలం పైనాపురంలో ప్రైవేటు విద్యుత్ కంపెనీలో నరేశ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రమీల ఆరునెలల గర్భిణి కావడంతో పుట్టినింటికి వెళ్లింది. కాగా, అంగన్‌వాడీ కేంద్రంలో వేలిముద్ర వేయాలంటూ నరేష్ గురువారం ప్రమీలను వరకవిపూడికి తీసుకువచ్చి వేలి ముద్రలు వేయించాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన దంపతులు ఎవరూ లేనిసమయంలో ఒకే చీరకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. పొరుగూరు వెళ్లిన నరేష్ అన్న అశోక్ శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇద్దరూ ఉరికి వేలాడుతూ కనిపించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వీరేంద్రబాబు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను కిందకు దింపి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, దంపతులిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉంటారని, ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తమకే అంతుపట్టడం లేదని బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆకాంక్షిత జిల్లాల్లో దేశంలోనే తొలి స్థానంలో కడప

కడప, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత జిల్లాల్లో వైఎస్సార్ కడప జిల్లాకు దేశంలోనే మొదటి ర్యాంకు వచ్చింది. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ శుక్రవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాలను ఎంపిక చేశారు. వీటి మధ్య 56 అంశాలపై 140 పారా మీటర్‌లో పనితీరును అంచనా వేశారు. వైద్యం, వ్యవసాయం, తాగునీరు, పాఠశాలలు, అంగన్వాడీలు, అందుబాటులోని ఆర్థిక సేవలను మదింపు చేశారు. ఇందులో కడప జిల్లా దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. 73.6 రేటింగ్‌తో కడప జిల్లాకు మొదటి స్థానం రాగా, తమిళనాడులోని విరుద్‌నగర్ 66.4, మధ్యప్రదేశ్‌లోని దామోస్ 66.3, ఉత్తరాఖండ్‌లోని ఉద్దాంసింగ్‌నగర్ 64.9, తమిళనాడులోని రామనాథపురం 64.5 రేటింగ్‌తో తర్వాతి నాలుగు స్థానాలను దక్కించుకున్నాయి. 112 ఆకాంక్షిత జిల్లాల్లో కడప జిల్లాకు మొదట స్థానం రావడం పట్ల కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే కడప మొదటి స్థానానికి ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు.

కుమార్తెపై లైంగిక దాడి: తండ్రికి బతికున్నంత వరకు ఖైదు

నెల్లూరు(లీగల్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో ఓ తండ్రికి చనిపోయేంత వరకు ఖైదుతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మండల కేంద్రమైన వింజమూరుకు చెందిన వ్యక్తి తన 12 ఏళ్ల కుమార్తెకు చెప్పులు, బట్టలు తీసిస్తానని చెప్పి 2020, జూన్ 25వ తేదీన కలిగిరి మండలం సీతమ్మచెరువు తీసుకెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నేరేడుపల్లి గ్రామ సమీపంలో ఓ చెట్టు వద్ద కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు అందిన ఫిర్యాదుతో కలిగిరి పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయాధికారి బతికున్నంత వరకు ఖైదుతోపాటు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ.చంద్రశేఖర్ వాదించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆస్ట్రేలియా ఆదర్శం

పదహారేళ్ళలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడానికి ఆస్ట్రేలియా చేసిన ప్రయత్నం బాగుంది. దీర్ఘకాలం మల్లగుల్లాలుపడి, చివరకు ధైర్యంగా తెచ్చిన ఈ చట్టం రెండురోజులక్రితం అక్కడ అమలులోకి వచ్చింది. ఆశయం మంచిదే, ఆచరణే కష్టం.. అని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ స్వయంగా ఓ మాటన్నప్పటికీ, ఒకవేళ అనుకున్నంతగా విజయం కాక, వైఫల్యాలు ఎదురైనప్పటికీ, ఒక మాయాప్రపంచం నుంచి పిల్లలను రక్షించే సదుద్దేశంతో మొదలుపెట్టిన ఈ ప్రయత్నం ప్రశంసనీయమైనది.

వయసు, అనుభవం ఉన్నదనీ, తమకే అంతా తెలుసుననీ అనుకుంటున్న పెద్దలే ఈ సోషల్ మీడియా మాయలో పడి గింగిరాలు తిరుగుతూంటే, తెలిసీ తెలియని వయసు పిల్లలు దాని వలలో పడి, ప్రభావితులు కాకుండా ఉండటం అసాధ్యం. పసిహృదయాలపై దీని దుష్ప్రభావాలు, మానసిక రుగ్మతలమీద ఆస్ట్రేలియా ప్రభుత్వం లోతైన అధ్యయనాలు జరిపి, పదహారేళ్ళలోపు వారిని పూర్తిగా సోషల్ మీడియాకు దూరం పెట్టవలసిందేనని నిర్ణయానికి వచ్చింది. డిజిటల్ స్వేచ్ఛ అని మనం ముద్దుగా అంటున్నదానికి పూర్తి దూరంగా ఉన్నదేశాలు కూడా ఈ ప్రపంచంలో అనేకం. ఎత్తయిన గోడలు కట్టి పాక్షికంగా అనుమతిస్తున్న దేశాలూ ఉన్నాయి. పిల్లలను సోషల్‌మీడియాకు పూర్తిగా దూరం చేయడం సరికాదంటూ చిన్నాచితకా జాగ్రత్తలతో యథాతథంగా అనుమతిస్తున్న దేశాలే అధికం. కానీ, ఆస్ట్రేలియా మాత్రం ఎటువంటి మినహాయింపులూ ఇవ్వడానికి సిద్ధపడలేదు. ప్రధానిగా ఉన్నందుకు ఎన్నడూ తనకు ఇంత సంతోషం కలగలేదని, మిగతా ప్రపంచానికి ఆస్ట్రేలియా దారిచూపించిందని అల్బనీస్ గర్విస్తున్నారు. ఇదేదారిలో తూచ తప్పకుండా నడుస్తామని ఇప్పటికే కొన్ని దేశాలు ప్రకటించాయి. ఆస్ట్రేలియాలో మూడింట రెండు వంతులమంది ఓటర్లు, రాజకీయపక్షాలు ఈ నిర్ణయానికి అనుకూలంగా ఉండటం విశేషం. టెక్ కంపెనీలు తలెగరేయకుండా, తోకజాడించకుండా ఉండటానికే ఆస్ట్రేలియా ప్రభుత్వం మొన్న సెప్టెంబరులో ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితిలో ప్రస్తావించి, వయసు పరిమితి అవసరాన్ని నొక్కివక్కాణించి, మిగతా ప్రపంచాన్ని తనవైపు తిప్పుకొనే ప్రయత్నం చేసిందని అంటారు.

మెసేజింగ్ యాప్‌లు మినహా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, ఎక్స్, యూట్యూబ్ ఇత్యాది పది ప్లాట్‌ఫామ్‌లు ప్రస్తుతానికి ఈ నిర్ణయం పరిధిలోకి వస్తున్నప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని వచ్చిచేరవచ్చు. పదహారేళ్ళ లోపువారు ఈ వేదికల్లోకి చొరబడినపక్షంలో వారినీ, తల్లిదండ్రులనూ కాక, కంపెనీలనే భారీ పెనాల్టీలతో శిక్షించాలన్నది మంచి నిర్ణయం. అవి అనుసరించబోయే వయసు నిర్ధారణ విధానాలమీద అనుమానాలు, గోప్యత భయాలు ఉన్నప్పటికీ, ఉల్లంఘనలకు తావులేని రీతిలో చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యత పూర్తిగా వాటిదే. ఆదిలో వీరంగాలు వేసి, హెచ్చరికలు చేసిన టెక్ కంపెనీలు క్రమంగా చల్లబడ్డాయి.

తాము, తమ మిత్రులు నిషేధాన్ని ఎలా ఉల్లంఘించామో ప్రధానికే ఆస్ట్రేలియా పిల్లలు చెబుతున్నారట. విపిఎన్‌ల వాడకంతోపాటు, ఇతరత్రా అడ్డతోవల్లో ఈ అడ్డుగోడ ఛేదించేందుకు ఎక్కువమంది ప్రయత్నిస్తున్నారట. ఇవన్నీ తాము ఊహించనివేమీ కాదని, ఈ తరం పిల్లలు ఎంత ఘటికులో తెలుసునని ప్రభుత్వం అంటోంది. ఇప్పుడు నిషేధాన్ని మెచ్చుకున్నవారే రేపటి రోజుల్లో తమ పిల్లల నిరసన, ఒత్తిడి భరించలేక వ్యతిరేకంగా తయారయ్యే అవకాశమూ లేకపోలేదు. రిడిట్ చూపినదారిలో మిగతా కంపెనీలు కూడా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. సోషల్‌మీడియా వాడకాన్ని ఒక వ్యసనంలాగా మార్చివేసే ఆల్గరిథమ్స్‌నుంచి, విషపూరిత కంటెంట్‌నుంచి, ఆన్‌లైన్ అవమానాలు, వేధింపులు, బెదిరింపులనుంచి పిల్లలను కాపాడుకోవాలన్న ఈ ప్రయత్నం ప్రశంసనీయమైనది. ఎదిగేవయసులో ఈ ఉచ్చులో చిక్కి, చదువు, నిద్ర, ఆటకు దూరమై, సకల సామర్థ్యాలు భావోద్వేగాలు కోల్పోయి, వాస్తవిక ప్రపంచానికి దూరంగా మిగులుతున్నారు పిల్లలు. ఒక అబద్ధాల ప్రపంచంతో తమను పోల్చుకుంటూ ఆత్మన్యూనతలోకి జారిపోతున్నారు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులు చేతులెత్తేసిన ఒక తీవ్రమైన సమస్యని ఆస్ట్రేలియా ప్రభుత్వం నెత్తినెత్తుకొని, మిగతాదేశాలకు దారిచూపుతున్నందుకు సంతోషిస్తున్నవారే అధికం.

భావి భారతంపై వర్తమాన చర్చలేవీ?

సమస్త ప్రజల వారసత్వమే చరిత్ర. అది, సంప్రదాయ ఊరుమ్మడి భూములు లేదా అధునాతన ఇంటర్నెట్ లాంటి ఒక భాగస్వామ్య వనరు. దానిని నిష్పాక్షికంగా అర్థం చేసుకోవాలి, శ్రేయస్సును సమకూర్చేలా ఉపయోగించుకోవాలి. నిరంతర ప్రయోజనమున్న వనరు అది. మరి దీన్ని సక్రమంగా సార్థకం చేసుకుంటున్నామా? ఉమ్మడి వనరులను ఎవరైనా ఉపయోగించుకోవచ్చు కదా. అందుకే చరిత్ర.. రాసేవాడి, రాయించేవాడి దృక్కోణం ప్రకారం పదే పదే పునర్లిఖితమవుతూనే ఉంటుంది– తదనంతర అధ్యయనాలు, పరిశోధనలు పాత చరిత్రలలోని కల్పితగాథలు లేదా మిథ్యా సత్యాలను సప్రమాణంగా తిరస్కరించేవరకే సుమా! ఆర్యుల చరిత్రనే తీసుకోండి. ఆర్యులు ఉత్కృష్ట జాతివారని, భారత్ తదితర దేశాలను స్వాయత్తం చేసుకుని అక్కడి ప్రజలకు 'నాగరికత' అలవర్చారని 'యూరోపియన్ చరిత్రకారులు, సిద్ధాంత స్రష్టలు ఘంటాపథంగా చెప్పారు. అంధానుకర్తలు అయిన కొంతమంది భారతీయ చరిత్రకారులు ఆ వాదాన్నే బలపరిచారు. వాస్తవమేమిటి? ఆర్యజాతి శ్రేష్ఠత అనేది ఒక మిథ్య. ఇండో–ఆర్యన్లు మన గడ్డపై అడుగుపెట్టకపూర్వమే భారతదేశంలోని చాలా ప్రాంతాలలో పురాతన నాగరికతలు వర్ధిల్లాయి. పురావస్తు తవ్వకాలలో బయల్పడిన కీళడి నాగరికత అందుకొక ఉదాహరణ (తమిళనాడులోని శివగంగ జిల్లాలో వైగై నదీ తీరాన క్రీస్తుపూర్వం 3500 సంవత్సరాల నాటికే ప్రభవించిన పట్టణ నాగరికత అది).



■ పి. చిదంబరం

'పళని' పలుకు


అమెరికాను క్రిస్టోఫర్ కొలంబస్ 'కనుగొన్నాడు' అని మనం పాఠశాల చరిత్ర పుస్తకాలలో చదువుకున్నాం. అది అనేక విధాలుగా నిజం కాదు. ఇప్పుడు అమెరికాగా సుప్రసిద్ధమైన భూమిపై కొలంబస్ అడుగుపెట్టకపూర్వమే అనేక శతాబ్దాలుగా అక్కడ వేలాది స్త్రీ పురుషులు నివసించారు. సంఘటితంగా తమవైన నాగరికతలు నిర్మించుకున్నారు.

> **1937 నుంచి రెండు చరణాల జాతీయగీతంపై ఎవరూ ఎలాంటి వివాదాన్ని లేవనెత్తలేదు. ఇప్పుడు ఎందుకు లేవనెత్తుతున్నారు? ప్రజలు వర్తమానంలో ఎదుర్కొంటున్న సమస్యలను, జాతికి సమున్నత భవిష్యత్తును నిర్మించే లక్ష్య నిర్దేశాల గురించి పార్లమెంటు, ప్రభుత్వాలు పట్టించుకోవాలి. చరిత్ర వక్రీకరణ మహా చెడ్డ విషయం, దేశ సమైక్యత, సమగ్రతకు హానికరం. జాతి భవిష్యత్తు పట్ల నిర్లక్ష్యం క్షమార్హం కాని నేరం.**

కొలంబస్‌కు ఐదు సంవత్సరాల పూర్వమే ఉభయ అమెరికా ఖండాలకు నార్త్ వైకింగ్‌లు చేరుకున్నారని అధునాతన పరిశోధనలు రుజువు చేశాయి.

రాజకీయవేత్తలు తమ ఇష్టానుసారం చరిత్ర ప్రస్తావించడం కద్దు. చరిత్రను తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడమే వారి లక్ష్యం. జాతీయ గేయం 'వందేమాతరం'ను కాంగ్రెస్ పార్టీ ఛిన్నాభిన్నం చేసిందని భారతీయ జనతా పార్టీ, దాని నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వమూ ఆరోపించాయి. వందేమాతరం ఎందుకు 'National Anthem' కాలేక పోయిందనే విషయమై పార్లమెంటు ఉభయ సభలలో ఒక రోజంతా చర్చ జరగాలని బీజేపీ పట్టుబట్టింది. ఆ పార్టీ తరఫున చర్చలో పాల్గొన్నవారు వందేమాతరం గురించి తాము విశ్వసిస్తున్న 'చరిత్ర'ను ఏకరువుపెట్టారు. అది వక్రీకృత చరిత్ర. మరింత స్పష్టంగా చెప్పాలంటే అది 'Distory' (వక్రీకృత చరిత్ర భావనలు, వాటి కథన రీతులను మిళితం చేసే పదమది). డిస్టరీ కథనాలు వాస్తవాలను మార్చివేస్తాయి. నిర్దిష్ట భావజాలాలను పోత్సహిస్తాయి. అవగాహనలను నియంత్రిస్తాయి. తమ రాజకీయ అజెండాకు అనుగుణంగా చారిత్రక సంఘటనలకు తప్పుడు భాష్యం చెప్పడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానపాత్ర వహించారు. పార్లమెంటులో జరిగిన చర్చలో ఆయన ఇలా అన్నారు: '1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సమరం తరువాత, భారత దేశ పాలనను ప్రత్యక్షంగా చేపట్టిన బ్రిటిష్ వారు ఈ దేశ ప్రజలను అనేక ఒత్తిళ్లకు గురిచేస్తూ అన్ని విధాలా అణచివేస్తున్నారు. అప్పుడు బంకించంద్ర చటర్జీ తన కలాన్ని ఝుళిపించారు. వలసపాలకులను సవాల్ చేశారు. వారి అధర్మ పాలనను ప్రశ్నించారు. ఆ శక్తిమంతమైన ధిక్కారం నుంచి వందేమాతరం ప్రభవించింది'. ప్రధానమంత్రి ఇంకా ఇలా అన్నారు: '1937 అక్టోబర్ 15న లక్నోలో వందేమాతరం గీతంకు వ్యతిరేకంగా మహమ్మద్ అలీ జిన్నా ఒక నినాదాన్ని లేవనెత్తారు. ముస్లింలీగ్ జారీ చేసిన నిరాధార ప్రకటనలను దృఢంగా ప్రతిఘటించలేదు. ఖండించలేదు. ఆనాడు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ వందేమాతరంను జాతీయ గీతంగా గౌరవించడంపట్ల కాంగ్రెస్ నిబద్ధతను పునరుద్ఘాటించలేదు. పైగా జాతీయ గీతంగా వందేమాతరం అర్హతను ప్రశ్నించడం ప్రారంభించారు. 1937 అక్టోబర్ 20న నేతాజీ బోస్‌కు రాసిన ఒక లేఖలో వందేమాతరంపై జిన్నా వ్యతిరేకతను అంగీకరిస్తూ 'వందేమాతరం గీతం నేపథ్యం గురించి చదివాను. ఆ నేపథ్యం ముస్లింలను రెచ్చగొట్టే విధంగా భావిస్తున్నాను' అని నెహ్రూ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై నరేంద్ర మోదీ తన దాడిని ఇంకా ఇలా కొనసాగించారు: 'దురదృష్టవశాత్తు 1937 అక్టోబర్ 26న వందేమాతరంపై కాంగ్రెస్ రాజీపడింది. జాతి చైతన్యమంత్రంగా భాసిల్లుతున్న ఆ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే అంగీకరించింది. తద్వారా ముస్లింలీగ్‌కు కాంగ్రెస్ లొంగిపోయింది. ముస్లింలీగ్ నాయకుల ఒత్తిడిమూలంగా బుజ్జగింపు రాజకీయాలను అనుసరించడం ప్రారంభించింది. ఐఎన్‌సీ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) ఎమ్ఎమ్‌సీ (ముస్లిం లీగ్–మావోయిస్ట్ కాంగ్రెస్)గా అయిపోయింది' అన్నారు. 'జాతీయ గీతం వందేమాతరంను ముక్కలు చేయడం బుజ్జగింపు రాజకీయాలకు దారితీసింది. ఇది అంతిమంగా



దేశ విభజనకు కారణమయింది' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఇది అసంబద్ధమైన విమర్శ సందేహం లేదు. వివాదాస్పద చారిత్రక వివరణలు ఇచ్చేవారు సైతం నమ్మశక్యం కానిదిగా భావించే ఊహాత్మక ఆలోచన అది.

వందేమాతరం కాలక్రమాన్ని చూద్దాం: 1870లు: బంకించంద్ర చటర్జీ తన అజరామర గీతం వందేమాతరంలోని కొన్ని చరణాలు రాశారు. అవి అప్పుడు ప్రచురితం కాలేదు; 1881: ఆ గీతం విస్తృత రూపంలో 'ఆనంద్ మఠ్' నవల్లో ప్రచురితమయింది; 1905: స్వదేశీ ఉద్యమంలో నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహిస్తూ రవీంద్రనాథ్ ఠాగూర్ వందేమాతరంను ఆలాపించారు. ఆ ఉద్యమంలోనే వందేమాతరం రాజకీయ నినాదం అయింది; 1908: తమిళ కవి సుబ్రమణ్య భారతి 'వందేమాతరం' అనే పదబంధాన్ని తన సుప్రసిద్ధ పద్యం 'ఎంతాయియుమ్ థయమ్'లో ప్రస్తావించడం ద్వారా దానికి అమరత్వాన్ని సాధించారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ వందేమాతరం అని నినదించడం ప్రారంభించారు; 1930లు: మతతత్వ రాజకీయాలు పడగవిప్పాయి. వందేమాతరం వివాదాస్పదమయింది; 28 సెప్టెంబర్ 1937: వందేమాతరంపై పెరుగుతున్న వ్యతిరేకతపై సర్దార్ పటేల్‌కు రాసిన లేఖలో రాజేంద్రప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ గీతం పట్ల కాంగ్రెస్ విధానాన్ని స్పష్టం చేయాలని సూచించారు; 1937 అక్టోబర్‌లో కలకత్తాలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం సందర్భంగా వందేమాతరంపై రవీంద్రుడి సలహాను నేతాజీ బోస్ కోరారు; 17 అక్టోబర్, 1937: సీడబ్ల్యూసీ సమావేశంలో వందేమాతరం గురించి చర్చించాలని నెహ్రూకు రాసిన లేఖలో బోస్ కోరారు; 20 అక్టోబర్ 1937: వందేమాతరంపై వివాదాన్ని మతతత్వవాదులే సృష్టించారని, ఈ విషయమై రవీంద్రుడు, ఇతరులతో చర్చిస్తానని బోస్‌కు రాసిన లేఖలో నెహ్రూ పేర్కొన్నారు; 26 అక్టోబర్, 1937: వందేమాతరంలోని మొదటి భాగం స్ఫూర్తిదాయకమైనదని, అందులోని చరణాలు ఏ మతస్థులకూ అభ్యంతరకరం కావని, కాబోవని నెహ్రూకు రాసిన లేఖలో రవీంద్రుడు పేర్కొన్నారు; 28 అక్టోబర్, 1937: వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను జాతీయ గేయంగా సీడబ్ల్యూసీ అంగీకరించింది; జనవరి 1939: మహాత్మాగాంధీ సమక్షంలో వార్ధాలో జరిగిన సమావేశంలో వందేమాతరం మొదటి రెండు చరణాలను జాతీయ గేయంగా అంగీకరిస్తున్నట్టు సీడబ్ల్యూసీ పునరుద్ఘాటించింది.

ఒక National Anthem లేదా జాతీయ గేయానికి కొన్ని చరణాలు ఎంపిక చేయడమనేది అసాధారణమేమీ కాదు. మన National Anthem 'జనగణ మన' రవీంద్రుని సంపూర్ణ గీతానికి సంక్షిప్త రూపం.. చాలా దేశాల National Anthemలు సంపూర్ణ గీతాల సంక్షిప్త రూపాలే కావడం గమనార్హం. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గానీ, భారతీయ జనతా పార్టీ తొలి అవతారమైన భారతీయ జనసంఘ్ గానీ భారత స్వాతంత్ర్యోద్యమంలో ఎలాంటి పాత్ర నిర్వహించలేదు. అలాగే వందేమాతరం గేయాన్ని జనప్రియమైనదిగా చేయడంలో కూడా ఆ సంస్థలకు ఎలాంటి ప్రమేయం లేదు. ఈ వాస్తవాన్ని ప్రస్తావించకుండా దాటవేయడంలో నరేంద్ర మోదీ చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. నిజానికి ఆరెస్సెస్ 52 సంవత్సరాల పాటు తన జాతీయ ప్రధాన కార్యాలయంలో మువ్వన్నెల జెండా ఎగరవేయనేలేదు!

1937 నుంచి రెండు చరణాల జాతీయగేయంపై ఎవరూ ఎలాంటి వివాదాన్ని లేవనెత్తలేదు. ఇప్పుడు ఎందుకు లేవనెత్తుతున్నారు? ప్రజలు వర్తమానంలో ఎదుర్కొంటున్న సమస్యలను, జాతికి సమున్నత భవిష్యత్తును నిర్మించే లక్ష్య నిర్దేశాల గురించి పార్లమెంటు, ప్రభుత్వాలు పట్టించుకోవాలి. అవి వాటి విధ్యుక్తధర్మాలు. చైనా రాజ్యాంగ సంస్థలు రోబోలు, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, అంతరిక్ష పరిశోధనల, మహా సముద్రాల శోధన, డేటా సవాళ్లు; ఈ అధునాతన పరిణామాలు ధరిత్రిపై మానవ మనుగడను ప్రభావితం చేస్తోన్న, చేయబోయే తీరుతెన్నుల గురించి చర్చిస్తున్నాయి. వర్తమాన భారతీయ సమాజం పేదరికం నిర్మూలన, విద్యా వసతుల మెరుగుదల, ఆరోగ్యభద్రత, మౌలిక సదుపాయాల నిర్మాణం, వస్తుసేవలను సమృద్ధంగా అందరికీ అందుబాటులో ఉండేలా చేయడం, ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, వాణిజ్యలోటు, వాతావరణ మార్పు తదితర సమస్యలు, సవాళ్ల నెదుర్కొంటోంది. అసమానతల పెరుగుదల, జనాభా వృద్ధి, అంతర్గత వలసలు, లౌకికవాదం, అధునాతన వైజ్ఞానిక సాంకేతికతలు మొదలైనవి భావి భారత సమాజాన్ని సతమతం చేసే సవాళ్లు. చరిత్ర వక్రీకరణ మహా చెడ్డ విషయం, దేశ సమైక్యత, సమగ్రతకు హానికరం. జాతి భవిష్యత్తు పట్ల నిర్లక్ష్యం క్షమార్హం కాని నేరం.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

విప్లవ కవితా'జ్వాల'

"మబ్బుల కారణంగా కొన్నిసార్లు సూర్యోదయం ఆలస్యం కావొచ్చు కానీ.. కాకుండా పోదు"

జనం కవి జ్వాలాముఖి మనకు భౌతికంగా దూరమై నేటికి 17 సంవత్సరాలు గడిచిపోయాయి. 1938 ఏప్రిల్ 12న హైదరాబాద్ సీతారాంబాగ్‌లో జన్మించిన వీరవల్లి రాఘవాచారి– 1965 నుంచి దిగంబరకవి జ్వాలాముఖిగా ప్రసిద్ధుడయ్యారు. వృత్తిరీత్యా 12 సంవత్సరాలు హైస్కూల్ ఉపాధ్యాయునిగా, 24 సంవత్సరాలు కళాశాల లెక్చరర్‌గా ఉన్నారు. కవిగా, మహావక్తగా, విరసం, జనసాహితి వ్యవస్థాపక నాయకులలో ఒకరిగా, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, గ్రామీణ పేదల సంఘంలో చురుకైన కార్యశీలిగా, భారత్–చైనా మిత్రమండలి కేంద్ర నాయకునిగా చిర ప్రతిష్ఠను పొందారు.

ఆయన పేరు, ఆ కవితాస్ఫూర్తి, ఆ విప్లవ వాగ్వైభవం ఇప్పటికీ సజీవంగా జ్వలిస్తూ, చైతన్యాన్ని రగిలిస్తూనే ఉన్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ, పరిస్థితులు మరింత దిగజారుతూ ఆయన రచనలు, భావాలు మరింత ఎక్కువ ప్రాసంగికతను సంతరించుకుంటున్నాయి. ఆయన కవిత్వాన్ని లోతుగా పరిశీలించవలసిన ఆవశ్యకత, వాటికి తిరిగి ప్రాచుర్యం కలిగించవలసిన అవసరం అధికమవుతున్నది. జన విప్లవ విజయం పట్ల విశ్వాసం, మంచి భవిష్యత్తును నిర్మించుకోగలమనే అపారమైన నమ్మకం ఆయన సాహిత్యానికి ఆయువు పట్టు. ఒక రకమైన నిర్వేదం, నిరాశ సమాజాన్ని కమ్ముకుంటున్న వేళ ఆయన సాహిత్యాన్ని తిరిగి చదువుకోవటం మనలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. ఉద్యమాల తప్పిదాలను సరిచేసుకునే దృష్టిని కలిగిస్తుంది. అందుకే ఈనాడు ఆయన కవితల ప్రస్తావన విప్లవాభిమానుల తలపులలోకొస్తున్నది.



జ్వాల తన కవితాయానపు తొలి రోజుల్లో (1958) రాసిన 'మనిషీ' దీర్ఘకవితకు పెద్దల ప్రశంసలు లభించాయి. "నీ కవిత్వం మానవత్వంలో నవత్వం/ నీ నవత్వం మానవత్వంలో కవిత్వం/ ఫలిస్తుంది బాలమునీ నీ తపస్సు" అని కరుణశ్రీ తన ఆశీస్సులు అందజేశారు. దాశరథి "శ్రీ వీరవెల్లి రాఘవాచార్యుల గేయాలు చూశాను. అభ్యాసంతో బాగా మెరుగెక్కగలవిగా కనిపిస్తున్నాయి. ఈ గేయాల్లో విద్యున్మాలలు ఉన్నాయి" అని ప్రోత్సహించారు. ఆ సమయంలో 'వీరా' పేరుతో ఆయన కొన్ని పాటలు, మహా ప్రభాత గేయాలు రాశారు. 1957లోనే "రాకపోతుందా– ఆకలి ఆర్బటిలో కూటికి ప్రాకులాడే కూలీ యుగము రాకపోతుందా", "రక్త కొలనులో మానవత్వపు సహస్రదళ సౌగంధిక సురభిళ పుష్పం వికసించకపోతుందా?" అని మరో దీర్ఘకవిత రాశారు. ఆ దశలోని ఆలోచనా ధోరణికి ప్రతీకగా మనం మనిషీ కావ్యాన్ని గ్రహించవచ్చు.

ఆ తరువాత దిగంబర కవుల మూడు సంపుటాలు (దిక్కులు), 'ఓటమి తిరుగుబాటు' కవితాసంపుటి; ఆటవిక న్యాయాన్ని తలపించే ఉరిశిక్షకు ఆధునిక కాలంలో స్థానం ఉండకూడదని, అది రద్దుకావాలని కోరుకునే మానవీయ మకరంద భావాల స్వరం 'వేలాడిన మందారం' నవల; 'కాళ్ళు చేతులు ఆడిస్తే ఒడ్డుకు వస్తవు, తలవంచితే మునిగి పోతవు. ఈత ఎట్లా తెగించి నేర్చుకున్నవో గట్లనే బతుకు నేర్చుకో' అన్న జీవన చలనసూత్రాలను నేర్పించే జ్వాల కథల సంకలనం 'కథాజ్వాల'; మత విద్వేష కల్లోలంలో ఎగిసిన రసార్ద్ర జ్వాల, శోషిత స్వప్నాల విచలిత దుఃఖగానం భస్మ సింహాసనం (మూడు దీర్ఘకవితల సంకలనం); వైరుధ్యాల మధ్య సంఘర్షణల ద్వారా పొందిన భావ పరిణామ వికాస ప్రతిఫలనం, జ్వాలాముఖి సుదీర్ఘ కవితాయానం కవితా జ్వాల; "అన్ని పరిణామాలకు కర్తలు, భర్తలు భారత శ్రామికులు. వాళ్ళు రాజకీయ విప్లవాలకెలా నాయకులో విప్లవ సాహిత్యానికి కూడా అలానే నాయకులు" అని గుర్తించి, వారు సృష్టించిన ఎర్రని మైలురాళ్లకు ప్రతిధ్వనిగా వినిపించిన కొన్ని ఉపన్యాసాల, వ్యాసాల సంకలనం వ్యాస జ్వాల, ఈవరకే తెలుగు సాహిత్యంలో మేలు ఆనవాళ్లుగా నిలిచాయి. ఆయన అనువాదం చేసిన 'దేశదిమ్మరి ప్రవక్త శరత్‌బాబు, రాంగేయ రాఘవ జీవిత చరిత్ర'లను కేంద్ర సాహిత్య అకాడమి గతంలో ప్రచురించింది.

జ్వాల జీవన సహచరి శ్రీమతి సీతాదేవి ఈ ఏడాది సెప్టెంబర్ 15న కన్నుమూశారు. ఆమె జ్వాలాముఖికి ఎంతో వెన్నుదన్నుగా, అక్షరాల సహచరిగా చరించారు. ఆ దంపతుల స్మృతికి నీరాజనంగా జ్వాల కవితా సంకలనమైన 'కవితా జ్వాల'ను జ్వాల ప్రచురణలు మరోమారు ముద్రించి కొత్తతరం పాఠకులకు అందిస్తున్నది.

● డాక్టర్ యస్.జతిన్‌కుమార్

(హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో డిసెంబర్ 14న జ్వాలాముఖి వర్ధంతి సభ. నిఖిలేశ్వర్, దర్భశయనం శ్రీనివాసాచార్య, నాళేశ్వరం శంకరం, విజయ రంగనాథం, ఏ.వి.రామాచారి పాల్గొంటారు.)

ఆంధ్ర సారస్వతానికి 'కీట్స్'

ఆయన రచనల్లోనూ, జీవితంలోనూ కూడా ఎక్కువ కవిత్వం ఉంది అనేలా రచన సాగించిన సుప్రసిద్ధ కవి బసవరాజు అప్పారావు. సంగీత పరిజ్ఞానం ఉన్నందువల్ల, గాయకుడు కావడంవల్ల ఆయన లయాత్మకంగా పాడగలరు. ఆయన సందర్శించని క్షేత్రం లేదు. స్పృశించని భావకవితా శాఖ లేదు. ఇంతా చేసి ఆయన జీవించింది 39 సంవత్సరాలే! జీవితంలో కదిలించిన ప్రతి అనుభూతిని గీతంగా మలచుకున్న కవి అప్పారావు. ఆయనకు టెన్నిస్ ఆడటమన్నా, ఊటీకి వెళ్లడమన్నా చాలా ఇష్టం. ఆయన రాసిన "కొల్లాయిగట్టితేనేమి..., నల్లవాడే గొల్లపిల్లవాడే..., ఆ మబ్బు ఈ మబ్బు..., వేణు మనోహర గానము..., మనుజుల విభజన ఏలా..." పాటల్ని 1938 నాటి 'మాలపిల్ల' సినిమాలో ఉపయోగించారు. భార్య రాజ్యలక్ష్మి సౌదామిని కలం పేరుతో ఆయన కవితలు వెలువరించారు. భర్త సాంగత్యంలో కవిత్వం పట్ల ఆసక్తి పెంపొందించుకుని కవయిత్రిగా ఎదిగానని ఆమె స్వయంగా చెప్పుకున్నారు.

అప్పారావు 1894 డిసెంబర్ 13న ఉమ్మడి కృష్ణా జిల్లాలోని విజయవాడ సమీపంలో పటమటలో పిచ్చయ్య, వెంకమ్మ దంపతులకు జన్మించారు. న్యాయ విద్యను అభ్యసించారు. కొంతకాలం ఆంధ్రపత్రికలో పనిచేశారు. ఆయనకు తెలుగుతో పాటు, ఇంగ్లీష్ భాషపై కూడా మంచి పట్టు ఉంది. ఆయన రాసిన లలితగీతాలని టంగుటూరి సూర్యకుమారి గానం చేశారు. ఆయన 1933 అక్టోబర్ 6న తుదిశ్వాస విడిచారు. ప్రముఖ ఆంగ్ల కవి జాన్ కీట్స్ చిన్న వయసులోనే అద్భుతమైన కవిత్వం రాసి, ఆంగ్ల సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు. ఆయన బాటలోనే అప్పారావు పయనించారు. అందుకే ఆయనను 'ఆంధ్ర సారస్వతానికి కీట్స్' అని పిలుస్తారు.

– యం.రాంప్రదీప్, తిరువూరు

(నేడు బసవరాజు అప్పారావు జయంతి)


శాంత వసంత అవార్డుల ప్రదానోత్సవం

హైదరాబాద్ ఆబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో డిసెంబర్ 14 ఉదయం 10 గంటలకు శాంత వసంత ట్రస్టు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ప్రముఖ అవధాని, కథకుడు, సంస్కృతాంధ్ర భాషా పండితుడు బేతవోలు రామబ్రహ్మంకు డా. వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం అందజేయనున్నారు. వరప్రసాద్‌రెడ్డి తన తండ్రి పేరిట ఇచ్చే వెంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న అవార్డును వ్యాఖ్యాత, వక్త, ఆధ్యాత్మిక గాయకుడు, సుజన రంజని అకాడమీ వ్యవస్థాపకులు మహీధర సీతారామశర్మ స్వీకరిస్తారు. అలాగే శాంత వసంత ట్రస్టు కొత్తగా ప్రవేశపెట్టిన వసంత ప్రసాద్‌రెడ్డి సంగీతరత్న పురస్కారాన్ని ఫణి నారాయణకు అందజేయనున్నారు. ఈ అవార్డుల కింద లక్ష రూపాయలు, జ్ఞాపిక, సన్మానపత్రం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో డా. వై.శివరామ ప్రసాద్ రచించిన 'ఇదం శరీరం శ్రీచక్రం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

– శాంత వసంత ట్రస్టు, హైదరాబాద్

పొట్టిశ్రీరాములు త్యాగానికి తగిన గుర్తింపునివ్వాలి!

'పరుల కోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికనీ!' అన్న కవి వాక్కుకు అనుగుణంగా జీవించారు పొట్టిశ్రీరాములు. 'కష్టాలలో వున్న వారి కన్నీరు తుడిచే శక్తి ప్రసాదించు ప్రభూ!' అని పరమాత్మను వేడుకున్న రంతిదేవుని ప్రార్థనలకు ఆకృతినిచ్చినవాడు ఆయన. అమరజీవి మరణం ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకే కాకుండా, భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికీ దోహదం చేసింది. అంతే కాదు, ఆమరణ నిరాహారదీక్షకు పూర్వం కూడా ఆయన ఖాళీగా కూర్చున్నదే లేదు. నిత్యం ఏదో ఒక ప్రజాసమస్యపై పోరుతో తలపడుతూనే వెళ్ళేవారు. ఆయన ఒక్కడే ఓ పెద్ద సైనిక పటాలంతో సమానం. పొట్టి శ్రీరాములు వంటి యోధులు 20మంది ఉంటే ఒక్క ఏడాదిలో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధిస్తానని ఒకానొక సందర్భంలో శ్రీరాములు కార్యదక్షతపై గాంధీజీ వ్యాఖ్యానించారు. దళితుల ప్రయోజనాల నిమిత్తం, అస్పృశ్యతా నిర్మూలన కోసం అహోరాత్రులు యుద్ధమే చేశారు. అంటరానితనం నివారణకై శాసనాలు చేయించేందుకై దీక్షలు చేశారు. సహపంక్తి భోజనాల కోసం కాలాన్నెంతో వెచ్చించారు. స్వాతంత్ర్య పోరాటయోధునిగా దండి యాత్ర నుంచి మూడు పర్యాయాలు కారాగార వాసం చేశారు. దళితులు దేవాలయ ప్రవేశం కోసం యెడతెగని సమరం చేసి ఫలితం సాధించారు.



మితిమీరిన మదరాసీల ఆగడాలతో అవమానాలపాలవుతూ, అణచివేతకు గురవుతున్న తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఆశించి 1952 డిసెంబర్ 15న పొట్టిశ్రీరాములు ప్రాణాన్ని బలిదానమిచ్చారు. శ్రీరాములు ఆత్మత్యాగంతో మందకొడిగా మొదలైన ప్రజాగ్రహం దావానలంలా మారి అప్పటి తెలుగు ప్రాంతాలన్నీ అగ్నిగుండంలా ఎగసిన తరువాతే నాటి ప్రధాని నెహ్రూ కళ్ళు తెరిపిళ్ళు పడ్డాయి. డిసెంబర్ 19న రాష్ట్ర ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసిన ప్రధాని నెహ్రూ 1953 మార్చి 25న పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటుకు విధి విధానాలపై 'వాంఛూ' కమిషన్ ఇచ్చిన నివేదికను ఆమోదిస్తూ అధికారికంగా నూతన రాష్ట్ర నిర్మాణాన్ని ధృవపరిచారు. ఈ మేరకు 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. విస్తృత ప్రయోజనాల రీత్యా 1956 నవంబర్ 1న ఆంధ్ర, హైదరాబాద్ (తెలంగాణ) రాష్ట్రాలు విలీనమై 'ఆంధ్రప్రదేశ్'గా అవతరించింది. రెండు ప్రాంతాలకు పొసగని నేపథ్యంలో 2014 జూన్ 2న తిరిగి 'ఆంధ్రా', 'తెలంగాణ' రాష్ట్రాలుగా 'ఆంధ్రప్రదేశ్' విడిపోయింది. విడిపోయిన ఆంధ్రరాష్ట్రానికి సమైక్య రాష్ట్ర అవతరణ దినోత్సవం నవంబర్ 1వ తేదీ ఎట్లా నప్పుతుంది?

ప్రాణం అమూల్యమైనది. ప్రాణత్యాగం మహోన్నతమైనది. ఒక మనిషి ఇంతకు మించి చేయదగిన అర్పణ మరొకటేముంటుంది! తన అవసరాలకు కాకుండా, ప్రజల సౌభాగ్యం కోరి తనను తాను బలిపెట్టుకున్న అమరజీవి పట్ల హృదయం పట్టనంత కృతజ్ఞత చూపడం ఆంధ్ర రాష్ట్ర వాసులుగా మనందరి విధి. ఆయన విగ్రహానికి పూలదండలు వేసి సరిపుచ్చే మొక్కుబడి కార్యక్రమాల నుంచి వెలుపలికి రావాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో 'అమరజీవి స్మృతివనం' ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధం చేశారు. ఇదో హర్షణీయమైన అడుగు. ఇందుకు చంద్రబాబు అభినందనీయుడు. ఐతే స్మృతివనం మాత్రమే ఆ మహనుభావుని అనితర సాధ్యమైన త్యాగంతో సరితూగదు. పొట్టిశ్రీరాములు ఆత్మత్యాగంతో సాధించిన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని, ఆయన వర్ధంతి రోజైన డిసెంబర్ 15న గానీ, జయంతినాడైన మార్చి 16న గానీ... ఏదో ఒక తేదీని ఎంచుకొని జరపడం ఉత్తమంగా ఉంటుంది. ఆయన జయంతినాడు అన్ని ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించడం ద్వారా, సెలవు ప్రాధాన్యతనీ, శ్రీరాములు బలిదానాన్ని నెమరుకు తేవాలి. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, కళాశాల విద్యలో ప్రతి తరగతిలోనూ పొట్టి శ్రీరాములు జీవితం, పోరాటాలు, ప్రాణదానంపై ఒక పాఠ్యాంశాన్ని విధిగా ఉంచాలి. వర్ధంతి రోజున అన్ని రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనూ, విద్యాసంస్థల్లోనూ అధికారికంగా నివాళులు అర్పించి, అంజలి ఘటించే కార్యక్రమాలను చట్టబద్ధం చేయాలి. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నామం నుంచి నెల్లూరును తొలగించి పొట్టిశ్రీరాములు జిల్లాగానే నమోదు చేస్తూ జీవో తేవాలి. ఆయన ముఖ చిత్రంతో ఒక నాణాన్ని విడుదల చేసే విధంగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనను పంపాలి.

■ వై.హెచ్.కె.మోహన్‌రావు
కవి, రచయిత

(డిసెంబర్ 15: పొట్టిశ్రీరాములు వర్ధంతి)


ఉద్దానంను జిల్లాగా ప్రకటించాలి

ఉత్తరాంధ్రలో సముద్రతీరాన్ని ఆనుకుని విస్తరించిన పచ్చని భూములు, కొబ్బరి తోటలు, పనసపండ్ల సువాసన, చేపల వేటతో సందడిగా ఉండే తీర గ్రామాలు కలిసిన ప్రాంతం ఉద్దానం. సహజసిద్ధమైన అందాలు మాత్రమే కాకుండా ఎంతో సుసంపన్నమైన ప్రాంతం ఇది. అయితే ఇన్ని సహజవనరులు ఉండి కూడా ఉద్దానం ప్రజల జీవితం దశాబ్దాలుగా ప్రశాంతంగా లేదు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధులతో వేలాదిగా ప్రజలు బాధపడుతుండడం అందరికీ తెలిసిన విషయమే. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి, ప్రాంతీయ అభివృద్ధిని వేగవంతం చేయడానికి, ప్రజలకు పరిపాలన దగ్గర చేయడానికి, ఉద్దానంను ప్రత్యేక జిల్లాగా ప్రకటించడం అవసరం. ఇది ఒక పరిపాలనా చర్య మాత్రమే కాదు, సామాజికన్యాయం పరంగా, ఆరోగ్య పరంగా, ఆర్థికాభివృద్ధి పరంగా, పర్యాటక పరంగా తీసుకోవాల్సిన నిర్ణయం.

భౌగోళికంగా పరిశీలించినా ఉద్దానం పెద్ద ప్రదేశం. శ్రీకాకుళం జిల్లాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం జిల్లా కేంద్రం నుంచి చాలా దూరంగా ఉంటుంది. ప్రజలు సాధారణ ప్రభుత్వ సేవలు పొందడానికి కూడా గంటల తరబడి ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. రవాణా సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు చేరుకోవడం చాలా కష్టమవుతుంది. జిల్లా కేంద్రం దూరంగా ఉండటం వల్ల పరిపాలనలో ఉండే ఆలస్యం, పథకాల అమల్లో జాప్యం, ప్రజలకు వేగంగా సేవలు అందకపోవడం వంటివన్నీ ఈ ప్రాంత అభివృద్ధిని నిలువరించాయి. ఉద్దానం జిల్లాగా ఏర్పడితే ఈ సమస్యలు చాలా వరకు తగ్గిపోతాయి. ఎందుకంటే చిన్న జిల్లాలు పరిపాలనను ప్రజలకు దగ్గరచేస్తాయి. అధికారులు మెరుగ్గా పర్యవేక్షించగలుగుతారు, దాంతో పథకాలు ప్రజలకు చేరతాయి. సరైన ప్రణాళికలతో అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం అన్ని రకాలుగా ఎదుగుతుంది.

కొత్త జిల్లా ఏర్పడితే ఈ ప్రాంతంలో ప్రత్యేక వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, మత్స్యరంగ అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు కావడానికి సౌలభ్యం ఏర్పడుతుంది. దీనివల్ల యువతకు ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయి. జిల్లా కేంద్రం ఉద్దానంలో ఉంటే, కొత్త వైద్య కళాశాలలు, ప్రత్యేక ఆసుపత్రులు, డయాలసిస్ కేంద్రాలు, గ్రామస్థాయి హెల్త్ సెంటర్లు ఏర్పడటం వేగవంతం అవుతుంది. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు రావడం, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు పెరుగుతాయి. రాజకీయంగా కూడా ఉద్దానం జిల్లా ఏర్పడితే ఈ ప్రాంత సమస్యలు రాష్ట్ర స్థాయిలో మరింత బలంగా వినిపిస్తాయి. ఇన్ని కారణాల వల్ల ఉద్దానంను జిల్లాగా ప్రకటించాలి.

– అప్పన్న గొనప, విశాఖపట్నం





అతివేగం.. ఐదుగురు బలి

- దోనేపూడిలో కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాలీ ఆటో...ముగ్గురు కూలీల మృతి
- కొత్తపాలెంలో ఎదురెదురుగా బైకులు ఢీకొని ఇద్దరు దుర్మరణం

భట్టిప్రోలు, కొల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అతివేగం.. ఐదుగురు ప్రాణాలను బలితీసుకుంది. శుక్రవారం జరిగిన రెండు ఘటనలు ఐదుగురు కుటుంబాలను విషాదంలో నింపాయి. కొబ్బరికాయల కూలికి వచ్చి వాటి కిందే పడి ముగ్గురు మృతి చెందిన ఘటన కొల్లూరు మండలం దోనేపూడి-కోటిపల్లి గ్రామాల మధ్య జరిగింది. పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం వద్ద ఎదురెదురు రెండుబైక్‌లు వేగంగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. భట్టిప్రోలు మండలం



మృతులు ఇస్మాయిల్, శ్రీనివాసరావు, కాంతారావు



కొత్తపాలెం వద్ద ఘటనా స్థలంలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఎం.వెంకటశివకుమార్, సిబ్బంది

చింతమోటు గ్రామానికి చెందిన సమ్మెట పోతురాజు తన కుమారుడు గణేష్ ట్రాలీ ఆటోలో చెరుకుపల్లి, బాపట్ల తదితర ప్రాంతాలకు కొబ్బరికాయల ను తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం కొల్లూరు మండలం ఈపూరులంక, చింతలంక గ్రామాల్లో తోటల్లోని చెట్ల నుంచి కొబ్బరికాయలను చింతమోటు గ్రామానికి చెందిన కూలీలు చాట్రగడ్డ కాంతారావు(50), పెసర్లంక శ్రీనివాసరావు(55), వెల్లటూరుకు చెందిన షేక్ ఇస్మాయిల్‌లతో సేకరించారు. అనంతరం ట్రాలీ ఆటోలో కాయలను లోడు చేసి కూలీలతో వెళ్తుండగా దోనేపూడి-కోటిపల్లి గ్రామాల మధ్య వాహనం అదుపు తప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో కొబ్బరి బొండాలపై కూర్చుని ఉన్న నలుగురిలో ముగ్గురు కూలీలు కాల్వల్లో (మిగతా 7వ పేజీలో)

ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్రం పూజ్య బాపు గ్రామీణ ఉపాధి హామీ పథకం (మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్రం శుక్రవారం మార్చింది) అమలు చేస్తోంది. ఈ లక్ష్యానికి తూట్లు పొడిచే విధంగా క్షేత్రస్థాయి ఆడిటింగ్‌లో అనేక అక్రమాలు దర్శన మిస్తున్నాయి. బోగస్ జాబ్‌కార్డులతో రూ.కోట్లలో నిధులు స్వాహా పర్వం యథేచ్ఛగా నడుస్తోంది. పథకం పక్కదోవ పట్టడాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకున్నాయి. ప్రతి కార్మికుడు ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) చేయించు కోవడాన్ని తప్పనిసరి చేసింది. సెప్టెంబరు నుంచి నవంబరు చివరి వరకు ప్రతి జాబ్‌కార్డు విషయంలో ఈ కసరత్తు జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో 76 వేల బోగస్ కార్డులను గుర్తించి తొలగించారు.

ఇక శ్రామికులకే.. ఉపాధి

బోగస్ జాబ్‌కార్డులకు చెక్



చినగంజాం మండలం కొత్తపాలెం గ్రామంలో ఈ కేవైసీ చేపడుతున్న సిబ్బంది (పాత చిత్రం)

- మూడు జిల్లాల పరిధిలో 76 వేలు గుర్తింపు
- ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతో గుట్టురట్టు
- కొత్త దరఖాస్తులకు అవకాశం

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లాలో ప్రస్తుతం జాబ్ కార్డులు 3,16,753 ఉండగా, ఈ-కేవైసీ ప్రక్రియ ద్వారా 38,000 కార్డులను పథకానికి అనర్హతగా తేల్చారు. అదే విధంగా బాపట్ల జిల్లాలో 30,000 కార్డులు బోగస్‌గా తేలగా, తుది లెక్కల ప్రకారం జాబ్ కార్డుల సంఖ్య 2,47,000గా తేలింది. గుంటూరు జిల్లాలో 1,25,765 జాబ్‌కార్డులు ఉండగా, ఈకేవైసీ డ్రైవ్‌లో 8,000 కార్డులను అధికారులు తొలగించారు. గడచిన మూడు నెలల వ్యవధిలో బాపట్ల జిల్లాలో 3,000 కొత్తకార్డులు జారీ చేయగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే పది వేల వరకు ఉన్నట్లు తెలుస్తోంది.

పెద్ద ఎత్తున పనులు

పూజ్య బాపు గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాల్లో పెద్ద ఎత్తున (మిగతా 7వ పేజీలో)

అర్హతే ప్రామాణికంగా..

జాబ్‌కార్డు అందించే విషయంలో అర్హతే ప్రామాణికంగా ఉండాలనే ఆదేశాలు గతంలోనే ప్రభుత్వం నుంచి అందాయి. కొత్తగా జాబ్‌కార్డు కోసం మూడు జిల్లాల పరిధిలో దాదాపు 20,000 దరఖాస్తులు రాగా వీటిలో 10,000 వరకు అర్హత ఉన్నవాటిగా గుర్తించి ఆమో దించారు. ప్రభుత్వ పథకాల విషయంలో స్థానికంగా ఉండే నేతల సిఫారసులు కూడా నిబంధనలకు లోబడే ఉండాలని, అతి జోక్యం కూడా తగదనే సున్నితమైన హెచ్చరికలు ఇటీవలే పాలక పార్టీల అధిష్టానాల నుంచి రావడంతో ఆయా విభాగాలు అర్హతే కొలమానంగా జాబ్ కార్డులు జారీ చేస్తున్నారు.

ముగిసిన ఏఎన్‌యూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ 6



నేడు నవోదయ పరీక్ష

3609 మంది విద్యార్థులకు 14 కేంద్రాలు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్టు 2026 నిర్వహణకు జిల్లాలో 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే పరీక్షకు 3609 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులు 30 నిమిషాలు ముందుగా కేంద్రానికి రావాలని అసిస్టెంటు కమిషనర్ హుస్సేన్ తెలిపారు. పరీక్షా కేంద్రాల తనిఖీకి తహసీల్దార్ల నేతృత్వంలో 8 ఫ్లైయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు.

తెనాలిలో 'మీనాక్షి' మెరుపులు

సినీ నటి మీనాక్షి చౌదరి శుక్రవారం ఆంధ్రా పారిస్ తెనాలిలో సందడి చేశారు. స్థానిక బోస్‌రోడ్డులోని ఓ షాపింగ్ మాల్‌ను రిబ్బన్ కత్తిరించి ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. మీనాక్షిని చూసేందుకు ప్రజలు, అభిమానులు ఆసక్తి చూపారు. - తెనాలి 6

కబడ్డీ విజేతలు విశాఖ, పల్నాడు



ప్రథమ స్థానంలో పల్నాడు జిల్లా బాలుర జట్టు క్రీడాకారులకు షీల్డ్, నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, రాము తదితరులు 6

విలీనం.. వద్దు

- 11 గ్రామాల ప్రతిపాదనలపై వ్యతిరేకత
- నగరాభివృద్ధి చేయండి.. తర్వాత గ్రామాలను చూద్దాం
- కౌన్సిల్ తీర్మానాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామన్న మేయర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థలో 11 గ్రామాల విలీనాన్ని కార్పొరేటర్లు వ్యతిరేకించారు. తొలుత గుంటూరు నగరాన్ని అభివృద్ధి చేయాలని.. ఆ తర్వాత మాత్రమే గ్రామాల గురించి ఆలోచిద్దామని తేల్చిచెప్పారు. గుంటూరు రూరల్ మండల పరిధిలోని 11 గ్రామాల విలీనంపై శుక్రవారం జీఎంసీ అత్యవసర కౌన్సిల్ సమావేశం మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో పాల్గొన్న కార్పొరేటర్లు 11 గ్రామాలు విలీనానికి సంబంధించి అందిన ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేవన్నారు. టీడీపీ కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరాం ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ నగరంలోని అనేక ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత కౌన్సిల్‌పై ఉందన్నారు. నగరాన్ని ఆనుకుని ఉన్న పెదకాకాని, వెనిగండ్ల, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, రామచంద్రపాలెం, అగతవరప్పాడు గ్రామాలను విలీనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని వదిలేసి పది కిలోమీటర్ల దూరంగా ఉన్న మల్లవరం, చిన పలకలూరు, జొన్నలగడ్డలను కలపటం ఏంటని ప్రశ్నించారు. గతంలో కమిషనర్‌గా ఉన్న కీర్తి చేకూరి అనధికార లేఅవుట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్ రిజిస్ట్రార్లకు లేఖలు రాశారని, అయినా రిజిస్ట్రేషన్లు జరుగు తున్నాయన్నారు. కార్పొరేటర్లు అశోక్ యాదవ్, ధనలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ పాత గుం టూరులో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రస్తుతానికి గ్రామాల విలీనాన్ని నిలిపివేయాలని కార్పొరేటర్లు సమత, పద్మశ్రీ, భారతి, శ్రీవల్లి కోరారు. గ్రామాల్లో ప్రజలకు తెలియకుండా అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవద్దని డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు తెలిపారు. శంకర్ విలాస్ రైల్వే బ్రిడ్జిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని కార్పొరేటర్ అంబేద్కర్ కోరారు. విలీన గ్రామాల్లో కలుపుకుంటే జనాభా 10 లక్షలు దాటుతుందని, విజయవాడ, విశాఖ నగరాలతో పోటీగా గుంటూరుకు కూడా నిధులు వస్తాయని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. 11 గ్రామాల విలీనంపై కౌన్సిల్ తీర్మానాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామని మేయర్ తెలిపారు. గ్రామాల విలీనం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని విలేకర్లకు ఆయన తెలిపారు.



సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రవీంద్ర, హాజరైన కార్పొరేటర్లు.

పల్లెలు.. పరిశుభ్రం

- చెత్త సేకరణలో గుంటూరు ప్రథమం
- పల్నాడు ఐదో ర్యాంకు.. బాపట్ల జిల్లాకు 9వ ర్యాంకు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఎక్కడంటే అక్కడ చెత్త చెదారాలు.. రోడ్లపైనే మురుగు.. ఆహ్వానం పలికే చెత్తకుప్పలు.. దుర్వాసనతో నిండి ఉండే పల్లెలు.. ప్రస్తుతం పరిశుభ్రతకు నెలవుగా మారాయి. గతంలో పల్లెకు ఎవరైనా ప్రముఖులు వస్తుంటేనే పరిశుభ్రత కనిపించేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మున్సిపాల్టీల్లో జరిగినట్లుగా ఇంటింట చెత్త సేకరణతో పాటు వ్యర్థాల నిర్వహణకు పంచాయతీలు చర్యలు తీసుకుంటున్నాయి. ఆయా పనుల పర్యవేక్షణకు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు వస్తుండటంతో పల్లెలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. కాగా ప్రజల నుంచి పారిశుధ్యంపై ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం)సర్వే కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టింది. ఈ క్రమంలో పంచాయతీల పరిధిలో జరుగుతున్న



గ్రామాల్లో చెత్తసేకరణను పర్యవేక్షిస్తున్న జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు

చెత్త సేకరణలో ప్రజల్లో సంతృప్తి స్థాయితో గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే కొత్త రికార్డు నెలకొల్పింది. 2025లో గుంటూరు జిల్లా ప్రథమ ర్యాంకు సాధించింది. డిసెంబరులో వచ్చిన ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజలు 79.4 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సర్వేలో

మొదటి ర్యాంకు సంతోషకరం

చెత్త సేకరణలో గుంటూరుకు రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు రావడం సంతోషం కలిగించే అంశం. ఏడాది అంతా అధికార యంత్రాంగం ఎంతో కష్ట పడింది. ప్రజల సంతృప్తి స్థాయి పెంచేందుకు కృషి చేస్తున్నాం.

- వీర్ల జ్యోతి బసు, సీఈఓ, జిల్లా పరిషత్

పల్నాడు జిల్లా 71.6 శాతం సంతృప్తితో రాష్ట్రంలో ఐదో స్థానం దక్కించుకుంది. బాపట్ల జిల్లా 69.5 శాతం సంతృప్తితో 9వ స్థానంలో నిలిచింది.

ప్రత్యేకంగా పర్యవేక్షణ

పంచాయతీల్లో పారిశుధ్యానికి పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ పరిపాలన సంస్కరణలు తీసుకువచ్చారు. అందులో (మిగతా 7వ పేజీలో)

సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

రైతన్నా.. మీ కోసంలో కలెక్టర్ అన్సారియా

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలె క్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం, దాని అనుబంధ రం గాల జిల్లా స్థాయి సదస్సు శుక్రవారం కలెక్టరేట్‌లోని శం కరన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలో భాగంగా వ్యవసాయం లాభదాయక పరిశ్రమ స్థాయిలో ఉండాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేందుకు సమగ్ర కార్యాచరణ ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి మాట్లా డుతూ ప్రస్తుత రబీసీజన్లో 70,663 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి ఇప్పటి వరకు 11,395 ఎకరాల్లో పంటలు వేశారన్నారు. జిల్లాలో దాదాపు మూడు లక్షల ఎకరాలకు సాగునీటి లభ్యత ఉందన్నారు. వేసవిలో పంటలతో స్థూల విలువ ఆధారిత పెంచవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ ముఖ్య శాస్త్రవేత్త డా.సి.వి.రమణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వీ శంకర్, పశు సంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు కేవీవీ సత్యనారాయణ, ఉద్యానశాఖ ఉప సంచాలకుడు రవీంద్రబాబు, జిల్లా మత్స్యశాఖ అధికారి పీఎస్ కిరణ్‌కుమార్, శాస్త్ర వేత్త లు చంద్రమోహన్ రెడ్డి, శైలజ, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటరత్నం, ప్రగతిశీల రైతులు టి.శివరాంరెడ్డి, శ్రీధర్, నాదెండ్ల ధనుంజయరావు, మోహన్‌రెడ్డి, మిరప ఎగుమతుల సంఘం కార్య దర్శి తోట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కందిపప్పు.. కనుమరుగు



- బియ్యం, పంచదారతో రేషన్ సరి
- ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో హడావుడి
- రెండునెలల పాటు రాగులు, జొన్నలు సరఫరా
- ఈ నెలలో ప్రకటనలకే పరిమితమైన జొన్నల పంపిణీ

ప్రకటనలకే పరిమితం

ప్రతినెలా రేషన్ ద్వారా కందిపప్పుతో పాటు చిరుధాన్యాలను కూడా అందిస్తామని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదట్లో ప్రకటించింది. అయితే తొలుత ఒకటి రెండు నెలలు కందిపప్పు సరఫరా చేసి ఆ తర్వాత చేతులెత్తేసింది. కిందటేడాది ఒక నెల జొన్నలు, మరో నెల రాగులు సరఫరా చేసి ఆ తర్వాత వాటికీ స్వస్తి చెప్పింది. తాజాగా డిసెంబరులో కార్డుకు 3 కిలోల జొన్నలు ఇస్తామని ప్రకటించింది. అయితే డిసెంబరు రెండో తేదీకే రేషన్ షాపుల్లో జొన్నలు కనిపించలేదు. ఆశగా జొన్నలు కోసం వెళ్లిన కార్డుదారులకు డీలర్ల సమాధానాలతో నిరాశ పడ్డారు. ఉత్తిత్తి ప్రకటనలు ఎందుకంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు చౌక ధరల్లో నిత్యావసరాలు అందజేయాల్సిన పౌర సరఫరాల శాఖ కేవలం బియ్యం, పంచదార పంపిణీకే పరిమితమైపోతోంది. గత ఐదేళ్లుగా రేషన్ షాపులు అంటే కేవలం బియ్యం సరఫరా కేంద్రాలుగా మారాయి. కందిపప్పు పంపిణీ ఊసే పాలకులు మరిచారు. గత వైసీపీ ప్రభుత్వం పౌర సరఫరాల వ్యవస్థను నిర్వీర్యం చేయగా దీనిని సరిదిద్ది గాడిన పెడతామని హడావుడి చేసిన కూటమి ప్రభుత్వం ఒకటి రెండు నెలలు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేసింది. ఫలితంగా పేదలు అర్ధాకలితో సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 17 లక్షల రైస్ కార్డులు ఉండగా సుమారు 50 లక్షల మంది లబ్ధి దారులకు సరుకులు అందించాలి. ప్రతి నెలా ఒకరికి 5 కిలోల బియ్యంతో పాటు, కుటుంబానికి అరకిలో పంచ దార, కిలో కందిపప్పు గతంలో అందించేవారు. గతంలో నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు పామాయిల్, చింత పండు, గోధుమపిండి వంటి వాటిని కూడా సబ్సిడీపై అందించేవారు. కాగా గత వైసీపీ ప్రభుత్వం క్రమంగా వాటిని తగ్గిస్తూ వచ్చింది. ఒక్క బియ్యం మినహా మిగిలిన సరుకులను రకరకాల కారణాలతో తగ్గిస్తూ వచ్చింది. 2022 నుంచి పంచదార, కందిపప్పు సరఫరా పదోవంతుకు పడిపోయింది. మూడు జిల్లాలకు కలిపి 1700 టన్నుల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉండగా 4 టన్నుల కందిపప్పు కూడా పౌర సరఫరాల శాఖ సరఫరా చేయలేదు. ఫలితంగా నూటికి 70 కుటుంబాలకు కంది పప్పు అందుకునే భాగ్యాన్ని కోల్పోయాయి. 2023కు వచ్చే సరికి పరిస్థితి మరింత దిగజారిపోయింది. జూలైలో 17 లక్షల కిలో లకు 935 కిలోలు మాత్రమే సరఫరా చేసింది. 2024, 2025 సంవత్సరాల్లో (మిగతా 7వ పేజీలో)

రోడ్డు ప్రమాదాలు ఎక్కువ ఇక్కడే

- జిల్లాలో టాప్‌టెన్ పోలీస్ స్టేషన్ల గుర్తింపు
- 'ప్రత్యేక రోడ్డు భద్రత డ్రైవ్' చేపట్టిన పోలీసులు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న టాప్ 10 పోలీస్ స్టేషన్లను పోలీసులు గుర్తించారు. నల్లపాడు, వెస్ట్ ట్రాఫిక్, తాడేపల్లి, ఈస్ట్ ట్రాఫిక్, మేడికొండూరు, పెదకాకాని, మంగళగిరి రూరల్, చేబ్రోలు, మంగళగిరి టౌన్, తాడికొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు 'ప్రత్యేక రోడ్ సేఫ్టీ డ్రైవ్' చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు 'ప్రత్యేక రోడ్డు భద్రత డ్రైవ్' నిర్వహించారు.



చలికాలం రాగానే నల్లని సింగాడాలు రాశులు పోసి కనిపిస్తుంటాయి. వీటిని మధ్యకు కోస్తే లోపల తెల్లని పదార్థం కమ్మటి రుచితో ఉంటుంది. దీన్ని ఎండబెట్టి పిండి పట్టించి నిల్వ చేసుకుంటారు. పూజలు, వ్రతాలు, ఉపవాసాలప్పుడు ఈ పిండితో రకరకాల వంటకాలు చేసుకుని తింటూ ఉంటారు. ఎన్నో పోషకాలతో నిండిన సింగాడాలను సరికొత్తగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

వంటిల్లు

సింగాడాతో సింపుల్‌గా...





ఖీర్

కావాల్సిన పదార్థాలు

సింగాడాలు- ఒక కేజీ, పాలు- రెండు లీటర్లు, బాదం పప్పులు- పది, పిస్తా పప్పులు- పది, జీడిపప్పులు- పది, కిస్‌మిస్‌లు- పది, చక్కెర- ఒక కప్పు, యాలకులు- అయిదు

తయారీ విధానం

బాదం, పిస్తా, జీడిపప్పులను చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. కుక్కర్‌లో సింగాడాలు వేసి రెండు గ్లాసుల నీళ్లు పోసి మూతపెట్టి ఒక విజిల్ వచ్చే వరకు ఉడికించాలి. తరువాత వీటిని చల్లార్చి తొక్క తీసి బ్లెండర్‌లో వేయాలి. అందులో ఒక గ్లాసు పాలు పోసి మెత్తగా బ్లెండ్ చేయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి మిగిలిన పాలు పోసి మరిగించాలి. అందులో సింగాడా పేస్ట్, చక్కెర వేసి గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు చిక్కగా మారి దగ్గరకు వచ్చిన తరువాత యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఆపైన బాదం, పిస్తా, జీడిపప్పు పలుకులతోపాటు కిస్‌మిస్‌లు చల్లి సర్వ్ చేసుకోవాలి.

షాహి కర్రీ

కావాల్సిన పదార్థాలు

సింగాడాలు- 20, ఉల్లిపాయలు- రెండు, నెయ్యి- రెండు చెంచాలు, జీలకర్ర- ఒక చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, టమాటా గుజ్జు- ఒకటిన్నర కప్పులు, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- ఒక చెంచా, కారం- ఒక చెంచా, పసుపు- అర చెంచా, జీడిపప్పు పేస్టు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, గరం మసాలా పొడి- అర చెంచా, కసూరి మేథి- ఒక చెంచా, ఫ్రెష్ క్రీమ్- రెండు చెంచాలు, నిమ్మరసం- రెండు చెంచాలు, కొత్తిమీర- కొద్దిగా

తయారీ విధానం

- కుక్కర్‌లో సింగాడాలు వేసి ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి ఒక విజిల్ వచ్చే వరకు ఉడికించాలి. తరువాత వాటికి తొక్క తీసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలను సన్నగా తరగాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి అందులో నెయ్యి వేసి వేడిచేయాలి. ఆపైన జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరువాత టమాటా గుజ్జు వేసి కలపాలి. పాన్ మీద మూతపెట్టి పది నిమిషాలు ఉడకనివ్వాలి. తరువాత ధనియాల పొడి, జీలకర్ర పొడి, కారం, పసుపు, జీడిపప్పు పేస్టు వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరువాత ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి, తగినంత ఉప్పు వేసి మరోసారి బాగా కలపాలి. ఈ గ్రేవీ మిశ్రమం బాగా ఉడికి దగ్గరకు వచ్చాక గరం మసాలా పొడి, కసూరి మేథి, ఫ్రెష్ క్రీమ్ వేసి కలపాలి. తరువాత ఉడికించిన సింగాడాలు వేసి కలిపి మరో అయిదు నిమిషాలు ఉడకనివ్వాలి. చివరగా నిమ్మరసం కలిపి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ సింగాడా షాహి కర్రీ... వేడి అన్నం, చపాతీల్లోకి బాగుంటుంది.

సలాడ్



కావాల్సిన పదార్థాలు

తాజా సింగాడాలు- 12, కీరా- ఒకటి, వేయించి పొట్టు తీసిన పల్లీలు- రెండు చెంచాలు, ఎండుమిర్చి- మూడు, కొత్తిమీర తరుగు- ఒక చెంచా, పుదీనా ఆకులు- అయిదు, నిమ్మకాయ- ఒకటి, ఉప్పు- తగినంత, పంచదార- అర చెంచా

తయారీ విధానం

- తొక్క తీసిన సింగాడాలను ఒక గిన్నెలో వేసి నిండా చల్లటి నీళ్లు పోసి పది నిమిషాలు నానబెట్టాలి. తరువాత వాటిని సన్నని చక్రాల్లా కోయాలి. కీరాను కూడా తొక్కతీసి నాలుగు ముక్కలుగా కోయాలి. మధ్యలో ఉన్న గింజల భాగాన్ని కోసి తీసివేయాలి. తరువాత కీరాను సన్నని పొడవైన ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. బ్లెండర్‌లో పల్లీలు, ఎండు మిర్చి ముక్కలు వేసి కచ్చాపచ్చాగా బ్లెండ్ చేయాలి.
- వెడల్పాటి గిన్నెలో సింగాడా చక్రాలు, కీరా ముక్కలు, పల్లీలు-ఎండు మిర్చి మిశ్రమం, ఉప్పు, పంచదార, నిమ్మరసం, కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు వేసి బాగా కలపాలి. అంతే సింగాడా సలాడ్ రెడీ..!


భోజన కుతూహలం

చేదులో చైతన్యం కాకరకాయ

చేదుగా ఉంటుందని చాలా మంది కాకర కాయ తినరు. కానీ కాకరలో అనేక పౌష్టిక గుణాలు ఉన్నాయని మన పూర్వీకులు గుర్తించారు. అందుకే భోజనకుతూహలం గ్రంథంలో - "శరీరంలోని అణువణువులోకి చొచ్చుకుపోయే శక్తి కాకరకు ఉందని" పేర్కొన్నారు. ఈ కాకరకాయలో దాగి ఉన్న విశేషాలేమిటో చూద్దాం..

- తెలుగులో కాకరగా ప్రసిద్ధి పొందితే- దీనిని ఉత్తరాదిన 'కరేలా' అని పిలుస్తారు. సంస్కృతంలో జఠరాగ్నికి 'కాక' అనే పర్యాయ పదం కూడా ఉంది. ఈ కాకను పుట్టించే కాయ కాబట్టి దీనికి కాకరకాయ అనే పేరు వచ్చింది.
- కాకర కఫాన్ని, వాతాన్ని హరిస్తుంది. దగ్గు, జ్వరాలతో బాధపడేవారికి ఇది ఒక మంచి ఆహారం. ఇది తేలికగా అరుగుతుంది.
- కాకరకు కడుపులో ఉండే నులిపురుగులను వెళ్లగొట్టే గుణం ఉంది. అందువల్ల కనీసం వారానికి ఒక సారైనా కాకరను తినటం మంచిది.
- కాకరలో చరంటిన్, మొమొర్డిసిన్, కుకుర్బిటాసిన్ లాంటి రసాయనాలు ఉన్నాయి. వీటికి మధుమేహ సమస్యను నియంత్రించే శక్తి ఉందని పరిశోధనల్లో తేలింది.
- కేవలం శరీరంలో ఉండే చక్కెర నిల్వలనే కాదు.. కొవ్వును కరిగించే శక్తి కూడా కాకరకు ఉంది.
- చర్మ వ్యాధులు వచ్చినప్పుడు- కాకర ఆకుల గుజ్జును రాస్తే గాయాలు త్వరగా మానతాయి.
- ప్రతి రోజు క్రమం తప్పకుండా ఒక పావు కప్పు తాజా కాకరకాయ రసాన్ని తీసుకుంటే రక్తంలోని దోషాలన్నీ తొలగిపోతాయి.
- కాకర కాయ ముక్కలను ఎండబెట్టి పొడి చేసుకొని తింటే మంచి ఫలితాలు లభిస్తాయి. కాకర ఆకులను ఎండబెట్టి రోజు టీ కాచుకొని తాగితే ఎసిడిటీ తగ్గుతుంది.

- గంగరాజు అరుణాదేవి



మనం ఇంట్లో దుస్తులను ఇస్త్రీ చేసేటప్పుడు ఇస్త్రీ పెట్టె అడుగు భాగంలో నల్లటి మరకలు ఏర్పడుతూ ఉంటాయి. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే గట్టి పొరలా మారతాయి. దీంతో ఇస్త్రీ చేసేటప్పుడు దుస్తుల మీద పెట్టె సరిగా కదలదు. అలాకాకుండా ఇస్త్రీ పెట్టెను సులువుగా ఎలా శుభ్రం చేయాలో చూద్దాం...

- ఇస్త్రీ పెట్టెను కాటన్ లేదా లినెన్ మోడ్‌లో పెట్టి బాగా వేడి చేయాలి.

ఇస్త్రీ పెట్టె తళతళ

- టేబుల్ మీద పాత న్యూస్ పేపర్ లేదా బ్రౌన్ పేపర్ బ్యాగ్‌ను పరచాలి. దాని మీద అయిదు చెంచాల గళ్ల ఉప్పును సమంగా చల్లాలి.



- బాగా వేడెక్కిన ఇస్త్రీ పెట్టెను ఉప్పు మీద గట్టిగా అదిమి పెట్టి ఇస్త్రీ చేస్తున్నట్లు ముందుకు, వెనక్కు, గుండ్రంగా రుద్దాలి. దీంతో ఇస్త్రీ పెట్టెకు అంటుకుని ఉన్న జిడ్డు, నల్లటి పొరలు, మరకలు తొలగిపోతాయి.
- ఇస్త్రీ పెట్టెను చల్లారనివ్వాలి. తరువాత చేతి రుమాలు లేదా పలుచని గుడ్డతో శుభ్రంగా తుడవాలి. మరకలన్నీ పోతాయి.
- ఒకవేళ ఇంకా మరకలు కనిపిస్తుంటే దానిమీద రెండు చెంచాల బేకింగ్ సోడా, రెండు చెంచాల నీళ్లు కలిపిన పేస్టును రాయాలి. పావు గంట తరువాత తడి గుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది.

మేకప్



మెడకూ... చేతులకూ..!

మేకప్‌తో ముఖం వెలిగిపోతూ ఆకర్షణీయంగా మారిపోతుంది. మరి మెడ, చేతులు నిర్జీవంగా ఉంటే, ముఖానికి వేసుకున్న మేకప్ ఎబ్బెట్టుగా కనిపిస్తుంది కదా? అందుకే ముఖంతో పాటు మెడ, చేతుల మీద కూడా దృష్టి పెట్టాలి. అందు కోసం...

- **సిలికాన్ ప్రైమర్:** మెడ, చేతుల మీద ఏర్పడే సన్నని లైన్లు, ముడతలు కనిపించకుండా చేయడం కోసం, మేకప్‌కు ముందు సిలికాన్ ప్రైమర్ అప్లై చేయాలి. దీంతో చర్మం నునుపుగా మారి గీతలు మటుమాయమవుతాయి. టింటెడ్ ప్రైమర్‌తో ఓపెన్ పోర్స్‌ను కూడా దాచేయవచ్చు. ఇందుకోసం ప్రైమర్ అప్లై చేసి, తడి స్పాంజ్‌తో బ్లెండ్ చేయాలి. మెడ, చేతుల మీద డార్కర్ ఏరియాలను సరి చేయడం కోసం కన్‌సీలర్ కంటే ముందు కలర్ కరెక్టర్‌ను కూడా ఉపయోగించవచ్చు.
- **మాయిశ్చరైజర్:** మెడ మీద చర్మం పలుచగా ఉంటుంది కాబట్టి తేలికగా పొడిబారిపోతూ ఉంటుంది. కాబట్టి ముఖంతో పాటు తప్పనిసరిగా మెడకూ, చేతులకూ మాయిశ్చరైజర్ అప్లై చేస్తూ ఉండాలి. అప్పుడే గీతలు, మచ్చలు, ముడతలు ఏర్పడకుండా ఉంటాయి.
- **ఫౌండేషన్:** లిక్విడ్ లేదా క్రీమ్ ఎలాంటి ఫౌండేషన్‌ను ఎంచుకున్నా, ముఖం, మెడ మీద సమానంగా పరుచుకునేలా తడిపిన స్పాంజీతో అప్లై చేసుకోవాలి. అలాగే, అవసరానికి మించి ఫౌండేషన్ ఉపయోగిస్తే, మెడ మీది ముడతల్లో ఇరుక్కుపోయి, ముడతలు స్పష్టంగా కనిపించే ప్రమాదం ఉంటుంది. కాబట్టి తగుమాత్రంగానే ఉపయోగించాలి.
- **బ్లష్:** చెక్కిళ్ల మీద అప్లై చేసుకునే బ్లష్‌ను కొద్ది పరిమాణంలో మెడ, చేతుల మీద అప్లై చేసుకోవడం వల్ల, ముఖం, మెడా, చేతులు ఒకే రంగులో కనిపించే అవకాశం ఉంటుంది.
- **విటమిన్ సి సీరమ్:** విటమిన్ సితో కూడిన సీరమ్ లేదా మాయిశ్చరైజర్ ఉపయోగించడం వల్ల యువి ఎక్స్‌పోజర్‌తో కలిగే ఫ్రీ ర్యాడికల్ డ్యామేజీ నుంచి మెడకూ, చేతులకూ రక్షణ దక్కుతుంది. కాబట్టి ఈ జాగ్రత్తలు పాటించాలి.

వీటికి పురుగులు చేరవు

మనం రకరకాల మొక్కలను పెంచుతూ ఉంటాం. కొన్నింటికి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ పురుగులు చేరడం, చీడపీడలు ఆశించడం చివరికి అవి ఎండిపోవడం చూస్తూ ఉంటాం. ఎంతకాలమైనా క్రిమికీటకాలు చేరకుండా ఆరోగ్యంగా పెరిగే మొక్కల గురించి తెలుసుకుందాం...



అగ్లోనెమా: ఇది ఇండోర్ ప్లాంట్. దీనిని ఇంట్లో ఏ గదిలోనైనా చక్కగా పెంచుకోవచ్చు. మట్టిలో కొద్దిపాటి ఫంగస్ ఉన్నా కూడా అది మొక్కకు చేరదు.

మధుమాలతి: ఇది ఇంటి బయట పెంచుకునే తీగ మొక్క. ఇది పొడవుగా పైకి పాకుతూ తెల్లని, ఎర్రని పూలను గుత్తులు గుత్తులుగా పూస్తుంది. ఈ పూలు తేలికైన సువాసనను వెదజల్లుతూ ఉంటాయి. ఈ మొక్కను ఒకసారి నాటితే ఏళ్ల తరబడి ఆరోగ్యంగా పెరుగుతూనే ఉంటుంది.





ప్యాషన్ ఫ్లవర్: ఈ మొక్క గుబురుగా పెద్దగా పెరుగుతుంది. ఇంటి ఆవరణలో పెంచుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. వెడల్పాటి పెద్ద సైజు కుండీలో కూడా పెంచుకోవచ్చు. దీని పూలు రాఖీల్లా కనిపిస్తాయి. ఈ మొక్కకు మట్టి కొద్దిగా తేమగా ఉంటే చాలు. చాలా ఏళ్ల మనగల్గుతుంది.

ముత్యాల ముగ్గు

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫోటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్
features@andhrajyothy.com



చిత్రజ్యోతి
SINCE 1965

ప్రేక్షకులు ఘన విజయం ఇచ్చారు



రామ్ ఆచంట, గోపి ఆచంట

'అనివార్య కారణాల వల్ల 'అఖండ 2: తాండవం' విడుదల ఒక వారం ఆలస్యం అయింది. ఇందుకు బాలయ్య బాబు, దర్శకుడు బోయపాటి శ్రీను, అభిమానులను క్షమాపణలు కోరుతున్నాం. విడుదల వివాదాన్ని పరిష్కరించేందుకు సహకరించిన నిర్మాత దిల్ రాజు, మ్యాంగో రామ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నాం. ప్రేక్షకులు మా సినిమాకు అఖండ విజయం ఇచ్చారు' అని నిర్మాతలు రామ్ ఆచంట, గోపి ఆచంట సంతోషం వ్యక్తం చేశారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై మంచి టాక్ తెచ్చుకొంది. ఈ సందర్భంగా గోపి ఆచంట మీడియాతో మాట్లాడుతూ 'వారం ఆలస్యంగా 'అఖండ 2' థియేటర్లలోకి వచ్చినా, ప్రీమియర్స్‌కు బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. ఉత్తర భారతదేశంలో 800 స్ర్కీన్లలో విడుదల చేశాం' అని చెప్పారు. రామ్ ఆచంట మాట్లాడుతూ 'రాత్రి ప్రీమియర్స్‌తో నైజాం, సీడెడ్, ఆంధ్రా కలిపి రూ. 10 కోట్ల గ్రాస్ వసూలైంది. కర్ణాటకలో రూ. కోటి వసూళ్లు వచ్చాయి' అని తెలిపారు.

గుర్తుండిపోయే ప్రేమగాథ



రోషన్ కనకాల

'మోగ్లీ 2025' చిత్రం స్వచ్ఛమైన ప్రేమకథతో తెరకెక్కింది. కల్మషం లేని ఈ ప్రేమగాథ ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని రోషన్ కనకాల అన్నారు. 'బబుల్‌గమ్' చిత్రంతో వెండితెరకు పరిచయమైన రోషన్ తన రెండో చిత్రం 'మోగ్లీ 2025'తో బాక్సాఫీసు దగ్గర సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. జాతీయ అవార్డు గ్రహీత సందీప్ ఎరాజ్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించిన చిత్రమిది. 'మోగ్లీ 2025' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం రోషన్ కనకాల మీడియాతో ముచ్చటించారు.

- ఇదొక స్వచ్ఛమైన, నిజాయితీతో కూడిన ప్రేమకథ. సందీప్ రాజ్ ఈ కథను చాలా సహజంగా, నిజాయితీగా రాశారు. ప్రేక్షకులు థియేటర్లో ఒక్క క్షణం కూడా బోర్ ఫీలవ్వకుండా ఉండేలా స్ర్కీన్‌ప్లే చాలా రేసీగా డిజైన్ చేశారు. కామెడీ, యాక్షన్, లవ్... ఇలా అన్ని భావోద్వేగాలు ఉంటాయి.
- అటవీ నేపథ్యంలో సాగే చిత్రం కావడంతో కథ అనుకున్నప్పుడే 'మోగ్లీ' టైటిల్‌ను నిర్ణయించాం. అడవిలో రియల్ లొకేషన్స్‌లో అధిక భాగం షూటింగ్ జరిగింది. గుర్రపుస్వారీ ఎపిసోడ్, పతాక సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కీరవాణి స్థాయిలో కాలభైరవ ఈ సినిమాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. హీరోయిన్ సాక్షితో నా కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయింది. బండి సరోజ్, హర్షలతో నా కాంబినేషన్ సీన్స్ బాగా పండాయి.
- చిన్నప్పటి నుంచి సినిమా వాతావరణంలో పెరగడం వల్ల నాపై ఎలాంటి ఒత్తిడి లేదు. ఈ ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నాను. నటనపరంగా నాన్న (రాజీవ్ కనకాల)తో చర్చిస్తుంటాను. అమ్మ(సుమ) ఇచ్చిన సలహాలు నటుడిగా నన్ను మెరుగుపెట్టాయి. ప్రస్తుతం రెండు సినిమాలు అంగీకరించాను. త్వరలో ప్రకటన వస్తుంది.



ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన పవన్ కల్యాణ్

ప్రముఖ కథానాయకుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సోషల్ మీడియాలో తన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. పవన్ వ్యక్తిగత ప్రతిష్ఠ, హక్కులకు భంగం కలిగించేలా సోషల్ మీడియా, ఇ-కామర్స్ వేదికలుగా పలు పోస్టులు వైరల్ అవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని పవన్ తరపు న్యాయవాది న్యాయస్థానాన్ని కోరారు. దీంతో ఆ లింక్‌లను ఏడు రోజుల్లోగా తొలగించాలని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 22కు వాయిదా వేసింది.

అందుకే అవతార్‌తో పోటీ పడుతున్నాం



వేణు సద్ది, అమర్ బురా

'మా సినిమా 'గుర్రం పాపిరెడ్డి' కంటెంట్‌పై మాకు నమ్మకం ఉంది. అందుకే 'అవతార్ 3' తో పాటు వస్తున్నాం. స్టార్ హీరో లేకపోయినా 140 స్ర్కీన్లలో విడుదల చేస్తున్నాం' అని నిర్మాతలు జయకాంత్, అమర్‌బురా అన్నారు. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన డార్క్ కామెడీ ఎంటర్‌టైనర్ 'గుర్రం పాపిరెడ్డి'. మురళీ మనోహర్ దర్శకత్వంలో జయకాంత్‌తో కలసి వేణు సద్ది, అమర్ బురా నిర్మించారు. ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అమర్‌బురా మీడియాతో మాట్లాడుతూ...

- 'కొంతమంది తెలివితక్కువ వాళ్లు, ఒక తెలివైన వాడిని ఎలా ఎదుర్కొన్నారు అనేది ఈ సినిమా ఇతివృత్తం. ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చేది వినోదం కోసమే తప్ప సందేశం కోసం కాదు అని నమ్మి చేసిన సినిమా ఇది. 'మ్యాడ్' సినిమాలోని పాత్రలను చూసి ఎలా నవ్వుకున్నారో, ఈ సినిమా చూసినప్పుడూ ప్రేక్షకులు అలాగే నవ్వుకుంటారు' అని చెప్పారు.
- నిర్మాత జయకాంత్ మాట్లాడుతూ 'కొత్త నిర్మాతలనగానే సాధారణంగా లవ్ స్టోరీల వైపు వెళ్తుంటారు. రొటీన్‌కు భిన్నంగా వెళ్లాలనే లక్ష్యంతో ఈ డార్క్ కామెడీ జానర్‌ను ఎంచుకున్నాం. మొదట తరుణ్ భాస్కర్‌ను అనుకున్నాం. కానీ డేట్లు కుదరకపోవడంతో నరేశ్ అగస్త్యను తీసుకున్నాం. టైటిల్ రోల్‌కు ఆయన వంద శాతం న్యాయం చేశారు' అని తెలిపారు.

పల్లెలు.. పరిశుభ్రం

(5వ పేజీ తరువాయి)

భాగంగా జడ్పీ సీఈఓ నుంచి, డీపీవో, ఎంపీడీవో వరకు నిత్యం ఏదో ఒక గ్రామానికి వెళ్లి చెత్త సేకరణ, ఇతర పారిశుధ్య పనులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్న ఆయా అధికారులు ఆరా తీసి ఫొటోలను జియో ట్యాగ్‌తో యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణకు జిల్లా పరిషత్‌లో ప్రత్యేకంగా సెల్ కూడా ఏర్పాటు చేశారు. దీంతో అధికారులు చెత్త సేకరణపై శ్రద్ధ వహిస్తున్నారు. అందువల్ల గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సొంతం చేసుకుంది.

కబడ్డీ విజేతలు విశాఖ, పల్నాడు



బాలికల విభాగంలో విజేత విశాఖపట్నం జట్టు

పెదకూరపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఉత్సాహంగా.. రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలు జరిగాయి. విజేతల వివరాలను కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ ప్రకటించారు. బాలికల విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు విజయం సాధించగా.. శ్రీకాకుళం జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానంలో కృష్ణా, కర్నూలు జిల్లాలు నిలిచాయి. పురుషుల కబడ్డీ విభాగంలో పల్నాడు జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా ద్వితీయ స్థానంలో మన్యం జిల్లా జట్టు నిలిచింది. కాకినాడ, శ్రీకాకుళం జిల్లాలు మూడవ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య స్కూల్ సీనియర్ జట్టు గెలిచింది. గుంటూరు జిల్లా మేడికొండూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. బాల్ బాడ్మింటన్‌లో గోపీ విజయ్ గెలుపొందారు. జితేందర్, నవీన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు షీల్డ్, నగదు బహుమతులను కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, గుత్తా కవితా రాములు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా కబడ్డీ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్, మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి, టీడీపీ జిల్లా నాయకులు భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గుత్తా వెంకటేశ్వరరావు, గల్లా బాబూరావు, వడ్లమూడి అప్పారావు, అంద్ర ప్రసాదు, గుడిపూడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏఎన్‌యూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్సన్

పిట్టలవానిపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాజీపాలెం కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 48వ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్సన్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, ఉపాధ్యక్షుడు శివరామరాజు, జాయింట్ సెక్రటరీ భూపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్ పాల్గొన్నారు. 200 మీటర్లు ఉమెన్ పరుగు పందెంలో ఏఎన్‌యూ విద్యార్థిని మంగతాయారు, కేవీఆర్ కళాశాల విద్యార్థిని తేజశ్రీ, నరసరావుపేట కృష్ణవేణి కళాశాల విద్యార్థిని సిలేవేణి, 20 వేల మీటర్ల వాక్‌లో కేవీఆర్ కళాశాల విద్యార్థి శివబాలాజి, శివనాగరాజు, వర్సిటీ విద్యార్థి దుర్గారుణ్, 800 మీటర్ల పురుషుల విభాగంలో నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి గురుశంకర్, కేవీఆర్ కళాశాల విద్యార్థి శివారెడ్డి, వర్సిటీ విద్యార్థి గోపీచంద్.. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

అమరావతి జోలికొస్తే 11 కూడా మిగలవు: పోతుల

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ నేతలు అసత్య ప్రచారం మానుకోకపోతే 2029 ఎన్నికల్లో 11 సీట్లు కూడా మిగలవని రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతి బిల్లు వెనక్కి వచ్చిందంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని, సాంకేతికపరమైన సందేహాల నివృత్తి కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం వివరణ అడిగిందే తప్ప బిల్లు ఆగలేదని స్పష్టతనిచ్చారు.

తెనాలిలో 'మీనాక్షి' మెరుపులు

- సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన మీనాక్షి, ఆలపాటి
- ఆంధ్రాప్యారిస్ వాసుల అభిరుచి మేరకు వస్త్రాలుంటాయన్న అధినేతలు





మాల్‌ను ప్రారంభిస్తున్న మీనాక్షి చౌదరి, ఎమ్మెల్సీ ఆలపాటి, షోరూమ్ చైర్మన్లు పొట్టి వెంకటేశ్వర్లు, తిరువీధుల ప్రసాదరావు

తెనాలి, డిసెంబరు 12, (ఆంధ్రజ్యోతి): తెనాలిలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సినీ నటి మీనాక్షి చౌదరి సందడి చేశారు. స్థానిక బోస్ రోడ్డులోని వీనస్ టాకీస్ స్థలంలో కొత్తగా నిర్మించిన మాల్‌ను శుక్రవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలసి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముందు బయట కిక్కిరిసిన ప్రజలు, అభిమానులను ఉత్సాహపరుస్తూ.. ఆనందంతో స్టెప్స్ వేశారు. తెనాలిలో తనపై చూపిన అభిమానం సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌పైనా చూపాలని, ప్రజల అభిరుచికి అనుగుణంగా ఉన్న ఓ అద్భుత వస్త్ర ప్రపంచం మీ ముందుకు వచ్చిందన్నారు. వైవిధ్యభరితమైన కలెక్షన్స్‌తో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తెనాలికి ముందుగానే పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇంతటి పెద్ద వస్త్ర దుకాణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో మహేష్‌బాబుతో కలసి నటిస్తున్న కొత్త సినిమాను.. అభిమానులతో కలసి చూస్తానన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ వంటి గొప్ప వస్త్ర దుకాణం రావడం ఆంధ్రా ప్యారిస్‌కు అందాన్ని తెచ్చిందన్నారు. షాపింగ్ మాల్ అధినేతలు మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెనాలిలో తమ 37వ షోరూమ్‌ను ప్రారంభించటం సంతోషంగా ఉందని, షోరూమ్ చైర్మన్, హోల్ టైమ్ డైరెక్టర్లు పొట్టి వెంకటేశ్వర్లు, తిరువీధుల ప్రసాదరావు, సీర్ల రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. తెనాలి ప్రజల అభిరుచులకు అనుగుణంగా తమ షోరూంను ఏర్పాటు చేశామని, అన్నీ అందుబాటు ధరలోనే ఉంచినట్లు పేర్కొన్నారు. భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన షోరూమ్‌లో వస్త్రాలను మీనాక్షి చౌదరి ప్రదర్శించారు. ప్రారంభ కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, షాపింగ్ మాల్ ప్రమోటర్ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగం... ఐదుగురు బలి

(5వ పేజీ తరువాయి)

కూరుకుపోయి మృతి చెందారు. వాహనం క్యాబిన్‌లో ఉన్న పోతురాజు తీవ్రంగా, గణేష్ స్వల్పంగా గాయపడ్డారు. కొల్లూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విషయం తెలుసుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పిట్టలవానిపాలెం: నగరం మండలం చినమట్లపూడి గ్రామానికి చెందిన షేక్.జాన్ సైదా(35) భార్య, కుమారుడితో కలిసి బైక్‌పై చందోలు వస్తున్నాడు. అదే మండలం పెదపల్లి గ్రామానికి చెందిన ఆట్ల భానుప్రకాష్(22) పెదపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వీరు పీవీపాలెం మండల పరిధిలోని కొత్తపాలెంలో వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో షేక్.జాన్‌సైదా, ఆట్ల భానుప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందారు. సైదా భార్య, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. కేసు నమోదు చేసినట్లు చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

విజ్ఞాన్ వర్సిటీ కీలక అవగాహన ఒప్పందం



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్, డాక్టర్ కల్యాణచక్రవరి తదితరులు

గుంటూరు(విద్య), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, గుంటూరులోని ఇఫ్లైటీ డయాగ్నస్టిక్స్ రీసెర్చ్ సెంటర్‌ల మధ్య శుక్రవారం ముఖ్యమైన అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి. నాగభూషణ్, ఇఫ్లైటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి కొగంటి, సీఈవో సీఎస్‌వో డాక్టర్ సందీప్ కుమార్ నాదెండ్ల హాజరై అవగాహన పత్రాలను మార్చుకున్నారు. అనంతరం వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ప్రకారం రెండు సంస్థలు కలిసి నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్, డ్రగ్ ఇంటరాక్షన్ల విశ్లేషణ, మాలిక్యులర్ రీసెర్చ్, లో కాస్ట్ పీసీఆర్ టెక్నాలజీ అభివృద్ధి, సెప్సిస్ ట్రాన్స్‌క్రిప్టోమిక్స్, బయో ఇన్ఫర్మాటిక్స్ అనాలిటిక్స్ వంటి ఆధునిక పరిశోధన రంగాల్లో కలిసి పనిచేయనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపక సిబ్బంది పరిశోధకులు పాల్గొన్నారు.

ఆలయ దొంగల అరెస్టు

తాడికొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో దొంగతనం చేసిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ కె.వాసు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండారుపల్లి గ్రామంలో ఉన్న పోలేరమ్మతల్లి గుడిలో అగస్టు 8న హుండీ పగలగొట్టి నగదు దొంగతం చేసినట్లు పూజారి ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో రావెల గ్రామానికి చెందిన యువకులు ఎం.దావీదు, దొడ్డా యహోవా, సయ్యద్ మస్తాన్‌బాబు దొంగతనం చేసినట్లు గుర్తించారు. శుక్రవారం ఉదయం తాడికొండ అడ్డరోడ్డు సమీపంలో ఈ ముగ్గురినీ.. సమాచారం మేరకు అరెస్టు చేశారు. వారిని విచారించగా మేడికొండూరు, తాడికొండ, పెదకూరపాడు, అమరావతి మండలాల్లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ ముగ్గురు దొంగలపై పది కేసులు ఉన్నాయని, వారి నుంచి 632 గ్రాముల వెండి వస్తువులు, రూ.70 వేల నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచడంతో.. రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జిత్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం



ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన క్రెడాయ్ అధ్యక్షుడు రాము, మాజీ చైర్మన్ శివారెడ్డి తదితరులు

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్థిరాస్థి సంస్థ క్రెడాయ్ ప్రాపర్టీ షోను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) గుంటూరు రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం సయ్యద్ జవహర్, ఎస్‌బీఐ డీజీఎం బి కృష్ణకుమార్ ప్రభు జ్యోతి ప్రజ్వలన చేశారు. ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, బ్యాంక్ ఆఫ్ బరోడ ఆర్ఎం కిరణ్ రెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, క్రెడాయ్ ఏపీ మాజీ చైర్మన్ ఆళ్ళ శివారెడ్డి హాజరయ్యారు. క్రెడాయ్ ప్రెసిడెంట్ మామిడి రాము మాట్లాడుతూ ఈ ప్రాపర్టీ షో మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు లక్కీ డ్రా తీసి.. విజేతకు బహుమతి ప్రదానం చేశారు. గుంటూరు క్రెడాయ్ చైర్మన్ ఆరుమళ్ళ సతీష్‌రెడ్డి, కార్యదర్శి మెట్టు సాంబశివారెడ్డి, ట్రెజరర్ ఏవీ నాగార్జునరెడ్డి, షో కన్వీనర్ వినోద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శివనాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రాంబాబు తదితరులు హాజరయ్యారు.

యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాలను పెంపొందించుకొని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక వెలగా నాగేశ్వరరావు ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ జాబ్ మేళాకు 1,100 మంది నిరుద్యోగులు హాజరుకాగా 36 సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల నైపుణ్యాలను కూడా గుర్తించి.. కంపెనీల ప్రతినిధులు ఎంచుకోవాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ జాబ్ మేళాలో 215 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. టెక్నికల్ ఎడ్యుకేషన్, జాయిన్ డైరెక్టర్ వెలగా పద్మారావు, వీఎన్నార్ కళాశాల కార్యదర్శి వెలగా నాగ కల్యాణి, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, ఎంపీడీవో జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక శ్రామికులకే ఉపాధి

(5వ పేజీ తరువాయి)

పనులు జరుగుతున్నాయి. మూడు జిల్లాల పరిధిలో దాదాపు రూ.600 కోట్ల వరకు వాటి విలువ ఉండగా, ఇందులో రహ దారులు, కాలువల పనులతో పాటు గ్రామాల్లో మరిన్ని కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. వందల కోట్ల రూపాయలు పనులు జరుగుతుండడంతో, దీనిని సొమ్ము చేసుకోవడానికి కొంతమంది సిబ్బంది ప్రయత్నిస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి స్వాహా పర్వాలు అడ్డూఅదుపు లేకుండా సాగడంతో ఇప్పుడు కూడా అదే రీతిన పనులు చక్కబెట్టుకోవాలని చూసే వారి సంఖ్య తక్కువేం కాదు. వీటన్నింటికి ఈ కేవైసీ ద్వారా చెక్ పెట్టినట్లయింది. బోగస్ జాబ్ కార్డులను గుర్తించడమే కాకుండా, ఫొటో వెరిఫికేషన్ విధానాన్ని ప్రవేశపెట్టినందు వల్ల తప్పనిసరిగా పనికి హాజరయితేనే వేతనం జమవుతుంది.

పారదర్శకంగా ఈకేవైసీ..

డ్వామా యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఉన్న శ్రామికుల ఇళ్లకు వెళ్లి ఈ-కేవైసీ చేపట్టింది. అందుబాటులో లేని వాళ్లకు రెండు దఫాలుగా సమాచారమిచ్చి మరీ అవకాశం ఇచ్చారు. ఈ మొత్తం ప్రక్రియ తర్వాత బోగస్ జాబ్ కార్డులపై స్పష్టత వచ్చింది. ఆ జాబితాలను గ్రామ సభలు పెట్టి తెలియజేయడంతో పాటు సచివాలయాల్లో ప్రదర్శించారు. ఆ తర్వాతనే ఈ-కేవైసీ చేయని జాబ్‌కార్డులను హోల్డ్‌లో పెట్టారు. స్థానికంగా వారు ఉండడం లేదని ఖరారు అయిన తర్వాతనే తొలగించే కార్యక్రమం చేపట్టారు. వలస వెళ్లడం, మరణాలు, రాజకీయ సిఫారసులతో అర్హత లేకపోయినా జాబ్‌కార్డు పొందడం వంటి వన్నీ తొలగించిన వాటిలో ఉన్నాయి. ఓ వైపు ఈ ప్రక్రియ చేపడుతుండగానే మరో వైపు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి జాబ్‌కార్డుల జారీని కూడా ప్రభుత్వం వేగవంతం చేసింది.

పకడ్బందీగా వందరోజుల ప్రణాళిక అమలు

● పరీక్షల విభాగం రాష్ట్ర పరిశీలకులు పయ్యావుల పార్వతి

గుంటూరు (విద్య) డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని పరీక్షల విభాగం రాష్ట్ర పరిశీలకులు పయ్యావుల పార్వతి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్లోని పరీక్ష భవన్‌లో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ప్రతిరోజు తరగతులు నిర్వహించి చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. డీఈఓ ఎస్కే సలీం బాష మాట్లాడుతూ విద్యార్థులు చదవడం రాయడంతో పాటు నైపుణ్యాలు పెంపొందించేలా పలు విషయాలు సూచించారు. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఐ పద్మావతి, డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్, ఉర్దూ డీఐ ఎస్కే ఎండీ కాశిం, ఎంఈఓ ఉద్దూస్ పాల్గొన్నారు.

కందిపప్పు .. కనుమరుగు

(5వ పేజీ తరువాయి)

కందిపప్పు సరఫరా దాదాపుగా లేదనే చెప్పాలి.

వైసీపీ కోతలు.. నేడు కొనసాగింపు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు రేషన్ సరుకుల్లో కోత పడింది. గత టీడీపీ హయాంలో 2018 మార్చి నుంచి ఒక్కో కుటుంబానికి 2 కిలోల కందిపప్పు రూ.40 చొప్పున ఇవ్వగా, వైసీపీ ప్రభుత్వం దానిలో కోత పెట్టి కిలోకి తగ్గించింది. ధరను రూ.40 నుంచి రూ.67కి పెంచింది. తర్వాత ఇవ్వడం మానేశారు. టీడీపీ హయాంలో కుటుంబానికి కిలో పంచదార రూ.20 చొప్పున అందించేది. దాన్నీ వైసీపీ ప్రభుత్వం అరకిలోకి తగ్గించి.. ధర రూ.13కు పెంచింది. 2018-19లో రాగులు, జొన్నలు, గోధుమపిండి, ఉప్పు రేషన్ ద్వారా పంపిణీ చేశారు. దాంతోపాటు పండుగ సమయాల్లో, నూనె ధరలు అధికంగా ఉన్న సమయంలో పామాయిల్‌ను సబ్సిడీ ద్వారా కిలో రూ.40 పంపిణీ చేసేవారు. వైసీపీ ప్రభుత్వం వీటి సరఫరాను నిలిపివేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అవలంబిస్తోంది. ప్రస్తుతం వంట నూనెల ధర రూ.110 నుంచి 150, కందిపప్పు రూ.140 నుంచి 180గా ఉన్నా వాటిని సబ్సిడీపై ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో సామాన్య కుటుంబాలపై ప్రతి నెలా రూ.వెయ్యి నుంచి 2 వేల మేర అదనపు భారం పడుతోంది.

36,275 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 31,613 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,275 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,263 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15400
273	10500	14000
341	10500	16500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15400
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16500
దేవనూరు డీలక్స్	11000	16600
ఆర్మూరు	10000	12600

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16800
నెంబరు. 5	11000	15300
273	----	----
341	11000	16500
4884	11500	14300
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	11000	16500
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7500

నేటి నుంచి రాష్ట్రస్థాయి వెటర్న్ అథ్లెటిక్స్

పెదనందిపాడు, డిసెంబరు, 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలపర్రు ఎస్ఎన్ జడ్పీ పాఠశాల మైదానంలో ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 45వ రాష్ట్రస్థాయివెటర్న్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగా వరప్రసాద్ తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు జడ్జి గన్నమనేని రామకృష్ణప్రసాద్, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, బీసీసీఐ చీఫ్ సెక్రటరీ ఎమ్మెస్కే ప్రసాద్, అర్జున్ అవార్డు గ్రహీత కుమారి దీప్తి విచ్చేయనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఎం.రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వరరావు, కార్యదర్శి రాంబాబు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీ సత్యనారాయణ, నతానియేలు, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు ఎం.రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

జీఎంసీ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు చెందిన పారిశుధ్య, ఇంజనీరింగ్ వాహనాలన్నింటికీ జీపీఎస్ ట్రాకింగ్ వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని, కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్ద పలకలూరు, ఉద్యోగనగర్, విజయపురి కాలనీ, నమ్మెపేట, ఇన్నర్ రింగ్ రోడ్ (శ్రీరామ్‌నగర్, ద్వారకానగర్, అరండల్‌పేట ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈలు సతీష్‌కుమార్, రమేష్‌బాబు, ఎస్ఎస్ జబాక్, ప్రసాద్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పికర్ మెషిన్ వేగంగా శుభ్రం చేస్తుంది

నగరపాలక సంస్థ పరిధిలో పెద్ద రోడ్లు, డివైడర్లు, ఫుట్ పాత్‌లను ట్రక్ మౌంటెడ్ లిట్టర్ పికర్ మెషిన్ వేగంగా శుభ్రం చేస్తుందని కమిషనర్ తెలిపారు. శుక్రవారం అమరావతి రోడ్డులోని మదర్‌నగర్ ప్రాంతంలో లిట్టర్ పికర్ మెషిన్ పనితీరును జీఎంసీ ఎస్ఈ (సుందర్రామిరెడ్డి)తో కలిసి కమిషనర్ నేరుగా పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ మెషిన్ ద్వారా పెద్ద రోడ్లు, డివైడర్లు, ఫుట్‌పాత్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను 10 మీటర్ల పొడవైన పోస్‌తో శక్తివంతమైన సక్షన్ ద్వారా ఒకేసారి 3000 లీటర్ల (3 టన్నులు) హాపర్‌లో సేకరిస్తుందన్నారు. మరో వ్యర్థాలు సదరు మెషిన్ పనితీరుని పరిశీలించి, నగరపాలక సంస్థ మేయర్ నేతృత్వంలోని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్ళి వాటిని నగరంలో వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ప్లానింగ్ అధికారుల దాడులు

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జీటీ రోడ్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు దాడులు చేపట్టారు. శుక్రవారం సుమారు 1600 గజాల విస్తీర్ణంలో అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణ విషయమై సమాచారం తెలుసుకున్న అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్, ఏసీపీ రెహమాన్, అలాగే టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన మొత్తం సిబ్బంది స్థలానికి చేరుకుని నిర్మాణాలను పరిశీలించారు. అవసరమైన ప్లాన్ అనుమతులు లేకపోవడంతో, అధికారులు నిర్మాణ పనులను నిలిపివేశారు.

కొత్త ఏడాదిలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలి



2026 క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రసన్న లక్ష్మినాయుడు

గుంటూరు మెడికల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 2026 నూతన సంవత్సరంలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని సీనియర్ గైనకాలజిస్ట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ బీ ప్రసన్న లక్ష్మినాయుడు ఆకాంక్షించారు. శుక్రవారం నగరంలోని శ్రీసాయి సత్య హాస్పిటల్లో మార్కెటింగ్ టీమ్ అల్లూరి ప్రైవేట్ హెల్త్‌కేర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. 30 ఏళ్లుగా ప్రజలు తమపై నమ్మకంతో వైద్యసేవలను పొందుతూ తమను ఆదరిస్తున్నారని డాక్టర్ ప్రసన్న తెలిపారు. నగరవాసులకు, శ్రీసాయి సత్య హాస్పిటల్ సిబ్బందికి ఆమె నూతన సంవత్సర, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి హెల్త్‌కేర్ సర్వీసెస్ గుంటూరు మేనేజింగ్ డైరెక్టర్ అల్లూరి సుధాకర్‌బాబు, డైరెక్టర్ అల్లూరి సుమంత్ కుమార్, హెల్త్ కేర్ కోఆర్డినేటర్ ప్రసాద్, విష్ణు, రియాజ్, మార్కెటింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలు, డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ

గుంటూరు(విద్య), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఎన్ఎస్ఎస్- 2, 3 యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం నగరంపాలెం సమీపంలోని గుండారావుపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిజిటల్ మోసాలు, డ్రగ్స్ వల్ల వచ్చే నష్టాల గురించి ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డి.అరుణకుమారి, కె.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. 23వ డివిజన్‌లోని 81, 82 సచివాలయాల పరిధిలోని చెక్ బజారు, జెండాచెట్టుసెంటర్, వడ్డెరగూడెం పరిసర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపచేయాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అంగన్‌వాడీలకు వర్తింప చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి డి.దయా రమాదేవి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా రమాదేవి హాజరై ప్రసంగించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లాం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ టి.సామ్రాజ్యంను విధుల్లో తీసుకుని, సస్పెన్షన్ ఎత్తివేసి జీతాలు చెల్లించాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు ఎం.ధనలక్ష్మి మాట్లాడుతూ ... కల్పించాలన్నారు. ఈ నిరసనలో జి. రమణ, కుమారి, సీపీఎం, సీఐటీయూ నాయకులు నేతాజీ, దండా లక్ష్మీనారాయణ, మేడా హనుమంతరావు, కె శ్రీనివాసరావు, ఆకిటి అరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తున్న దయా రమాదేవి, పాల్గొన్న అంగన్‌వాడీలు

బాధిత కుటుంబానికి రూ.2.50 లక్షల సాయం

గుంటూరు(మెడికల్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పాకనాటి కృష్ణప్రశాంత్ మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఆదిత్య మెడికవర్ హాస్పిటల్‌లో రెండేళ్లుగా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న రాదారపు నరేంద్రబాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. దీంతో స్పందించిన డాక్టర్ పాకనాటి కృష్ణప్రశాంత్ శుక్రవారం నరేంద్రబాబు కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. నరేంద్రబాబు భార్యకు ఆదిత్య మెడికవర్ హాస్పిటల్‌లో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ అమూల్య పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గుజ్జనగుండ్లలోని చేబ్రోలు మహిళోన్నత పల్లపు హైస్కూల్ ఉన్నత పాఠశాలను డీఈవో ఎస్‌కే సలీం బాషా శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఇదే ఆవరణలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

కాలేజీ బస్సు ఢీకొని మహిళ మృతి



సుబ్బమ్మ (మృతురాలు)

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కాలేజీ బస్సు ఢీ కొనడంతో మృతి చెందిన మహిళను సీతమ్మ కాలనీ 5వ లైనులోని బేబుజుడు జంగాల కాలనీకి చెందిన తూరపాటి సుబ్బమ్మ (42)గా గుర్తించారు. సుబ్బమ్మ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటుంది. కొంతకాలంగా ఆమె గుడులు, మసీదుల వద్ద భిక్షాటన చేస్తుంది. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం పట్టాభిపురం మెయిన్ రోడ్డులోని మసీదు ఎదురు రోడ్డు దాటుతోంది. డివైడర్ ఎక్కి దిగుతుండగా ఓ కాలేజీ బస్సు ఢీకొట్టింది. గాయపడిన మహిళను జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతురాలిని సుబ్బమ్మగా గుర్తించారు. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేటగిరి-ఏ కిందకు అన్ని పౌర సేవలు

● ఆంధ్రప్రదేశ్ సచివాలయం ప్లానింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి



ట్రైనింగ్ సెంటర్లో ఏకీకృత సర్వే గురించి వివరిస్తున్న ఏపీ సచివాలయం ప్లానింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు, సర్వీసులను సజావుగా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని పౌర సేవలను కేటగిరి-ఏ కిందకు తీసుకురావాలని నిర్ణయించిందని ఆంధ్రప్రదేశ్ సచివాలయం ప్లానింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా శిక్షణ కేంద్రంలో ఆమె ఉద్యోగులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కుటుంబాల సమాచారాన్ని ధ్రువీకరించడం చాలా అవసరమన్నారు. దీనిని సులభతరం చేయడానికి, కుటుంబ ప్రయోజన నిర్వహణ వ్యవస్థ కింద ఏకీకృత కుటుంబ సర్వేను నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. ఈ సర్వేలో, పౌరులందరి నుంచి సమాచారాన్ని గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా సేకరిస్తారని చెప్పారు. నిర్దేశించిన ప్రశ్నపత్రం ద్వారా వ్యక్తిగత, కుటుంబస్థాయి సమాచారాన్ని సేకరించడానికి వివరణాత్మక విధానాలను ఈ శిక్షణలో వివరించామన్నారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రెయినర్లు తరువాత గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో మిగిలిన సిబ్బందికి శిక్షణ ఇస్తారు.

కామోపాధ్యాయుడు

● విద్యార్థిని ట్రాప్ చేసిన ప్రైవేట్ టీచర్
● ఇంటికి తీసుకెళ్లి అఘాయిత్యం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కలిగిన గురువే కామోపాధ్యాయుడిగా మారాడు. అభం శుభం తెలియని ఎనిమిదో తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో లొంగదీసుకుని కీచకుడిలాగా ప్రవర్తించాడు. 45 ఏళ్ల వయసు కలిగిన గుజ్జనగుండ్ల ప్రాంతానికి చెందిన కార్తీక్ అనే టీచర్ పేరేచర్లలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఇంగ్లిష్ బోధిస్తున్నాడు. అదే స్కూల్లో చదువుతున్న 13ఏళ్ళ బాలికను ట్రాప్ చేశాడు. కార్తీక్ కూతురుకు వివాహమైంది. ఏడాది క్రితం కార్తీక్ భార్య మృతి చెందడంతో ప్రస్తుతం ఆయన ఒంటరిగానే గుజ్జనగుండ్ల ప్రాంతంలో ఉంటున్నాడు. ఈ నెల 10న ఉదయం స్కూలుకి వెళ్లిన బాలికకు కార్తీక్ మాయ మాటలు చెప్పి తనతో గుజ్జనగుండ్లలోని ఇంటికి తీసుకెళ్లాడు. అదే సమయంలో బాలిక తల్లి తన పుట్టింటికి వెళ్లింది. బాలిక స్కూల్‌కు వెళ్తూనే తాను అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్తానని తండ్రికి చెప్పింది. అయితే బాలికను కార్తీక్ తీసుకొచ్చిన విషయం చుట్టుపక్కల వారి ద్వారా ఆయన కూతురు, అల్లుడు తెలుసుకున్నారు. దీంతో అల్లుడు మామకు దేహశుద్ధి చేశాడు. అనంతరం కూతురు అల్లుడు బాలికను 11న సాయంత్రం మేడికొండూరు తీసుకువెళ్లి అక్కడ రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. రోజు మాదిరిగానే బాలికను తండ్రి శుక్రవారం ఉదయం స్కూలుకి పంపాడు. అయితే బాలిక మేడికొండూరు పోలీస్ స్టేషన్ వద్దకు రాగానే వాహనంపై నుంచి కిందకు దూకి పోలీస్ స్టేషన్‌లోకి పరుగెత్తింది. తనను ఇంగ్లిష్ టీచర్ కార్తీక్ పెళ్లి చేసుకున్నాడని, ఆయనతోనే కాపురం చేస్తానని పోలీసులకు చెప్పింది. దీంతో పోలీసులు బాలిక చెప్పిన విషయం విని కంగుతిన్నారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే నిందితుడు కార్తీక్‌ను మేడికొండూరు స్టేషన్ తీసుకువస్తే బాలిక బంధువులు, కుటుంబసభ్యుల నుంచి ఇబ్బంది ఎదురవుతుందని భావించిన పోలీసులు పంచాయితీని పట్టాభిపురం స్టేషన్‌కు మార్చారు. తనను ఉపాధ్యాయుడు కార్తీక్ పెళ్లి చేసుకున్నాడని, తాను ఆయనతోనే వెళ్లిపోతానంటూ బాలిక పోలీసులతో వాదించింది. అయితే ఈ ఘటనపై కేసు నమోదు అయితే తమ కూతురు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి కావడంతో పోలీసులు బాలికను తల్లిదండ్రులకు ఇచ్చి తిరిగి శనివారం రావాల్సిందిగా చెప్పి పంపారు. ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఆర్వీఆర్‌జేసీలో పతంగ్ చిత్ర బృందం సందడి

గుంటూరు (విద్య), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో పతంగ్ చిత్రబృందం సభ్యులు శుక్రవారం సందడి చేశారు. ఆధునికయుగంలో యువతను ఆలోచింప చేసే ఒక సందేశాత్మక చిత్రం 'పతంగ్' అని యువ హీరో వంశీ పేర్కొన్నారు. కార్యక్రమంలో దర్శకుడు ప్రణీత్ ప్రత్తిపాటి, నూతన హీరోయిన్ ప్రీతీ, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, వివిధ విభాగాలు హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి నృత్యం చేస్తున్న చిత్ర బృందం

ప్రకృతి వ్యవసాయం... ఆరోగ్యానికి శుభప్రదం

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ విత్తనాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని పలువురు రైతులు వివరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన సదస్సులో పలువురు ప్రగతిశీల రైతులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు, వ్యవసాయ ఉత్పాదక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోలాహలంగా తెప్పోత్సవం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం, శ్రీరామనామక్షేత్రంలో 99వ శ్రీరామకోటి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా శుక్రవారం శాంతి హోమం పూర్ణాహుతి, చక్ర తీర్థం సంప్రోక్షణ జరిగాయి. శ్రీసీతారామ పరివార తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. శనివారం పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని క్షేత్ర నిర్వాహకులు, మస్తానరావు, లీలాసుందరి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో భైరవాష్టమి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహాకాళీ కాల భైరవుడు అవతరించిన రోజును పురస్కరించుకుని శుక్రవారం స్థానిక నల్ల చెరువు, ఒకటో లైన్‌లో భైరవాష్టమిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీభవాని శంకర శివసేన పూజ్య గురువులు శ్రీసూర్యచంద్రేశ్వరానంద స్వామీజీ హాజరై కాళభైరవ జయంతి ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముగిసిన మెగా స్పోర్ట్స్‌మీట్

గుంటూరు(విద్య), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): టీజేపీఎస్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మెగా స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. ఈ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ కామేశ్వరశాస్త్రి, ట్రెజరర్ వి కృష్ణానంద్, ఎన్ చక్రనాగ్ వ్యాయామ అధ్యాపకులు టి.వాసుదేవరరావు, కోచ్ ఆర్ శివాజీ తదిరులు పాల్గొన్నారు.

నేడు తుళ్ళూరులో నయీ చేతన 4.0

తుళ్లూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నయీ చేతన 4.0 కార్యక్రమం (లింగ సమానత్వ ప్రచార కార్యక్రమం) శనివారం తుళ్ళూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

నందివెలుగు రూట్‌లో యథావిధిగా ఆర్టీసీ సర్వీసు

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు - తెనాలి వయా నందివెలుగు బస్సు సర్వీసును (సాయంత్రం 3.50 గంటలు, 6.30లకు) పునరుద్ధరించారని గుంటూరు-2 డిపో మేనేజర్ సీహెచ్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు పునరుద్ధరించారన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.6,400 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు గనిరాజు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం డీఆర్వో ఖాజావలికి ఆయన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మనోజ్‌కుమార్ ఆది, జస్వంత్, దేవ్‌కుమార్, అంబేడ్కర్, పి.మనోజ్ ఉన్నారు.



పోలీస్ సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

పోలీస్ సిబ్బంది వినతుల పరిష్కారానికి చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య క్రమంలో పోలీస్ సిబ్బంది వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. 'ప్రతి శుక్రవారం' జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయా పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది వినతులు, సమస్యల పరిష్కారానికి నిర్వహించే 'పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ గ్రీవెన్స్‌కి పోలీస్ సిబ్బంది నుంచి నేరుగా వినతులను స్వీకరించి, వారి సమస్యలను ఆలకించి, ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరిస్తానని తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణ, వినియోగం కేసులో ముగ్గురు నిందితులను అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. బొంగరాలబీడు 3వ లైనుకు చెందిన పాలపర్తి కిరణ్, నంద్యాలలోని నంది పారడైజ్ కాలనీకి చెందిన కుట్రావత్ సందీప్ నాయక్, సంపత్‌నాయక్ అనే ముగ్గురిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 1150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజులు నిందితులను హాజరు పరచి వివరాలు వెల్లడించారు.

డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితులు ముగ్గురు అరకు సమీపంలోని పాడువ గ్రామానికి చెందిన 'డాన్' అనే వ్యక్తి నుంచి 3 కిలోల గంజాయిని, రూ.15 వేలకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 2 కిలోలు చిన్న పొట్లాలుగా విక్రయించి, మిగిలిన కిలోను అమ్మడానికి గుంటూరు నగరానికి తీసుకువచ్చినట్లు వారు అంగీకరించారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేదించిన అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు, అలాగే కేసులో పాల్గొన్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్, వెస్ట్ డీఎస్పీ అరవింద్ అభినందించారు.

నేడు మెగా జాబ్ మేళా

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ, హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ వారి సహకారంతో అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ఇంజనీరింగ్ ఎంబీఏ కాలేజీ ఆవరణలో శనివారం మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్, రాష్ట్ర కోశాధికారి పులిపాక ప్రసాద్‌లు తెలిపారు. కళాశాలలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

నేడు అన్నమయ్య సహస్ర గళార్చన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జైకిసాన్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం రాష్ట్రస్థాయిలో ద్వితీయ అన్నమయ్య సహస్ర గళార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు బండ్లమూరి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో వందలాది మంది గాయకులు మూడు గంటల పాటు కీర్తనలను ఆలపిస్తారన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

అమరావతిపై జగన్‌రెడ్డి విషం చిమ్మడం ఆపాలి

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అమరావతిపై జగన్‌మోహన్‌రెడ్డి విషం చిమ్మడం ఆపాలని, జనం 11 సీట్లకు పరిమితం చేసినా, ఆయన బుద్ధి మార్చుకోలేక పోతున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అమరావతిని శాశ్వత రాజధానిగా నోటిఫై చేసే బిల్లు కేంద్రంలో సాంకేతిక పరిశీలనలో ఉండగా, వైసీపీ మాత్రం కావాలనే తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. మూడు రాజధానుల మాయాజాలం, రైతులపై జరిగిన అన్యాయం చేసి అమరావతిని నాశనం చేయాలని చూసినప్పటికీ అమరావతి పునర్నిర్మాణం వేగం అందుకోవడంతో వైసీపీకి రాజకీయంగా ప్రమాదమై, దుష్ప్రచారయత్నాలు మొదలు పెట్టారన్నారు. ఇప్పటికే కేంద్రం న్యాయపరమైన పరిశీలనలు జరుపుతూ బిల్లుకు మార్గం సుగమం చేస్తోందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజాగ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

పికిల్ బాల్ విజేతలకు ఎమ్మెల్యే అభినందనలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీవీవీ హెల్త్ హబ్‌లో జరిగిన గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన లాం, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన నిహా, నికిత, ఆరాధ్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. రాబోయే పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర దేవస్థాన వెబ్‌సైట్, యాప్‌ను ప్రారంభిస్తున్న గరికపాటి నరసింహారావు, ఆలయ కమిటీ సభ్యులు

రాజనీతిలో రాముడే ఆదర్శం

● ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భరతుడికి శ్రీరాముడు చేసిన ధర్మోపదేశం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. గుంటూరు, బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే గరికపాటి ప్రవచనాల కార్యక్రమం శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలుత శ్రీవేంకటేశ్వర దేవస్థానం వెబ్‌సైట్, యాప్‌ను దేవస్థానం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు, గుళ్ళపల్లి సుబ్బారావు, గుళ్ళపల్లి రాఘవేంద్ర రావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం రామాయణంలో రాజనీతిపై గరికపాటి ప్రవచించారు. రాజు అనేవాడు ఇంద్రియాలకు లొంగిపోకూడదు. పొగడ్తలకు పొంగి పోరాదు. అపరాధులను నేరం రుజువైన తరువాతే శిక్షించాలి. యువతలో దైవనామస్మరణ, ఆధ్యాత్మిక భావాలు పెంపొందించగల్గితే తద్వారా ధర్మ, చింతన పరోపకారకాలు సిద్ధిస్తాయని అన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ప్రోత్సహిస్తే నాటి రాముడి రాజ్యం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని నగరంలో దేవాలయాల నిర్మాణం జరగడం శుభ సూచికమని, తద్వారా ప్రజలలో ఆధ్యాత్మి భావాలు, దైవచింతన పెరుగుతాయని అన్నారు. తొలుత వందేమాతరం 150సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సభికులచే వందేమాతరం నినాదాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో ఏ సృజనకుమార్ దంపతులు, స్నేహ, చిట్టినేని శివ కోటేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,32,660	1,21,600	2,15,000
విజయవాడ	1,35,000	1,26,000	1,95,000
విశాఖపట్నం	1,36,590	1,22,500	2,15,000
రాజమండ్రి	1,34,180	1,23,000	1,97,000
ప్రొద్దుటూరు	1,30,500	1,20,060	1,91,000
ముంబై	1,32,710	1,21,562	1,95,180

వెండి @ రూ.2 లక్షలు



సరికొత్త రికార్డు గరిష్ఠానికి ధర

అంతర్జాతీయ మార్కెట్లో 65 డాలర్ల చేరువలో ఔన్స్ సిల్వర్

న్యూఢిల్లీ: వెండి ధరలు వేగంగా దూసుకెళ్తున్నాయి. కిలో వెండి తొలిసారిగా రూ.2 లక్షల మైలురాయిని దాటేసింది. దేశీయ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో సిల్వర్ ఫ్యూచర్స్ 2026 మార్చి కాంట్రాక్టు ధర శుక్రవారం మరో రూ.1,420 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠ స్థాయి రూ.2,00,362కు చేరుకుంది. ఎక్స్ఛేంజీలో వెండి రేట్లు పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. సోమవారం రూ.1,81,742గా నమోదైన వెండి రేటు.. 4 రోజుల్లో ఏకంగా రూ.18,620 లేదా 10.24 శాతం పెరిగింది. కాగా, 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ 2026 ఫిబ్రవరి కాంట్రాక్టు ధర కూడా రూ.2,497 పెరుగుదలతో కొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయి రూ.1,34,966కు ఎగబాకింది. ఫెడ్ రేట్లు మరింత తగ్గిన నేపథ్యంలో అంతర్జాతీయంగా ఈ విలువైన లోహాలకు డిమాండ్ పెరుగుతూ పోతుండటంతో పాటు రూపాయి భారీ క్షీణత ఇందుకు ప్రధాన కారణమని బులియన్ విశ్లేషకులు తెలిపారు.

వెండి విషయంలో సరఫరా కొరతతో పాటు పారిశ్రామిక వినియోగం భారీగా పుంజుకోవడం కూడా ధరలను ఎగదోస్తున్నాయని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర 57.6 డాలర్ల (1.34 శాతం) వృద్ధితో 7 వారాల గరిష్ఠ స్థాయి 4,377 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ ఆల్‌టైమ్ రికార్డు గరిష్ఠం 64.8 డాలర్లకు చేరుకుంది.

ఈ ఏడాదిలో 122 శాతం అప్

ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం కిలో వెండి రూ.5,100 పెరుగుదలతో రూ.1,99,500కు చేరగా.. 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర కూడా రూ.1,110 పెరిగి రూ.1,33,600కు ఎగబాకింది. 2024 డిసెంబరు 31న రూ.89,700 పలికిన కిలో వెండి ధర.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.1,09,800 (122 శాతం) పెరిగింది. ఇంటర్నేషనల్ మార్కెట్ విషయానికొస్తే, గత ఏడాది చివరి రోజున 28.97 డాలర్లుగా ఉన్న ఔన్స్ సిల్వర్.. 2025లో ఇప్పటివరకు 35.83 డాలర్లు (123 శాతం) పుంజుకుంది.

వచ్చే ఏడాదిలో రూ.2.40 లక్షలకు..

సిల్వర్ ర్యాలీ ఇప్పట్లో ఆగదని యాక్సిస్ సెక్యూరిటీస్ అంటోంది. దేశీయంగా ధర మరో 20 శాతం మేర పెరిగి వచ్చే ఏడాదిలో రూ.2.40 లక్షల స్థాయికి ఎగబాకే అవకాశాలున్నాయని తాజా నివేదికలో అంచనా వేసింది. వెండి ధర రూ.1.70-1.78 లక్షల స్థాయికి దిద్దుబాటు అయిన సమయంలో దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టవచ్చని సూచించింది.

ప్రపంచంలో ఐదో అతిపెద్ద అసెట్

మార్కెట్ విలువపరంగా సిల్వర్.. మైక్రోసాఫ్ట్‌ను అధిగమించి ప్రపంచంలో ఐదో అతిపెద్ద అసెట్‌గా అవతరించింది. సిల్వర్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3.60 లక్షల కోట్ల డాలర్లు మించిపోగా.. మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాప్ 3.59 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. కాగా, బంగారం 30 లక్షల కోట్ల డాలర్లతో ప్రపంచంలో అత్యంత విలువైన అసెట్‌గా ఉంది. ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా 4.39 లక్షల కోట్ల డాలర్లు, యాపిల్ 4.11 లక్షల కోట్ల డాలర్లు, గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ 3.8 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్‌లో వరుసగా 2,3,4 స్థానాల్లో ఉన్నాయి.

ఎస్‌బీఐ వడ్డీ రేట్లు 0.25 శాతం తగ్గింపు

ఈ నెల 15 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: రుణాలపై వడ్డీ రేట్లను పావు శాతం (0.25%) తగ్గిస్తున్నట్టు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ప్రకటించింది. కొత్తగా ఇచ్చే రుణాలతో పాటు పాత రుణాలకూ ఈ తగ్గింపు వర్తిస్తుందని తెలిపింది. ఇటీవలి ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ కీలక రెపో రేటును 5.5 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గించడంతో ఎస్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పటి వరకు 8.15 శాతంగా ఉన్న ఎస్‌బీఐ ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లింక్డ్ రేట్ (ఈబీఎల్‌ఆర్) కనీస వడ్డీ రేటు 7.90 శాతానికి తగ్గుతుంది. తగ్గించిన ఈ వడ్డీ రేట్లు ఈ నెల 15 నుంచే అమల్లోకి వస్తాయని ఎస్‌బీఐ తెలిపింది. ఏడాది కాలపరిమితి ఉండే ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రుణాలపై వసూలు చేసే కనీస వడ్డీ రేటును కూడా 8.75 శాతం నుంచి 8.70 శాతానికి తగ్గించినట్టు పేర్కొంది.

క్రిప్టోలపై భారత్‌లో నిషేధం!?

న్యూఢిల్లీ: బిట్‌కాయిన్ సహా ఇతర క్రిప్టో కరెన్సీలను భారత్‌లో పూర్తిగా నిషేధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. క్రిప్టోలపై నిషేధం ప్రస్తుతం పరిగణనలో ఉందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టీ రవి శంకర్ శుక్రవారం అన్నారు. సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ పూర్తయ్యాక కేంద్రం ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకోనుందన్నారు. మింట్ వార్షిక బీఎఫ్‌ఎస్‌ఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. క్రిప్టో కరెన్సీ వాస్తవానికి కరెన్సీ కాదని, అది కేవలం సాఫ్ట్‌వేర్ కోడ్ మాత్రమేనని అన్నారు. అంతేకాదు, క్రిప్టోలను ఎలాంటి ఆస్తిగానూ పరిగణించలేమన్నారు. క్రిప్టోలకు యధార్థ విలువ, నిర్దిష్ట జారీదారు, ఆర్‌బీఐ సహా ఏ దేశ సెంట్రల్ బ్యాంక్ హామీ లేకపోవడం వల్ల వీటికి ద్రవ్య అర్హత లేదన్నారు.

లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఇండియా.. తమ వాహనాల ధరలను వచ్చే ఏడాది జనవరి నుంచి గరిష్ఠంగా 2 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించింది. యూరోతో పోలిస్తే రూపాయి విలువ మరింత పతనమవుతున్న తరుణంలో సంస్థపై పడుతున్న విదేశీ మారక ద్రవ్య భారాన్ని తగ్గించుకునేందుకు ధరలు పెంచాలని నిర్ణయించినట్లు తెలిపింది.

రిటైల్ ద్రవ్యోల్బణం 0.71%

న్యూఢిల్లీ: నవంబరులో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 0.71 శాతానికి చేరుకుంది. కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, మసాలాలు ఇతర ఆహార ఉత్పత్తులతో పాటు ఇంధనం, విద్యుత్ ధరలు స్వల్పంగా పెరగడం ఇందుకు కారణమని ప్రభుత్వ డేటా పేర్కొంది. అంతక్రితం నెలలో (అక్టోబరు) రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ఠ స్థాయి 0.25 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే. ద్రవ్యోల్బణం సూచీ ఆర్‌బీఐ నియంత్రణ లక్ష్యమైన 4 శాతానికి దిగువన నమోదవడం వరుసగా ఇది పదో నెల. అంతేకాదు, ఒక శాతానికి దిగువన నమోదవడం వరుసగా ఇది రెండో నెల. ఎన్‌ఎస్‌ఓ శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఆహార ధరల సూచీ అక్టోబరులో నమోదైన -5.02 శాతం నుంచి నవంబరులో -3.91 శాతానికి పెరిగింది.

విస్తరణ బాటలో నియో స్ట్రెచ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫ్యాబ్రిక్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ డోనియర్ గ్రూప్‌నకు చెందిన ప్రీమియం మెన్స్‌వేర్ బ్రాండ్ నియో స్ట్రెచ్ హైదరాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ తొలి షోరూమ్‌ను లేక్‌షోర్ వై జంక్షన్ మాల్‌లో సంస్థ వ్యవస్థాపకుడు రిషి అగర్వాల్ ప్రారంభించారు. సంస్థ ఇప్పటికే పుణె, బెంగళూరుల్లో 4 ప్రత్యేక బ్రాండ్ అవుట్‌లెట్స్‌ను నిర్వహిస్తుండగా తాజాగా హైదరాబాద్‌లోకి అడుగుపెట్టినట్లు చెప్పారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో మరో 10 స్టోర్లను ప్రారంభించాలని చూస్తున్నట్లు తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా రానున్న మూడేళ్లలో 300 స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రిషి వెల్లడించారు. ప్రస్తుతం మెన్స్‌వేర్‌కు పరిమితమైనప్పటికీ రానున్న రోజుల్లో ఉమెన్, కిడ్స్ వేర్ విభాగంలోకి ప్రవేశించాలని చూస్తున్నట్లు రిషి తెలిపారు. ప్రస్తుతం డోనియర్ గ్రూప్.. గుంటూరు, సూరత్, సిల్వాసా, భివాండీ, అమృత్‌సర్‌ల్లో ఫ్యాబ్రిక్ తయారీ యూనిట్లను నిర్వహిస్తోంది.

అందరికీ బీమాతోనే భద్రత

హైదరాబాద్: బీమా రక్షణను అందరికీ చేరువ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సులో వక్తలు పేర్కొన్నారు. వినూత్న పాలసీలతో అందరికి బీమాను చేరువ చేయడమే ఇందుకు మార్గమన్నారు. ఇన్సూరెన్స్ సూపర్‌విజన్, 20వ ఆసియన్ ఫోరమ్ ఆఫ్ ఇన్సూరెన్స్ రెగ్యులేటర్స్ (ఏఎఫ్‌ఐఆర్) పేరుతో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఈ నెల 9-11 తేదీల్లో ఒక అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి చెందిన 15 దేశాల నుంచి 40 మందికి పైగా బీమా రంగ నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

మళ్లీ 26,000 పైకి నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు లోహ రంగ షేర్లలో కొనుగోళ్లతో దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు శుక్రవారం లాభాల్లో పయనించాయి. ఒక దశలో 503 పాయింట్ల వరకు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 449.53 పాయింట్ల లాభంతో 85,267.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148.40 పాయింట్ల వృద్ధితో 26,046.95 వద్దకు చేరుకుంది.

కొత్త కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం ఒక దశలో 24 పైసలు పతనమై రూ.90.56 వద్ద ఆల్‌టైమ్ ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 17 పైసల నష్టంతో రూ.90.49 వద్ద ముగిసింది. ఇది కొత్త కనిష్ఠ ముగింపు కూడా.

భారత మార్కెట్లోకి 'ఓజెంపిక్' ఇంజక్షన్

మధుమేహ చికిత్స కోసం నోవో నార్డిస్క్ ఔషధం

ధర రూ.8,800 - రూ.11,175



న్యూఢిల్లీ: డెన్మార్క్ కేంద్రంగా పనిచేసే ఫార్మా కంపెనీ నోవో నార్డిస్క్ భారత మార్కెట్లోకి మరో బ్లాక్‌బస్టర్ ఔషధం 'ఓజెంపిక్'ను విడుదల చేసింది. ఈ ఔషధాన్ని టైప్ 2 డయాబెటిస్‌తో పాటు ఊబకాయ నియంత్రణ కోసం ఉపయోగించనున్నారు. ఇన్సులిన్ పెన్ రూపంలో విడుదల చేసిన ఈ ఓజెంపిక్ ఇంజక్షన్లు 0.25 ఎంజీ, 0.5 ఎంజీ, 1 ఎంజీ డోసేజీల్లో లభిస్తాయి. టైప్ 2 డయాబెటిక్ పేషెంట్లు డాక్టర్ల సిఫారసుపై వారానికి ఒకసారి ఈ ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే వారానికి ఒకసారి చొప్పున నెలకు నాలుగు సార్లు ఉపయోగించాల్సిన 0.25 ఎంజీ డోసేజీ ఇంజక్షన్ ధర రూ.8,800 వరకు ఉంది. ఇక 0.5 ఎంజీ సామర్థ్యంతో కూడిన నాలుగు ఇంజక్షన్స్ ధర రూ.10,170, 1ఎంజీ డోసేజీ ధర రూ.11,175 చొప్పున నిర్ణయించింది.

అదే జెనరిక్: నోవా నార్డిస్క్ ఈ ఏడాది జూన్‌లో 'వెగోవీ' పేరుతో ఊబకాయ నియంత్రణ ఔషధాన్ని భారీ ధరతో విడుదల చేసింది. ఇప్పుడు విడుదల చేసిన ఓజెంపిక్, వెగోవీ తయారీలోనూ సెమాగ్లుటైడ్ అనే యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్ (ఏపీఐ) ప్రధాన ముడి పదార్థంగా ఉంది. కాగా ఈ రెండు ఔషధాలపై నోవో నార్డిస్క్‌కు వచ్చే ఏడాది మార్చి వరకు పేటెంట్ హక్కులు ఉన్నాయి.

ఎంఎస్ఎంఈ రుణ విభాగంలోకి వివిఫై

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డిజిటల్ లెండింగ్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ వివిఫై ఇండియా ఫైనాన్స్.. ఎంఎస్ఎంఈ రుణ విభాగంలోకి ప్రవేశించింది. ఎలాంటి క్రెడిట్ హిస్టరీ లేని చిరు వ్యాపారులు, గిగ్ వర్కర్లు, మైక్రో ఆంత్రప్రెన్యూర్స్‌కు అవసరమైన రుణాలను 'ఉద్యమ్ ఫ్లెక్స్ లోన్' కింద అందించనున్నట్లు వివిఫై ఎండీ అనిల్ కుమార్ పినపాల తెలిపారు. ఇప్పటి వరకు వ్యక్తిగత రుణ విభాగంలో కీలకంగా ఉన్న వివిఫై ఎంఎస్ఎంఈ రంగంలోని సంస్థలకు ఆర్థికంగా తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో ఈ విభాగంలోకి అడుగు పెట్టిందని ఆయన చెప్పారు. వచ్చే మూడు నుంచి ఐదేళ్ల కాలంలో సంస్థ లోన్ బుక్‌లో ఎంఎస్ఎంఈ రంగం వాటా 30-40 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనిల్ తెలిపారు. ఈ రంగంలోని ఆయా సంస్థల సామర్థ్యాన్ని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు రుణాలను అందించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం సంస్థ నిర్వహణలో ఉన్న ఆస్తుల (ఏయూఎం) విలువ రూ.2,000 కోట్ల వరకు ఉందన్నారు. వివిఫై ఈ ఏడాది రూ.250 కోట్ల వరకు నిధులను సమీకరించిందని తెలిపారు కాగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ రూపంలో రూ.450 కోట్ల వరకు సమీకరించాలని చూస్తున్నట్లు అనిల్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	656	విజయవాడ	690
వరంగల్	658	గోదావరి	665
చిత్తూరు	673	విశాఖపట్నం	660
		డజను గుడ్లు రూ.	96

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	120
వరంగల్	119	గుంటూరు	125
కరీంనగర్	119	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	119
కర్నూలు	119	నెల్లూరు	124
విశాఖపట్నం	116	అనంతపురం	124
గోదావరి	120		

ఏపీ నిట్‌లో మళ్లీ ఎంటెక్ కోర్సులు

- ఈ ఏడాది మొదలైన తరగతులు
- సిబ్బంది కొరతతో మూడేళ్ల క్రితం నిలిపివేత

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో ఎంటెక్ కోర్సులు మళ్లీ ప్రారంభమయ్యాయి. అధ్యాపక సిబ్బంది కొరత ఉందంటూ మూడేళ్ల క్రితం ఈ కోర్సులను అక్కడ రద్దు చేశారు. గత ఏడాది ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడంతో ఎనిమిది విభాగాల్లో ఎంటెక్ కోర్సులను మళ్లీ అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు అధ్యాపక సిబ్బంది కొరత కారణంగా బీటెక్ సీట్లు కుదించడంతోపాటు, ఎంటెక్ కోర్సులను రద్దు చేశారు. గత ఏడాది ప్రొఫెసర్ల నియామకానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించడంతో 18 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేశారు. కేంద్రం అనుమతించిన మరో 62 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. డైరెక్టర్ నియామకం పూర్తయిన తర్వాత మిగతా అధ్యాపక పోస్టులను కూడా భర్తీ చేస్తారు. వచ్చే ఏడాది నుంచి ఏపీ నిట్‌లో బీటెక్ సీట్ల సంఖ్య పెంపును అమలు చేయాలని నిట్ అధికారులు ప్రణాళిక చేస్తున్నారు. మరోవైపు ఏపీ నిట్ డైరెక్టర్ నియామక కోసం ఇంటర్వ్యూలు పూర్తి కావడంతో ముగ్గురు అభ్యర్థుల జాబితా కేంద్రానికి చేరుకుంది. రాష్ట్రపతి వద్దకు జాబితా వెళితే, ఒకరిని నిట్ డైరెక్టర్‌గా నియమించనున్నారు. ప్రస్తుతం అకడమిక్, ప్లేస్‌మెంట్స్ పరంగా ఏపీ నిట్ మంచి స్థాయిలో ఉంది.

పాఠశాల విద్యకు అథారిటీ ఏర్పాటు

- విద్యలో నాణ్యత, ఫలితాలపై ప్రత్యేక దృష్టి

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ నూతన అథారిటీని తీసుకొచ్చింది. 'రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ)ని ఏర్పాటు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. సెకండరీ విద్య బోర్డు... ఎస్ఎస్ఎస్ఏగా పనిచేస్తుందని తెలిపింది. ప్రధానంగా పాఠశాల విద్యలో నాణ్యత మదింపు, ఫ్రేమ్‌వర్క్‌పై అథారిటీ దృష్టి పెడుతుందని తెలిపింది. తద్వారా కనీస నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యమైన విద్యకు హామీ లభిస్తుందని పేర్కొంది. ఈ అథారిటీకి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారు. వైస్ ఛైర్మన్‌గా ఆ శాఖ కమిషనర్, సభ్యులుగా ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి, సమగ్రశిక్ష ఎస్పీడీ, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌లు ఉంటారు. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. కొత్తగా ఏర్పాటు చేసిన అథారిటీ ఇంటర్మీడియట్ బోర్డు తరహాలో పనిచేస్తుంది. పాఠశాలలకు అనుమతులు, అభ్యసన ఫలితాలు, నాణ్యతను పర్యవేక్షిస్తుంది.

వారికి ఒక భాషా సబ్జెక్ట్ మినహాయింపు!

- ప్రత్యేక అవసరాలు కలిగిన ఇంటర్ విద్యార్థుల విషయంలో పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక భాషా సబ్జెక్టు నుంచి మినహాయింపు ఇస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. మినహాయింపు ప్రస్తుతం ఆప్షనల్‌గా ఉంది. మినహాయింపు పొందిన విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో చేరేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మినహాయింపుతో పాటు నాలుగు సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల సగటును మినహాయింపు పొందిన సబ్జెక్టుకు కేటాయిస్తామని పాఠశాల విద్యాశాఖ తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కుష్టు, కండరాల బలహీనత, యాసిడ్ దాడి బాధితులు, మరగుజ్జు, అంధులు, దృష్టి, వినికిడి లోపం ఉన్నవారు, ఇంటలెక్చువల్ డిజేబిలిటీ, క్రానిక్ న్యూరోలాజికల్, రక్త సంబంధిత వ్యాధులు కలిగిన వారికి ఈ మినహాయింపు వర్తిస్తుందని తెలిపింది. రెండు భాషా సబ్జెక్టుల్లో ఏదైనా ఒకదానిని విద్యార్థులు మినహాయింపుగా పొందవచ్చు. ఈ విధానాన్ని ఇకపై శాశ్వతంగా అమలు చేసేందుకు ఈ ఉత్తర్వులు జారీచేశారు.

830 కోట్లతో విద్యార్థి కిట్ల కొనుగోలు

- పరిపాలనా అనుమతులు మంజూరు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో రూ.830 కోట్లతో విద్యార్థులకు అందించే కిట్ల కొనుగోలుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బెల్టులు, బూట్లు, బ్యాగులు, యూనిఫాం క్లాత్, డిక్షనరీ, పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలు కిట్‌గా అందజేస్తారు. అలాగే యూనిఫాం కుట్టు కూలీ కూడా తల్లిదండ్రులకు ఇస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ.157 కోట్లుగా ఉంది.

ఆ విద్యార్థుల ఉసురు తీసిన ముఠా అరెస్టు

- లారీ డ్రైవర్‌ను కొట్టి.. దోచుకుందామని ఏఎస్సై కుమారుడి గ్యాంగ్ స్కెచ్
- ఖాకీల నీడలో జోరుగా అక్రమ దందాలు
- వీరి పాత నేరాలు వెల్లడించని పోలీసులు



మీడియాతో మాట్లాడుతున్న నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు

చిలకలూరిపేట/నరసరావుపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట బైపాస్ రోడ్డుపై వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటనకు కారకులైన ఐదుగురు సభ్యుల ముఠాను నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు శుక్రవారం నాదెండ్లలో అరెస్టు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "హైవేపై ట్రాక్టర్ల లోడ్‌తో వెళ్తున్న లారీని ఆపి, డ్రైవర్‌ను కొట్టి నగదు దోచుకోవాలని ఈ ముఠా స్కెచ్ వేసింది. ఈ క్రమంలోనే లారీని ఆపారు. ఈ సమయంలో లారీ డ్రైవర్ ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండా.. సడన్‌గా బ్రేక్‌లు వేసి రోడ్ మార్జిన్ వైపు లారీని తీస్తుండగా వెనుక వస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థుల కారు లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను గుర్తించాం. అరెస్టయిన వారిలో మదమంచి వెంకట అనుజ్ఞనాయుడు(32)(నరసరావుపేట), పుల్లంశెట్టి మహేశ్(29)(నకరికల్లు), బెల్లంకొండ గోపి(31)(నకరికల్లు), షేక్ నబీ బాషా(25)(చినతురకపాలెం), నాలి వెంకట రావు(38)(నరసరావుపేట టౌన్) ఉన్నారు. నిందితులు ఉపయోగించిన కారును, వారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నాం." అని తెలిపారు.

గ్యాంగ్‌ను రక్షిస్తోంది ఎవరు?

ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి కేసులో అరెస్టయిన వారిలో నరసరావుపేట ఏఎస్ఐ కుమారుడు మదమంచి వెంకట అనుజ్ఞానాయుడు అలియాస్ వెంకట్ అలియాస్ నాయుడు(32) ప్రధాన నిందితుడు. అయితే విచారణలో వెల్లడైనట్లు ప్రచారం జరుగుతున్న అంశాలను అరెస్టు సందర్భంగా పోలీసులు పేర్కొనకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నరసరావుపేటలో బంగారం పేరుతో రూ.40 లక్షలు కాజేసినట్లు గతంలో ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోకుండా నాయుడుని వదిలేశారని అప్పట్లో పోలీసు శాఖపై విమర్శలొచ్చాయి. కార్లు అపహరించారని కూడా విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. ఓ పోలీసు అధికారికి సంబంధించిన కారును ఈ గ్యాంగ్ వినియోగించినట్లు తెలుస్తోంది. రహదారుల్లో వాహనాలు నిలిపి రవాణ శాఖ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తున్నా ఈ అంశాలను ప్రస్తావించ లేదు. ఏఎస్ఐని బదిలీ చేసి పోలీసు శాఖ చేతులు దులుపుకోవడంపై విమర్శలొస్తున్నాయి. ఇదిలాఉండగా, ఓ పోలీసు అధికారి నిర్వహించే సంస్థకు నాయుడు విరాళాలు ఇచ్చారని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖలో కీలక పోస్టులో ఉన్న సదరు అధికారి నాయుడును సత్కరించినట్లు తెలుస్తోంది. ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి కేసులో సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా ఏఎస్ఐ కుమారుడి నిర్వాకం బయటపడింది. లేకుంటే.. కొందరు ఖాకీల నీడలో అతను చేస్తున్న దందాలు ఎప్పటికీ వెలుగు చూసేవి కావన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సాయిప్రసాద్ నియామకంపై విచారణ

- ఎస్ఈసీకి పంచాయతీరాజ్ శాఖ లేఖ
- 2020లో ఎన్నికల్లో సాయిప్రసాద్ కుట్ర
- సీఎఫ్‌డీ ఫిర్యాదు ఆధారంగా చర్యలు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ సాయి ప్రసాద్ నియామకంపై విచారణ జరపాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఎస్ఈసీకి లేఖ రాసింది. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ(సీఎఫ్‌డీ) రాసిన లేఖ ఆధారంగా ఆయనపై చర్యలకు ఉపక్రమించింది. సీఎఫ్‌డీ ఆరోపణలపై విచారణ చేసి, సమగ్ర నివేదిక సమర్పించాలని ఎస్ఈసీ కార్యదర్శికి స్పష్టం చేసింది. 2020 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎన్నికలను ఆపే కుట్ర జరిగిందని, అందులో సాయి ప్రసాద్ ప్రధాన కుట్రదారని ఆరోపిస్తూ సీఎఫ్‌డీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ నవంబరులో సీఎం చంద్రబాబుకు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. రాజకీయ కారణాలతో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకునే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. అందుకోసం ఎస్ఈసీ కార్యాలయంలో ఎక్కువ మంది ఉద్యోగులు సెలవులు తీసుకునేలా ప్రోత్సహించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అప్పట్లో ఎస్ఈసీ ఆయన్ను విధుల నుంచి తొలగించిందని, కానీ ప్రస్తుత ఎస్ఈసీ సర్వీసు నిబంధనలు ఉల్లంఘించి తిరిగి అతన్ని నియమించారని వివరించారు. పైగా ఆయనకు అదనపు కార్యదర్శిగా పదోన్నతి కల్పించారని తెలిపారు. ఎన్నికల విధులను అడ్డుకున్న కారణంతో తొలగించిన ఉద్యోగిని తిరిగి అక్కడే ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. సాయి ప్రసాద్‌ను తక్షణం బదిలీ చేసి, ఆయన నియామకంపై విచారణ జరపాలని తన ఫిర్యాదులో నిమ్మగడ్డ డిమాండ్ చేశారు.

17, 18 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

- జీఎస్‌డీపీ లక్ష్యాలు, సూపర్ సిక్స్‌పై చంద్రబాబు దిశా నిర్దేశం

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల సదస్సును ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర సచివాలయంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో సీసీఎల్ఏ స్వాగతోపన్యాసం చేస్తారు. అనంతరం, రెవెన్యూ, ఆర్థిక శాఖల మంత్రులు, ఉపముఖ్యమంత్రి పవన్, సీఎం చంద్రబాబు మాట్లాడతారు. జీఎస్‌డీపీ లక్ష్యాలు, సూపర్ సిక్స్‌పై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. ఒక్కొక్క శాఖ కార్యదర్శి ఇచ్చే ప్రజంటేషన్ 5 స్లైడ్స్‌కి మించకూడదని సూచించారు. తర్వాత సీఎం చంద్రబాబు, మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు వాటిపై చర్చిస్తారు. ఒక రంగానికి గంటన్నర కేటాయిస్తే దానిలో 45 నిమిషాలు నోడల్ కార్యదర్శి, శాఖల వారీ కార్యదర్శులు ఇచ్చే ప్రజంటేషన్లకు, మిగిలిన 45 నిముషాలను చర్చకు కేటాయిస్తారు. ప్రతి నోడల్ సెక్రటరీ తమ పరిధిలోని విభాగాలు, జిల్లాల జీఎస్‌డీపీ లక్ష్యాల్లో సాధించిన ప్రగతి, ఎదురైన సవాళ్ల గురించి, ఆయా విభాగాల పరిధిలో ఉన్న సూపర్ సిక్స్ పథకాల అమలు వివరాలు వెల్లడిస్తారు. జిల్లా కలెక్టర్లు తాము అమలు చేసిన ఉత్తమ విధానాలు, వాటి ఫలితాల గురించి తెలియజేస్తారు. మొదట రాష్ట్ర జీఎస్‌డీపీపై ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్ ప్రజంటేషన్ ఇస్తారు. ఆ తర్వాత రంగాల వారీగా ఆయా సెక్రటరీలు ప్రజంటేషన్ ఇస్తారు. సంక్షేమ పథకాలు, సాధికారతపై సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ ప్రజంటేషన్ ఇస్తారు. 18న స్వచ్ఛభారత్, సర్క్యులర్ ఎకానమీ, ఐటీ, రెవెన్యూ, ఆదాయార్జన శాఖలు, గనులు, అటవీ, రోడ్లు భవనాలు, పురపాలకశాఖపై ప్రజంటేషన్లు, వాటిపై చర్చలు జరుగుతాయి. అదేరోజు రాష్ట్రంలో శాంతిభద్రతలపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరిస్తారు. దీనిపై చర్చ అనంతరం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై ఐటీ శాఖ సెక్రటరీ కాటమనేని భాస్కర్ ప్రజంటేషన్ ఇస్తారు.

ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్లకు

త్వరలో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలు

- కాపుల అభ్యున్నతికి సీఎం ప్రాధాన్యం.. మంత్రి సవిత వెల్లడి

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ తరహాలో కాపు కార్పొరేషన్, అన్ని ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్లకు క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటు చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ఛైర్మన్లతో శుక్రవారం సచివాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కాపు, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఇతర ఈబీసీ కులాల సాధికారత కోసం నూతన సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. 2014-19 మధ్య ఈడబ్ల్యూఎస్ సామాజికవర్గాలకు అమలుచేసిన అన్ని పథకాలను పునఃప్రారంభిస్తామని వెల్లడించారు. కోమటి, గుప్తా, శెట్టి పేర్లకు బదులుగా అందరినీ ఆర్యవైశ్యులుగా సంబోధించేలా త్వరలో ప్రభుత్వం ప్రకటన చేస్తుందని మంత్రి సవిత పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేషన్ల ఛైర్మన్లు కొత్తపల్లి సుబ్బారాయుడు, డూండీ రాకేశ్, బ్రహ్మం చౌదరి, బుచ్చి రాంప్రసాద్, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీపై యూజీసీకి లేఖ రాస్తా

- టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి యూజీసీ అనుమతులు సకాలంలో వచ్చేలా చూస్తానని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. ఇందుకోసం యూజీసీకి లేఖ రాస్తానన్నారు. వర్సిటీ ఓఎస్డీ వెలగా జోషి, మరో ప్రతినిధి సుబ్బారెడ్డి శుక్రవారం ఢిల్లీలో ఎంపీని కలిసి యూనివర్సిటీ అనుమతుల నివేదికను అందజేశారు.

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో 5 డైరెక్టర్ల ఖాళీలు భర్తీ

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న ఐదు డైరెక్టరు పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. శ్రీనివాస్ ప్రసాదుల (గాజువాక), నక్కల అగస్తియన్‌బాబు (ప్రత్తిపాడు), సుబ్బారాయుడు యాదవ్ (కడప), మలిశెట్టి వెంకటేశ్వర్లు (కావలి), యెనిమిరెడ్డి మాలకొండయ్య (కాకినాడ సిటీ)లను డైరెక్టర్లుగా నియమిస్తూ సివిల్ సప్లయిస్ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫిషియో కార్యదర్శి సౌరభ్ గౌర్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

18న మెడికల్ కాలేజీల వద్ద సీపీఐ ఆందోళనలు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం పేరుతో ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 18న రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీల వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో విద్యార్థులు, మేధావులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ఏపీ మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడండి

- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బోట్లతో ఇబ్బందులు: ఎంపీ వేమిరెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. తమిళనాడు, పుదుచ్చేరి నుంచి మెకనైజ్డ్ స్టీల్ బోట్స్ ద్వారా వచ్చే వారు నెల్లూరులోని జువ్వలదిన్నె, ఇస్కపల్లి ప్రాంతాల్లో మత్స్య సంపదను దోచుకుంటున్నారని, దాంతో స్థానిక మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడటంతో పాటు అభద్రతాభావానికి గురవుతున్నారన్నారు. ఈ మేరకు శుక్రవారం లోక్‌సభలో ఏపీ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. లోతైన సముద్ర చేపల వేటకు మద్దతు ఇవ్వాలన్నారు. తీర మండలాలను నిరంతరం పర్యవేక్షించడానికి, అక్రమ బోట్ల ప్రవేశాన్ని నిరోధించడానికి, సాంప్రదాయ మత్స్యకారుల ప్రయోజనాల రక్షణకు అంతరాష్ట్ర సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ మత్స్యకారుల కోసం సబ్సిడీ నిబంధనలను సవరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

‘చెత్త’ ట్రక్కులకు ఏఐ కెమెరాలు!



» డాలస్‌లో వ్యర్థాల సేకరణలో వినూత్న పద్ధతి

(డాలస్ నుంచి కిలారు గోకుల్ కృష్ణ)

అమెరికాలోని డాలస్ నగరంలో చెత్త నిర్వహణ విధానాన్ని ఆధునికీకరించనున్నారు. ఇందుకోసం అధికారులు కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించనున్నారు. చెత్తను తరలించే ట్రక్కులకు ఏఐ కెమెరాలను అమర్చనున్నారు. వచ్చే ఏడాది ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. చెత్త, వ్యర్థాలను తరలించే 100 ట్రక్కులకు ప్రత్యేక ఏఐ కెమెరాలను అమర్చనున్నారు. చెత్త పేరుకుపోవడం, నిర్మాణ వ్యర్థాలు, చట్టవిరుద్ధంగా పడేసిన వస్తువులు వంటి వాటిని ఆయా కెమెరాల ద్వారా కచ్చితత్వంతో గుర్తించనున్నారు. తద్వారా ఉల్లంఘనలను గుర్తించి, సత్వరమే సంబంధిత శాఖలకు నివేదికలు పంపేందుకు వెసులుబాటు కలుగుతుందని పేర్కొంటున్నారు. ఈ కెమెరాలు గూగుల్ స్ట్రీట్ వ్యూ టెక్నాలజీ తరహాలో పనిచేస్తాయి. బుధవారం జరిగిన సిటీ కౌన్సిల్ సమావేశంలో గోప్యత, డేటా నిల్వలపై చర్చించి, ఈ ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ చర్యలు అమెరికాలో ఆసక్తిగా మారాయి.

బాధాకరం.. బాధితులను ఆదుకుంటాం

» రాష్ట్రపతి, ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం

న్యూఢిల్లీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చింతూరు-మారేడుమిల్లి ఘాట్‌రోడ్ ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బస్సు ప్రమాద ఘటన గురించి తెలుసుకుని బాధపడ్డానని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని రాష్ట్రపతి ముర్ము ‘ఎక్స్’లో తెలిపారు. "బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించడం బాధాకరం. బాధితులు, వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని ప్రధాని పేర్కొన్నారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం ప్రకటించారు.

ఆరోగ్య రంగంలో ‘ఏఐ’ వినియోగం

» 15న విజయవాడలో జాతీయస్థాయి సదస్సు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రంగంలో ఐటీని అనుసంధానం చేసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. దీనిలో భాగంగా ‘ఆరోగ్య రంగం-కృత్రిమ మేధ వినియోగ విధానం రూపకల్పన-సంబంధిత విభాగాల భాగస్వామ్యం’ పేరిట కేంద్రం జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తోందని రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. ఈ నెల 15న విజయవాడలో ఈ సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో ఏపీతోపాటు తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి పాల్గొంటాయని చెప్పారు. ఆరోగ్యశాఖ పది ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యరంగంలో ఐటీ అనుసంధానం, ఏఐ వినియోగంపై చర్చించనున్నారు. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధను వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కేంద్రం భావిస్తోంది. తదనుగుణంగా జాతీయస్థాయిలో ముసాయిదా రూపకల్పనకు కేంద్ర ఐటీ శాఖ సిద్ధమైంది. ఈ క్రమంలో ఎంపిక చేసిన రాష్ట్రాల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహించి అధికారులు, నిపుణుల అభిప్రాయాలు సేకరించనుంది. ఢిల్లీ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 26 నిర్వహించే ‘ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఫర్ హెల్త్’ సదస్సులో ముసాయిదా రూపొందిస్తారు.



పంట కాల్వలో బోల్తాకొట్టిన వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

అతి వేగానికి ఐదు ప్రాణాలు బలి

» కొబ్బరికాయల లోడు వాహనం కాల్వలో బోల్తా

» ముగ్గురు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కొల్లూరు/ భట్టిప్రోలు/ పిట్టలవానిపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగం ఐదు ప్రాణాలను బలి తీసుకుంది. కొబ్బరి కాయల లోడుతో వెళుతున్న వాహనం అదుపుతప్పి పంట కాల్వలో బోల్తా కొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం లంక గ్రామాల్లోని తోటల నుంచి కొబ్బరికాయలను సేకరించడానికి భట్టిప్రోలు మండలం చింతమోటుకి చెందిన తండ్రీ కొడుకులు సమ్మెట పోతురాజు, గణేశ్ వెళ్లారు. తమతో పాటు చింతమోటుకు చెందిన కూలీలు చాట్రగడ్డ కాంతారావు (50), పెసర్లంక శ్రీనివాసరావు (55), వెల్లటూరుకు చెందిన షేక్ ఇస్మాయిల్ (60)ను వెంట తీసుకువెళ్లారు. కాయలను లోడు చేసుకుని తిరిగి వెళ్తుండగా దోనేపూడి-కోటిపల్లి మధ్య వాహనం అదుపు తప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. వాహనం క్యాబిన్‌లో ఉన్న గణేశ్, పోతురాజు గాయపడగా, మరో వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. కాయలపై కూర్చొన్న కాంతారావు, శ్రీనివాసరావు, ఇస్మాయిల్ వాహనం కింద పడి కాల్వలో కూరుకుపోయి మృతిచెందారు. స్థానికులు బోల్తా కొట్టిన వాహనానికి తాళ్లు కట్టి పైకి లేపి మృతదేహాలను వెలికితీశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తెనాలి, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలకు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే ఆనందబాబు, ఎస్పీ ఉమామహేశ్వర్ పరిశీలించారు. మరో ఘటనలో... ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు వేగంగా ఢీకొన్న ఘటనలో ఇరువురు దుర్మరణం పాలయ్యారు. బాపట్ల జిల్లా చందోలు ఎస్‌ఐ వెంకట శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరం మండలం చినమట్లపూడి చెందిన షేక్ జాన్ సైదా(35) భార్య, కుమారుడితో కలిసి బైక్‌పై చందోలు వస్తుండగా అదే మండలం పెదపల్లి గ్రామానికి చెందిన ఆట్ల భానుప్రకాశ్(22) బైక్‌పై వెళ్తూ వేగంగా ఎదురొచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన షేక్ జాన్‌సైదా, భానుప్రకాశ్ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘాట్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

మధ్య ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో తొమ్మిది మంది యాత్రికులు అక్కడికక్కడే మృతి చెందగా, పదిమంది తీవ్రంగానూ, మరో 11మంది స్వల్పంగా గాయపడ్డారు. ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఘాట్ రోడ్డు కావడం..విపరీతంగా పొగ మంచు కురుస్తుండడంతో పాటు డ్రైవర్ అతివేగమే శాపంగా మారిందని బాధితులు చెబుతున్నారు.

మూడురోజుల క్రితం..

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 32 మంది పంచారామం పుణ్యక్షేత్రాలను సందర్శించాలని అనుకున్నారు. వీరికి యాత్రను ఏర్పాటుచేసిన టూరిస్టు ఆర్గనైజర్ వజ్రమణి, వంట మనుషులు ఇద్దరితోపాటు డ్రైవర్లు మధు, ప్రసాద్‌లతో కలిపి మొత్తంగా 37మందితో ఈ నెల తొమ్మిదో తేదీన ట్రావెల్స్ బస్సు బయలుదేరింది. ఉభయగోదావరి జిల్లాల మీదుగా గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీకి వారు చేరుకున్నారు. అక్కడినుంచి తిరుగు ప్రయాణమై, రాత్రి ఎనిమిది గంటల సమయంలో కాకినాడ జిల్లా జగ్గంపేట చేరారు. అక్కడినుంచి గోకవరం, రంపచోడవరం మీదుగా మారేడుమిల్లి చేరుకున్నారు. అప్పటికి అర్ధరాత్రి దాటింది. ఘాట్ రోడ్డు మీదుగా తెలంగాణ రాష్ట్రం భద్రాచలంవారి బస్సు చేరుకోవాల్సి ఉంది. అక్కడ పుణ్యస్నానం ఆచరించి శుక్రవారం ఉదయాన్నే సీతారాములను దర్శించుకోవాలనుకున్నారు.

ఘాట్‌ను మరో అరగంటలో దాటతారనగా..

ట్రావెల్స్ బస్సు ప్రయాణం మారేడుమిల్లి నుంచి దాదాపు 24 కిలోమీటర్ల మేర ఘాట్ రోడ్డులో బాగానే సాగింది. మరో అరగంట ప్రయాణించి ఆరు కిలోమీటర్ల దూరం దాటితే మైదాన ప్రాంత రహదారికి చేరుకుంటారు. అక్కడి నుంచి 71 కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తే వయా చింతూరు మీదుగా భద్రాచలం చేరుకుంటారు. అయితే, చింతూరుకు 20 కిలోమీటర్ల దూరంలో ఘాట్ మలుపు వద్ద ఎత్తయిన గుట్టను ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. గుట్టకు కొట్టుకున్న వెంటనే అదుపు తప్పిన బస్సు లోయ వైపు ఉన్న మట్టి దిబ్బను ఢీకొట్టి పైరోడ్డుకు కింద రోడ్‌కు మధ్య ఉన్న దాదాపు 30 అడుగుల లోయలో చిక్కుకుంది. దీంతో యాత్రికులు ఒక్కసారిగా హాహాకారాలు చేస్తూ నిద్రమత్తులో ఒకరిపై ఒకరు కుప్పలుగా పడిపోయారు. తెల్లవారుజాము కావడం.. మంచు ఎక్కువగా కురుస్తుండడంతో అటుగా చాలాసేపటికి వరకు ఎవరూ వెళ్లలేదు. ఉదయం 5-5.30 గంటల సమయంలో అటుగా వెళ్తున్న వ్యక్తులు విషయం తెలుసుకుని వెంటనే 108కు ఫోన్ చేశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.





చింతూరు ఏరియా ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రులు వంగలపూడి అనిత, రాంప్రసాద్‌రెడ్డి

మృతుల్లో ఎనిమిది మంది చిత్తూరు వాసులే

ఘాట్ ప్రమాదంలో మరణించి తొమ్మిదిమందిలో ఎనిమిదిమంది చిత్తూరు జిల్లా వాసులే ఉన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన సునంద. శివశంకర రెడ్డి దంపతులు ఈ ప్రమాదంలో మరణించారు. సునంద తల్లి గాయాలతో బయటపడ్డారు. ఇతర మృతులు... ఎస్వీ నాగేశ్వరరావు(68), మరాఠి వీధి, చిత్తూరు, శ్రీకళాదేవి(60), గిరింపేట, చిత్తూరు, దొరబాబు(37) తవణంపల్లె మండలం, చిత్తూరు, శ్యామల(67) - గిరింపేట, కావేరి కృష్ణ(70) మిట్టూరు, చిత్తూరు, కృష్ణకుమారి (52) పెనుమూరు మండలం, చిత్తూరు జిల్లా చిత్తూరు, శైలజా రాణి (65) తిరుచానూరు, తిరుపతి జిల్లా. కలిసి ప్రయాణం చేసిన దంపతుల్లో ఎస్వీ నాగేశ్వరరావు మరణించగా, అమ్ములు భాయ్ గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో మరణించిన దొరబాబు వంటమనిషిగా బస్సులో ప్రయాణించారు. శైలజారాణి స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి కాగా, ప్రస్తుతం తిరుచానూరులో ఉంటున్నారు. కాగా, మృతదేహాలను తెచ్చేందుకు ఎనిమిది అంబులెన్సులను, అధికారులను ఘటనా స్థలానికి పంపినట్లు చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఘాట్‌రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించింది. మంత్రులు వంగలపూడి అనిత, రాంప్రసాద్‌రెడ్డి, సంధ్యారాణి, చింతూరు ఏరియా ఆస్పత్రికి చేరుకుని, క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షలు, క్షతగాత్రులు ఒక్కొక్కరికీ రూ.రెండు లక్షల చొప్పున నష్ట పరిహారాన్ని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. ఘాట్ రోడ్లపై చలికాలం తగ్గే వరకు రాత్రి 10గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ప్రయాణాలను నిలిపివేస్తామని మంత్రి అనిత ప్రకటించారు.

డ్రైవర్ అతివేగమే ప్రాణాలు తీసింది : క్షతగాత్రుడు

“మేం నాలుగేళ్లగా పుణ్యక్షేత్రాల సందర్శనకు చిత్తూరు నుంచి వెళుతున్నాం. గురువారం అరకు చుట్టుపక్కల ప్రదేశాలు చూసుకుని భద్రాచలానికి రాత్రి బయలుదేరాం. చింతూరు- మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో డ్రైవరు అతి వేగంగా బండి నడిపాడు. మా బస్సు లోయలో పడగానే, చక్రాలు పైకి లేచి సీట్లు రోడ్డుకు గుచ్చుకున్నాయి. ఆ కుదుపులకు ఒకరిపై ఒకరం పడ్డాం. అతి కష్టం మీద నా భార్యను గుర్తించగలిగా. తలంతా తీవ్రగాయాలు. రక్తం ఓడుతోంది. అమెను అతికష్టం మీద ఆస్పత్రికి తరలించగలిగాం. నాలుగేళ్లుగా మా ఇంట్లో అద్దెకుంటున్న శైలజారాణి మా కళ్లెదుటే చనిపోవడం బాధ కలిగింది.”

\- రామస్వామి, తిరుచానూర్లు

అతివేగం.. నిర్లక్ష్యం.. అనుభవ రాహిత్యం..

ట్రావెల్ బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. వారిలో ఒకరు ప్రసాద్ కాగా రెండో డ్రైవర్ మధు. మధు జూనియర్. ఘాట్‌లో అనుభవం ఉన్న డ్రైవర్ మాత్రమే బండి నడపాలి. కానీ, సీనియర్ డ్రైవర్ ప్రసాద్ చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో జూనియర్ మధుకు బండిని అప్పగించి నిద్రకు ఉపక్రమించాడు. అనుభవ రాహిత్యంతోపాటు నిర్లక్ష్యంతో మధు బండిని అతివేగంగా నడిపాడని కొందరు క్షతగాత్రులు తెలిపారు. గేర్ న్యూట్రల్ చేయడంతో వేగం పెరిగి చివరకు అదుపుతప్పి ప్రమాదానికి గురయి ఉండవచ్చునని కూడా చెబుతున్నారు. బ్రేక్ ఫెయిల్ అయిందని ఇంకొందరు అంటున్నారు. ఘాట్‌లో మంచు పెద్దఎత్తున కురవడంతో రహదారి పూర్తిగా కానరాలేదన్న వాదన కూడా ఉంది. డ్రైవర్ మధును, యాత్ర నిర్వాహకుడు వజ్రమణిని పోలీసులు విచారిస్తున్నారు.

పింఛను, జీపీఎఫ్ చెల్లింపు సులభతరం

» డిజిటలీకరణ దిశగా ఆర్థిక శాఖ నిర్ణయం

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్ బెనిఫిట్స్, ఏపీ జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్)కు సంబంధించిన లావాదేవీలను డిజిటలీకరణ చేయడాన్ని ఉద్యోగ సంఘాల నాయకులు ఆహ్వానించారు. వీటితో పాటు రుణాల అందజేత, చెల్లింపులు తదితర అంశాలను సరళీకృతం చేయడాన్ని కూడా స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ప్రధాన ఉద్యోగ సంఘాలు.. ఆర్థికశాఖ కార్యదర్శి వినయచంద్‌కు తేల్చి చెప్పాయి. శుక్రవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీఎన్జీజీవోస్ అధ్యక్షుడు విద్యాసాగర్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలు పాల్గొన్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రభుత్వం హామీ: మంత్రి పార్థసారథి

విజయవాడ సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెట్టుబడులకు ఏపీ సానుకూలమని, పరిశ్రమలస్థాపనకు పెట్టుబడిదారులు ముందుకు రావాలని మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసిన బిజినెస్ ఎక్స్‌పో-2025ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ‘సీఎం ఆధ్వర్యంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కూటమి ప్రభుత్వం హామీ ఇస్తోంది. ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటక రంగాల్లో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలి’ అని మంత్రి పిలుపునిచ్చారు.

27 వరకూ ‘ఆటా’ వేడుకలు

» 17న వైజాగ్ గీతంలో బిజినెస్ సెమినార్ నిర్వహణ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అమెరికన్ తెలుగు అసోసియేషన్(ఆటా) వార్షిక వేడుకల్లో భాగంగా ఈ నెల 12 నుంచి 27 వరకూ ఏపీ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించనున్నట్లు ఆటా ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ చల్లా, ప్రెసిడెంట్(ఎలెక్ట్) సతీశ్ రామశ్యామ్ రెడ్డి మాట్లాడుతూ.. ‘ఈ నెల 13న ఐటీ హైదరాబాద్‌లో స్టార్టప్ పోటీలు, 14న తెలుగు వర్సిటీలో ఆటా అంతర్జాతీయ సదస్సు, 17న విశాఖ గీతమ్ వర్సిటీలో, 19న టీ-హబ్‌లో బిజినెస్ సెమినార్లు జరుగుతాయి. 27న హైదరాబాద్ రవీంద్రభారతిలో ముగింపు వేడుకలు చేయనున్నాం’ అని సతీశ్ వివరించారు.

18న ఢిల్లీకి సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 18న కలెక్టర్ల సదస్సు ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటలకు ఢిల్లీ వెళతారు. 19న ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను సీఎం కలవనున్నారు. అదే రోజు సాయంత్రం బయలుదేరి అమరావతి చేరుకుంటారు. కాగా ఈ నెల 24న మంత్రి మండలి సమావేశం జరగనుంది.

2వ వక్ఫ్ ఆస్తుల గెజిట్‌కు సర్కారు సిద్ధం: అజీజ్

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఇప్పటికే తమ వద్ద ఉన్న మొదటి సర్వే వక్ఫ్ రికార్డులను 100% ఉమీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబరిచిందని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన చేశారు.

దేవదాయ శాఖలో పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయ శాఖలో కీలకమైన పోస్టుల్లో పదోన్నతుల కోసం ప్రభుత్వం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని నియమించింది. ఈ మేరకు శాఖ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి హరి జవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు పారదర్శకంగా జరపాలి

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగేలా చూడాలని యునైటెడ్ ఫార్మసిస్ట్ జేఏసీ ప్యానెల్ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏపీ గవర్నమెంట్ ఫార్మసిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు నేతృత్వంలో ప్యానెల్ అభ్యర్థులు ఎన్నికల అధికారి దినేశ్ కుమార్‌ను కలిశారు.

ప్రతి కేజీకీ 25 కమీషన్

డెయిరీలకు సుబ్బారెడ్డి పీఏ డిమాండ్.. హవాలా మార్గంలో అందిన సొమ్ము

» ఎవరి ప్రోద్బలంతో వసూలు చేశారో తేలాలి

» విశాఖలో 14 ప్లాట్లు ఉన్నట్లు సిట్ గుర్తింపు

» చిన్నఅప్పన్న బెయిల్ పిటిషన్ కొట్టేయండి

» హైకోర్టుకు సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్

» కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ముగిసిన వాదనలు.. ఎల్లుండి నిర్ణయం



అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నఅప్పన్న బెయిల్ పిటిషన్‌పై సోమవారం నిర్ణయం వెల్లడిస్తామని హైకోర్టు ప్రకటించింది. శుక్రవారం జరిగిన విచారణలో ఇరువైపుల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఈ మేరకు ప్రకటించారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా, ఇతర డెయిరీల నుంచి చిన్నప్పన ప్రతి కేజీకి రూ.25 కమిషన్ డిమాండ్ చేసినట్లు దర్యాప్తులో నిర్ధారణైందని సిట్ తరఫున సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్‌పీ సురేశ్‌కుమార్ హైకోర్టుకు వివరించారు. హవాలా మార్గంలో పిటిషనర్‌కు సొమ్ము అందిందన్నారు. చిన్నఅప్పన్న కమిషన్ ఇచ్చినట్టు నెయ్యి సరఫరా కంపెనీలకు చెందినవారు వాంగ్మూలాలు ఇచ్చారని తెలిపారు. ఎవరి ప్రోద్బలంతో కమిషన్ వసూలు చేశారో దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. టీటీడీ అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి పిటిషనర్ పీఏగా వ్యవహరించారని వివరించారు. ఆ సమయంలో వినియోగించిన ఫోన్లు ఇచ్చేందుకు పిటిషనర్ నిరాకరిస్తున్నారని తెలిపారు. పిటిషనర్‌కు విశాఖపట్నంలో 14 ప్లాట్లు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించినట్టు వెల్లడించారు. ఆర్థిక లావాదేవీలు ముడిపడి ఉన్న కేసులలో నిందితులకు బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. చిన్నఅప్పన్న బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... నకిలీ నెయ్యి సరఫరాలో పిటిషనర్‌కు ఎలాంటి పాత్ర లేదన్నారు. నెయ్యి సరఫరా కంపెనీల నుంచి కమిషన్ తీసుకోవడంతో పాటు టీటీడీ వ్యవహారాల్లో తలదూర్చారనేదే పిటిషనర్‌పై ఆరోపణ అని అన్నారు. లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీల యజమానులు అందరూ బెయిల్ పొందారన్నారు. పిటిషనర్ పోలీస్ కస్టడీ ముగిసిందని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటామని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. వాదనలు ముగియడంతో సోమవారం నిర్ణయం వెలువరించనున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చిన్నఅప్పన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

చెవిరెడ్డి వ్యవహారంలో సిట్ పిటిషన్‌పై 17కు విచారణ వాయిదా

» చాణక్య బెయిల్‌పై 15న వాదనలు

విజయవాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కోర్టుకు తీసుకొచ్చినపుడు కుటుంబ సభ్యులు తప్ప ఇతరులెవరూ కలవకుండా ఆదేశాలు ఇవ్వాలని సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ 17కి వాయిదా పడింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని చెవిరెడ్డి తరఫు న్యాయవాదులను విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న చెవిరెడ్డి రిమాండ్ పొడిగింపునకు ఎస్కార్ట్ సిబ్బంది కోర్టుకు తీసుకొస్తున్న సమయంలో ఆయన నానా హంగామా చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు పలుమార్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇక నుంచి ఎలాంటి హడావుడి ఉండదని చెవిరెడ్డి కోర్టుకు లిఖితపూర్వకంగా అఫిడవిట్ ఇచ్చారు. అయినా ఆయన మీడియా కనిపించగానే మాట్లాడుతున్నారు.

చాణక్య పిటిషన్‌పై 15న వాదనలు

మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్‌పై వాదనలను ఏసీబీ కోర్టు ఈ నెల 15కి వాయిదా వేసింది. బెయిల్ మంజూరు చేయాలని చాణక్య కొద్దిరోజుల క్రితం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై ప్రాసిక్యూషన్ శుక్రవారం కౌంటర్ దాఖలు చేసింది. ఇదే కేసులో గుంటూరు జైల్లో ఉన్న రోణక్ కుమార్ దాఖలు చేసిన ఇంటి నుంచి భోజనం పిటిషన్‌పై 15న రిప్లై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయవాదులను కోర్టు ఆదేశించారు.

వంశీ పిటిషన్ 17కు వాయిదా

ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వారం రోజుల సీసీ ఫుటేజీ ఇవ్వాలని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ 17కి వాయిదా పడింది. దీనిపై ప్రాసిక్యూషన్ ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసింది.

మద్యం స్కాంలో.. శ్రీధర్‌రెడ్డిది ప్రముఖ పాత్ర

» పాలసీ రూపకల్పన, ముడుపుల వసూళ్లలో ఆయనే కీలకం

» ఆయనకు బెయిలిస్తే దర్యాప్తునకు ఆటంకం

» హైకోర్టుకు ‘సిట్’ సీనియర్ న్యాయవాది అగర్వాల్ నివేదన

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కుట్రలో సజ్జల శ్రీధర్‌రెడ్డి(ఏ-6) కీలకపాత్ర పోషించారని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) పేర్కొంది. మద్యం పాలసీ రూపకల్పనకు ముందు అధికారులు, ఇతర ప్రైవేటు వ్యక్తులతో జరిపిన సమావేశంలో ఆయన కూడా ఉన్నారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ‘తాము చెప్పిన కంపెనీలకే ఆర్డర్లు ఇవ్వాలని పిటిషనర్ అధికారులను ఆదేశించారు. పాలసీ రూపకల్పన, ముడుపుల వసూళ్లలో శ్రీధర్‌రెడ్డి ప్రముఖ పాత్ర పోషించారని నిందితులు సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద వాంగ్మూలాలు ఇచ్చారు. ముడుపులివ్వని ప్రముఖ మద్యం బ్రాండ్ల కంపెనీలకు ఆర్డర్లు ఇవ్వకుండా పక్కనపెట్టారు. మద్యం ఉత్పత్తి కంపెనీలతో సంప్రదింపులు జరిపి, వాటి నుంచి ముడుపుల వసూలులో శ్రీధర్‌రెడ్డిది ప్రముఖ పాత్ర. మద్యం పాలసీ ద్వారా ఆయనకు చెందిన ఎస్పీవై ఆగ్రోస్ రూ.1,569 కోట్లు లబ్ధి పొందింది. ఈ కేసులో మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉంది. సాక్ష్యాలు సేకరించాల్సి ఉంది. ఈ దశలో శ్రీధర్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుంది. ఆయన బెయిల్ అభ్యర్థనను తిరస్కరించండి’ అని సిట్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ కోరారు. అంతకు ముందు శ్రీధర్‌రెడ్డి తరఫు న్యాయవాదులు నగేశ్‌రెడ్డి, అభయ్ సిద్ధాంత్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ 7 నెలలకు పైగా జైల్లో ఉన్నారని.. ఎస్పీవై ఆగ్రోస్ కంపెనీని నిందితుల జాబితాలో చేర్చకుండా ఆయన్ను బాధ్యుడిని చేయడానికి వీల్లేదని.. తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు.

చైర్మనే బాస్!

» ఆయన చెప్పింది చేయాలి కదా.. చేయకపోతే ఉద్యోగాలు ఉంటాయా?

» సిట్ విచారణలో మాజీ జీఎం సుబ్రహ్మణ్యం

» కల్తీ నెయ్యి కేసులో ముగిసిన నిందితుల కస్టడీ

తిరుపతి/తిరుపతి (నేర విభాగం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ‘కల్తీ నెయ్యి సరఫరాతో నాకు ఎటువంటి సంబంధం లేదు. చైర్మన్ చెప్పింది చేయాలి కదా. చైర్మనే బాస్’ అని టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ మాజీ జీఎం ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యం సిట్ విచారణలో చెప్పినట్లు తెలిసింది. చైర్మన్ చెప్పింది చేయకపోతే తమ ఉద్యోగాలు ఉంటాయా? అని ప్రశ్నించినట్టు సమాచారం. ఈ నెల 9 నుంచి 4 రోజుల పాటు నెల్లూరు ఏసీబీ కోర్టు అనుమతితో ఏ16 అజయ్ కుమార్ సుగంధ్, ఏ29 సుబ్రహ్మణ్యంను సిట్ అధికారులు తమ కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే. కస్టడీ చివరి రోజైన శుక్రవారం రెండున్నర గంటలపాటు విచారించారు. సీబీఐ విశాఖపట్నం డీఐజీ మురళీ రాంబా ఏ29 సుబ్రహ్మణ్యంను.. అదనపు ఎస్పీ, డీఎస్పీలు ఏ16 సుగంధ్‌ను ప్రశ్నించారు. సుబ్రహ్మణ్యం చాలా ప్రశ్నలకు తనకేమీ తెలియదని చెప్పినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో ఆయన ప్రమేయాన్ని సిట్ ఆధారాలతో చూపి ప్రశ్నించగా.. టీటీడీ మొత్తానికి చైర్మనే బాస్ అని, ఆయన చెప్పింది చేయాలి కదా అని అన్నట్టు తెలిసింది. తానో చిన్న అధికారినని, తనపై చాలామంది అధికారులున్నారని చెప్పినట్టు సమాచారం. ‘కేసులో టీటీడీకి సంబంధించి ఇంకా చాలామంది ఉన్నారు కదా.. వారిని కూడా విచారించి చూడండి.. ఎవరూ నా పేరు చెప్పరు’ అని అన్నట్టు తెలిసింది. ఇక ఏ16 అజయ్‌కుమార్ సుగంధ్ కస్టడీ చివరి రోజు కూడా విచారణకు సహకరించలేదని తెలిసింది. టీటీడీకీ తనకూ ఏమిటి సంబంధమని ప్రశ్నించినట్టు తెలిసింది. ఆ తర్వాత రుయా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. 3.30 గంటల సమయంలో నెల్లూరులోని సెంట్రల్ జైలు అధికారులకు అప్పగించారు.

మందు పార్టీలో వైసీపీ నేత ‘దువ్వాడ’

» రంగారెడ్డి జిల్లాలోని ఫామ్‌హౌస్‌లో శ్రీనివాస్, మాధురి చిందులు

» పోలీసుల దాడి.. విదేశీ మద్యం స్వాధీనం

టెక్కలి/మొయినాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి మరో వివాదంలో చిక్కుకున్నారు. గురువారం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో ఉన్న ఓ ఫామ్‌హస్‌లో అనుమతి లేకుండా నిర్వహించిన మందు పార్టీలో పాల్గొన్నారు. దీనిపై సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ పోలీసులు దాడులు చేశారు. ఈ సమయంలో దువ్వాడ శ్రీనివాస్, మాధురికి మిత్రుడైన అమలాపురం ప్రాంతానికి చెందిన ప్రార్థసారథి అనే వ్యాపారితో పాటు దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మరో 26 మంది ఉన్నారు. వీరిని అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా 10 విదేశీ మద్యం బాటిళ్లు, ఐదు హుక్కాలను పోలీసులు గుర్తించారు. పోలీసులు వెళ్లే సమయానికి కొందరు మద్యం తాగుతూ.. మరికొందరు చిందులేస్తూ కనిపించారు. అయితే ఈ ఫామ్‌హౌస్ పార్టీలో విదేశీ మద్యం ఎక్కడిది? ఎవరు తెచ్చారు? డీజేలు ఎవరి అనుమతితో పెట్టారు? పార్టీలో డ్రగ్స్ వినియోగించారా? తదితర అంశాలపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్, మాధురిని రాజేంద్రనగర్ పోలీసులు విచారించారు. వాస్తవానికి ఫామ్‌హౌస్ పార్టీకి పోలీసుల అనుమతి ఉండాలి. అయితే ఈ పార్టీకి అనుమతులు లేవని పోలీసులు తెలిపారు. ఫామ్‌హౌస్‌లో మిత్రులకు పార్టీ ఇచ్చిన పార్థసారథితో పాటు ఫామ్‌హౌస్ యజమాని శుభాష్, వాచ్‌మన్ షేక్, హుక్కా సరఫరా చేసిన రియాజ్, సూపర్‌వైజర్ తతుదుద్దీన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. పోలీసులు ఎమ్మెల్సీ దువ్వాడ, మాధురిని విచారించినప్పుడు.. తమకు, ఈ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, పార్థసారథి ఆహ్వానం మేరకు వెళ్లామని వెల్లడించారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్, మాధురి తదితరులకు నోటీసులు జారీ చేసి పంపివేశామని మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి చెప్పారు. కాగా, ఏపీలోని అమలాపురానికి చెందిన పార్థసారథి.. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా స్థిరపడ్డారు. ఫామ్‌హౌస్‌లో గురువారం రాత్రి ఆయన తన పుట్టిన రోజు వేడుకల పార్టీ ఏర్పాటు చేశారని పోలీసులు తెలిపారు.

మా ఊరికి రోడ్డు వేయరూ..!

- డిప్యూటీ సీఎంకు 'కెప్టెన్ దీపిక' వినతి
- సాయంత్రానికల్లా పాలనా అనుమతులు


దీపికకు కొండపల్లి బొమ్మలను ఇచ్చి సత్కరిస్తున్న పవన్ కల్యాణ్

మడకశిర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ ఊరికి రహదారి సౌకర్యం కల్పించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అంధుల టీ-20 క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలో డిప్యూటీ సీఎం ను టీ-20 ప్రపంచ కప్ సాధించిన జట్టుతో ఆమె శుక్రవారం కలిశారు. ఈ విజయం దేశానికే గర్వకారణం అని పవన్ కల్యాణ్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా కెప్టెన్ దీపిక 'మా ఊరికి రోడ్డు సౌకర్యం కల్పించండి' అని విజ్ఞప్తి చేశారు. దీపిక స్వగ్రామం శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం హేమావతి పంచాయతీలోని తంబాలహట్టి. దీపిక విజ్ఞప్తి చేసిన రహదారి నిర్మాణంపై, అల్లూరి జిల్లాకు చెందిన మరో క్రికెటర్ కరుణ ఇంటి కోసం చేసిన వినతిపైనా పవన్ సానుకూలంగా స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం కెప్టెన్ దీపిక రహదారి కోసం చేసిన వినతిపై పవన్ కల్యాణ్ అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గంటల వ్యవధిలోనే శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు తంబలహట్టి రోడ్లను పరిశీలించారు. హేమావతి నుంచి గ్రామం వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.3.2 కోట్లు, గున్నేహళ్లి నుంచి తంబలహట్టి వరకూ 5 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించారు. వెంటనే ఆమేరకు అనుమతులు ఇవ్వాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.


కొత్త ఆలోచనలతో మెరుగైన సేవలు

- అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమాలోచనలు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ పాలనలో వ్యవస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తాను పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో క్షేత్రస్థాయి నుంచి సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించారు. దీనిపై శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమాలోచనలు చేశారు. సంస్కరణలు అంతిమంగా ప్రజలకు ప్రయోజనం కలిగించేలా ఉండాలని పేర్కొన్నారు. ఇందుకోసం మెరుగైన విధానాలపై సత్వరమే నివేదిక ఇవ్వాలని తన పేషీ అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై వారం రోజుల్లో సమీక్ష చేపట్టాలని నిర్ణయించారు. స్వచ్ఛ రథం, మ్యాజిక్ డ్రెయిన్ పైలట్ ప్రాజెక్టుల గురించి ప్రస్తావిస్తూ.. ఇలాంటి కొత్త ఆలోచనలతో ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

పరకామణి దొంగకు జగన్ వత్తాసా: భానుప్రకాశ్

న్యూఢిల్లీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'రవికుమార్ అనే వ్యక్తి పరకామణిలో దొంగతనం చేస్తే... చిన్న దొంగతనమని నిందితుడికి జగన్ వత్తాసు పలుకుతున్నారు. అసలు జగన్‌కు బుద్ధి ఉందా? యేసు దగ్గర జరిగి ఉంటే ఇలానే స్పందించేవారా?' అంటూ టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రవికుమార్‌పై ఫిర్యాదు చేసిన సతీశ్ కుమార్ అనే అధికారి మృతి చెందిన విధానం అందరూ చూశారు. రవికుమార్ డాలర్లను దొంగిలించిన సమయంలో సీసీ ఫుటేజ్ ఏమయింది? రాష్ట్రంలో 2019 నుంచి 2024 వరకు వైసీపీ నేతృత్వంలోని హిందూ వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలింది. టీటీడీని అడ్డుపెట్టుకుని అపచారాలకు, అవినీతికి పాల్పడ్డారు. ధార్మిక క్షేత్రాన్ని ధనార్జన క్షేత్రంగా మార్చారు. గత వైసీపీ హయాంలో ధర్మకర్తల మండలి, అధికారులు తిరుమల పవిత్రతను దెబ్బతీశారు. లడ్డూ నాణ్యత గురించి అప్పటి టీటీడీ చైర్మన్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు' అని భానుప్రకాశ్‌రెడ్డి విమర్శించారు.


ఉత్తరాంధ్రలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

ఉత్తరాంధ్రలో చంద్రబాబు ఏరియల్ సర్వే

ఐటీ, టూరిజం హబ్‌లు, భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలన

విశాఖపట్నం/విజయనగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాజెక్టుల పురోగతి తెలుసుకునేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం ఉత్తరాంధ్రలో ఏరియల్ సర్వే నిర్వహించారు. విశాఖలో ఐటీ పరిశ్రమ విస్తరించిన రుషికొండ, కాపులుప్పాడ ప్రాంతాలను పరిశీలించి, ఐటీ హబ్, జీసీసీ ప్రాజెక్టు నిర్మాణాల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటుకానున్న భీమిలి తీర ప్రాంతంతో పాటు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనుల పురోగతిని పరిశీలించారు. భోగాపురం వద్ద ఎడ్యుకేషన్ హబ్‌లో ఏవియేషన్ వర్సిటీ ఏర్పాటుకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను హెలికాప్టర్ నుంచి పరిశీలించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో భాగంగా సబ్బవరం, పెందుర్తి మండలాల్లో వచ్చే వివిధ పరిశ్రమలకు సంబంధించి ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు భూముల లభ్యతపై ఆరా తీశారు. విజయనగరం జిల్లాలోని ప్రాజెక్టులను పరిశీలించారు. 2026 జూన్ నాటికి ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసి, వివిధ దశల్లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. ఇక విశాఖ-రాయ్‌పూర్ జాతీయ రహదారి సహా వివిధ రోడ్లు, నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులు, ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ గురించీ ఆరా తీశారు. ఈ హైవే పనులను వీలైనంత వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు మహర్దశ

2032 నాటికి 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ: చంద్రబాబు

30 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)ను సమగ్ర ప్రణాళికతో గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, పట్టణాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతులు.. ఇలా అన్నివిధాలుగా ఈ ప్రాంతం అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. విశాఖను మురికివాడలు లేని నగరంగా తీర్చిదిద్దాలన్నారు. వివాదాల్లేకుండా వీఈఆర్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ జరపాలని సూచించారు. 'విశాఖ ఎకనామిక్ రీజియన్' అభివృద్ధిపై ఆయన తొలిసారి విశాఖ రుషికొండలోని ఏ-1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం మంత్రులు, ఉన్నతాధికారులు, తొమ్మిది జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎకనామిక్ రీజియన్ సమగ్రాభివృద్ధి, రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్, ఇతర రంగాలకు సంబంధించిన 49ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మూడు ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటుచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. 2024నాటికి 52బిలియన్ డాలర్ల జీడీపీతో ఉన్న వీఈఆర్‌ను 2032కల్లా 125నుంచి 135బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటించారు. 7 గ్రోత్ డ్రైవర్లు, 10 విధానాలతో ఈ ఆర్థిక ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామని, దీంతో 30 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వీఈఆర్ మాస్టర్ ప్లాన్‌ను సమర్థంగా అమలు చేస్తే 2047 నాటికి 750 నుంచి 800 బిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవచ్చన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్

మాస్టర్ ప్లాన్ ప్రకారం రానున్న 3నెలల్లో ఏం చేయాలనే దానిపై సీఎం దిశానిర్దేశం చేశారు. 'విశాఖలో అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. వీఈఆర్ పరిధిలో విస్తృతంగా ఉన్న వనరులు వినియోగించుకుంటే అద్భుతాలు సాధించవచ్చు. స్టీల్ సిటీ, పారిశ్రామిక సిటీ, ఫార్మా సిటీ, టూరిజం.. ఇలా అన్ని రంగాలనూ అభివృద్ధి చేసేందుకు వీలుంది. అనకాపల్లిలో త్వరలో మెడ్‌టెక్ జోన్-2ను ప్రారంభిస్తాం. టాయ్స్ పార్క్‌లో పరిశ్రమలు పెట్టేవారికి ప్రోత్సాహకాలు అందిస్తాం. రక్షణ తయారీ సంస్థలను ఆకర్షించాలి. ఏజెన్సీని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించాలి. రహదారుల విస్తరణపైనా దృష్టి పెట్టాలి. ప్రతి 2నెలలకోసారి వీఈఆర్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తా' అని సీఎం వెల్లడించారు.

శాఖల వారీగా కార్యాచరణ

విశాఖ ఆర్థికప్రాంతం కోసం వాణిజ్యం, పరిశ్రమలు, పురపాలక, పర్యాటకం, ఐఅండ్ఐ, ఆర్‌అండ్‌బీ, ఐటీఈ అండ్‌సీ, వ్యవసాయం, అటవీ, వైద్య ఆరోగ్యం, విద్య, నైపుణ్య శిక్షణ, విద్యుత్.. ఇలా శాఖల వారీగా విడివిడిగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. దీని పరిధిలో ప్రస్తుతం చేపట్టిన, నూతనంగా చేపట్టాల్సిన రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులపైనా ప్రణాళికలు సిద్ధం చేశారు. రైతులు సమష్టిగా ముందుకొస్తే ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుమతిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఆర్థిక రీజియన్‌లో ఏ ప్రాంతం ఏ పంటకు అనుకూలమో కలెక్టర్లు నివేదిక తయారుచేయాలని ఆదేశించారు. చెరువులు, రిజర్వాయర్లను నింపాలని, ఆక్వాకల్చర్ వృద్ధికి తీసుకోవలసిన చర్యలపై నివేదికను వచ్చే సమావేశానికి సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.



విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రులు భరత్, లోకేశ్, సీఎస్ విజయానంద్, అచ్చెన్నాయుడు, నారాయణ

ఉన్నతాధికారుల ప్రజెంటేషన్లు

సీఎం అధ్యక్షతన జరిగిన వీఈఆర్ తొలి సమీక్షలో వీఈఆర్ కన్వీనర్ ఎన్.యువరాజ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎంటీ కృష్ణబాబు, అజయజైన్, బి.రాజశేఖర్, ఆర్థిక, మున్సిపల్ పరిపాలన, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల ముఖ్య కార్యదర్శులు పీయూష్‌కుమార్, సురేశ్ కుమార్, చిరంజీవిచౌదరి తమ శాఖల పరిధిలో చేపట్టబోయే ప్రాజెక్టులు, ప్రణాళికల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేశ్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, సీఎస్ కె.విజయానంద్, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

9 జిల్లాలు.. 1.65 కోట్ల జనాభా

వీఈఆర్ విస్తీర్ణం 38 వేల చ.కి.మీ.

విశాఖ ఆర్థిక ప్రాంతం స్వరూపమిదీ..

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఉన్నాయి. 38 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఈ రీజియన్‌లో 1.65 కోట్ల మంది జనాభా ఉన్నారు. ప్రస్తుత జీడీపీ 52 బిలియన్ డాలర్లు. తలసరి ఆదాయం 3,170 డాలర్లు. పనిచేసేవారు సుమారు 70 లక్షల మంది ఉన్నారు.

- ఈ ఎకనామిక్ రీజియన్ భౌగోళిక విస్తీర్ణం రాష్ట్రంలో 31% ఉండగా.. జనాభా 23%, జీడీపీ 30 శాతం.
- ఏడు గ్రోత్ సెంటర్ల ద్వారా ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, గ్లోబల్ పోర్టు, నెక్ట్స్ జన్ రంగాల అభివృద్ధి, ప్లాన్డ్ అర్బనైజేషన్, హౌసింగ్, అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించాలన్నదే లక్ష్యం.
- ప్రస్తుతం ఆరు పోర్టులు ఉండగా.. కొత్తగా రెండు రానున్నాయి.
- 7 రైల్వే ప్రాజెక్టులు, 9 రహదారి ప్రాజెక్టులు, 77 కి.మీ. మేర మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటుకానున్నాయి.
- 12 తయారీ కేంద్రాలు, 18 వ్యవసాయ క్షేత్రాలు, ప్రపంచ స్థాయి నర్సరీ, ఫుడ్‌పార్కులు, ఆక్వా పార్కులు, ఐదు ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని శుక్రవారం సమీక్ష సందర్భంగా నిర్ణయించారు.
- అదనంగా 10 వేల హోటల్ గదులు, 20 మెడికల్ కళాశాలలు, ఐదు వేల ఆస్పత్రి బెడ్లు, పరిశ్రమల కోసం 50 వేల ఎకరాలు, 50 మిలియన్ చదరపు అడుగుల ఆఫీసు స్థలం, 60 మిలియన్ చదరపు అడుగుల గిడ్డంగులు అవసరమని గుర్తించారు.

ప్రత్యేక పర్యాటక కేంద్రంగా.. విశాఖలో కైలాసగిరి నుంచి భీమిలి వరకూ 40 చదరపు కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని రాష్ట్ర పర్యాటకానికి కోర్ సిటీగా అభివృద్ధి చేయాలని మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు. ప్రధానంగా ఐదు బీచ్ ఫ్రంట్‌లు, వరల్డ్ క్లాస్ థీమ్ పార్కు, వాటర్ స్పోర్ట్స్‌తో అంతర్జాతీయ టూరిజం కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దాలని నిర్ణయించారు. కైలాసగిరి ప్రాంతం మొత్తాన్నీ మెగా రీడిజైన్ చేయనున్నారు.


వెలిగొండ రెండో టన్నెల్ లోపల పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ వై.పాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్

పూర్తికాని వెలిగొండకు ఉత్తుత్తి ప్రారంభోత్సవం: మంత్రి నిమ్మల

త్రిపురాంతకం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మోసం, దగా అనే పదాలకు వైఎస్ జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం ఆయన ప్రకాశం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌లో 18 కి.మీ. ప్రయాణించి క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులు, పనులు చేస్తున్న ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్షించారు. నిర్లక్ష్యంగా పనులు చేద్దామంటే కుదరదని, చేయలేకపోతే తప్పుకోవచ్చని కొన్ని ఏజెన్సీలను సున్నితంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా నిమ్మల విలేకరులతో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టులో క్లిష్టమైన పలు పనులు పెండింగ్‌లో ఉండగానే ఎన్నికలకు ముందు అప్పటి సీఎం జగన్ ఇక్కడ పైలాన్ నిర్మించి ఉత్తుత్తి ప్రారంభోత్సవం పేరుతో జాతికి అంకితం అనే డ్రామా ఆడారని విమర్శించారు. నిత్యం కరువు కాటకాలతో ఇబ్బందులు పడుతూ కనీసం వెలిగొండ ద్వారా తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశించిన ప్రకాశం జిల్లా ప్రజలను ఎలా మోసం చేయాలనిపించిందో ఆయనకే తెలియాలని మండిపడ్డారు. తల్లినీ, చెల్లినీ మోసం చేయగలిగిన వ్యక్తికి ప్రజలను మోసగించడం ఒక లెక్కా అని ఎద్దేవా చేశారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రజా ప్రభుత్వం శరవేగంగా పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజల కలను నెరవేర్చబోతోందని నిమ్మల వెల్లడించారు. సీఎం చంద్రబాబు నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. అందుకే తాను నెలలో మూడుసార్లు ప్రాజెక్టు వద్దకు వచ్చి సమీక్ష నిర్వహించి పనుల్లో వేగం పెరిగేలా చూస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, సీఈ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో సీఎస్‌ఎంఆర్‌ఎస్ శాస్త్రవేత్తల బృందం

పోలవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును కేంద్ర జలవనరుల శాఖ పరిధిలోని మట్టి, రాయి నాణ్యత పరిశోధన కేంద్రం (సీఎస్‌ఎంఆర్‌ఎస్) శాస్త్రవేత్తలు హరేంద్ర ప్రకాశ్, ఉదయ్ భాను చక్రవర్తి, సిద్ధార్థ్, పి.హెడవుల బృందం శుక్రవారం పరిశీలించింది. వాస్తవానికి గత సోమవారమే ఈ బృందం పోలవరం పరిశీలనకు రావాల్సి ఉండగా ఇండిగో విమాన సర్వీసులు రద్దు కారణంగా పర్యటన వాయిదా పడింది. ఈ బృందం పోలవరం ప్రాజెక్టులోని పలు ప్రాంతాల్లో ప్రాథమిక సర్వే నిర్వహించింది. ప్రధానమైన ఎర్త్ కం రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం నిర్మాణంలో వినియోగించాల్సిన కంకరకు అక్కడికక్కడే పరీక్షలు చేశారు. ఢిల్లీలో పరీక్షలు చేయడానికి మరికొన్ని నమూనాలను సేకరించారు. ఈ బృందం శనివారం కూడా నాణ్యత పరిశీలనలు చేయనుంది. వారివెంట జలవనరుల శాఖ ఈఈలు డి.శ్రీనివాస్, బాలకృష్ణ, మేఘా ఇంజనీరింగ్ సంస్థ జనరల్ మేనేజర్ ఎ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళీ పమ్మి, మేనేజర్లు వెంకటేశ్, గణపతిరావు ఉన్నారు.


పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో రాతి నాణ్యతను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

టెక్ హబ్‌గా విశాఖ

(మొదటిపేజీ తరువాయి)

పెడుతోందని చెప్పారు. కాగ్నిజెంట్‌లో ఉన్నత స్థానంలో ఉన్న వారు తెలుగువారు కావడం మనకందరికీ గర్వకారణమని అన్నారు. కాగ్నిజెంట్‌కు 99 పైసలకే భూమి కేటాయించామని, ఇది గేమ్‌చేంజర్‌గా మారిందని పేర్కొన్నారు. గుజరాత్‌లో టాటా నానోకార్ల తయారీ ప్లాంటుకు ఎకరా 99 పైసలకే ఇచ్చారని, లోకేశ్ సూచన మేరకు తాము కూడా అదే ధరకు భూమి ఇచ్చామని వెల్లడించారు. కాగ్నిజెంట్ ఎనిమిది వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఒప్పందం చేసిందని చెప్పారు. ఇప్పుడు 25 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని ముందుకు వచ్చిందని తెలిపారు. హైదరాబాద్‌లో కాగ్నిజెంట్‌కు 75 వేల మంది ఉద్యోగులు ఉన్నారని, దానికి మించి విశాఖపట్నంలో లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అవసరమైనవన్నీ తాము సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కాగ్నిజెంట్ సీఈఓ రవికుమారే ఏపీ తరఫున పెట్టుబడులకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించాలని కోరారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

విశాఖలో జీవన వ్యయం తక్కువ

"దేశంలో ఇతర నగరాలతో పోల్చుకుంటే విశాఖపట్నం మోస్ట్ లివబుల్, మోస్ట్ హ్యాపినింగ్ సిటీ. కాగ్నిజెంట్ కంటే ముందు సత్వా, ఫ్లూయెంట్ గ్రిడ్, క్వార్క్, ఏసీఎన్, మదర్‌సన్, ఇమాజిన్నోటివ్ తదితర ఎనిమిది సంస్థలకు శంకుస్థాపనలు చేశాం. ఇక్కడ కాస్ట్ ఆఫ్ లివింగ్ 20 శాతం తక్కువ. ఇతర నగరాల్లోలాగా ఇక్కడ ట్రాఫిక్ జామ్‌లు ఉండవు. భోగాపురంలో వచ్చే ఏడాది విమానాశ్రయం ప్రారంభిస్తున్నాం. మెట్రో రైలు కూడా వస్తుంది. రక్షణపరంగా చూసుకుంటే తూర్పు నౌకాదళం ఉంది. ఇప్పటికే 150 టెక్ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. 2032 నాటికి 135 బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని నీతి ఆయోగ్ విశాఖ ఎకనామిక్ రీజియన్ ద్వారా యత్నిస్తోంది. మరో ఆరు నెలల్లో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్ అందుబాటులోకి వస్తుంది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. సంజీవిని ప్రాజెక్టు ద్వారా ప్రజలకు ప్రత్యేకంగా హెల్త్ రికార్డులు నిర్వహిస్తున్నాం. 15 శాతం వృద్ధిరేటు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాగ్నిజెంట్ ప్రతినిధులు రాజేశ్, సూర్య, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ చైర్మన్ ఎం.రామరాజు, ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


సత్వా వాంటేజ్ క్యాంపస్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో గ్రూపు ఎండీ విజయకుమార్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ ప్రద్యుమ్నకుమార్

విశాఖలో 25 వేల ఉద్యోగాలు ఇస్తాం

- ఇక్కడికి రావడానికి ఉద్యోగుల్లో ఉత్సాహం
- నాది శ్రీకాకుళం ప్రాంతమే
- కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ వెల్లడి

విశాఖపట్నానికి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను రప్పిస్తాం. తద్వారా ఈ సిటీని జీసీసీ కేపిటల్‌గా మారుస్తాం. విశాఖపట్నంలో మూడు దశల్లో ఎనిమిది వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఒప్పందం చేశాం. సీఎం చంద్రబాబు సూచన మేరకు ఆ సంఖ్యను 25 వేలకు పెంచుతున్నాం. నా తల్లి, గ్రాండ్ పేరెంట్స్, సోదరుడు అంతా విశాఖలోనే ఉంటున్నారు. నేను శ్రీకాకుళం ప్రాంతానికి చెందినవాడిని. ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. విశాఖపట్నంలో పనిచేయడానికి ఎంతమంది ఆసక్తిగా ఉన్నారో చెప్పాలని కోరితే.. 4,500 మంది ఉద్యోగులు సమ్మతి తెలియజేశారు. ఇంత స్పందన మేం ఊహించలేదు. ఇక్కడ మేం నేరుగా కల్పించే ప్రతి ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో నలుగురికి ఉపాధి కలుగుతుంది.

రుషికొండ ఐటీ పార్క్‌లోని హిల్-2పై కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఆ సంస్థ సీఈవో రవికుమార్, సిబ్బందితో మంత్రి లోకేశ్ సెల్ఫీ


విశాఖలోనే ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలు: లోకేశ్

ఈ కంపెనీల సీఈవోలను నేను ఎప్పుడూ కలవలేదు

భూములిచ్చిన 24 గంటల్లోనే శంకుస్థాపన చేశాం

ఒక్క విశాఖపట్నంలోనే ఐటీ రంగంలో ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ చెప్పారు. శుక్రవారం విశాఖలో ఎనిమిది కొత్త ఐటీ కంపెనీలకు శంకుస్థాపన అనంతరం కాగ్నిజెంట్ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఈ ఏడాది జనవరిలో దావోస్ పర్యటన సందర్భంగా కాగ్నిజెంట్ ప్రతినిధులను కలిసి విశాఖలో కార్యాలయం పెట్టాలని కోరాను. అనేక చర్చల అనంతరం వారు అంగీకరించారు. మళ్లీ దావోస్‌కు వచ్చేలోగా కార్యాలయం ప్రారంభించాలని వారికి చెప్పాం. మళ్లీ జనవరి రాక ముందే విశాఖలో కార్యాలయం ప్రారంభించారు. ఇదో గేమ్ చేంజర్. విశాఖలో పెట్టుబడులు పెట్టాలని కోరుతుంటే.. చాలామంది వై వైజాగ్? అంటున్నారు. మేము మాత్రం వై నాట్ వైజాగ్?.. అని వారిని ఒప్పిస్తున్నాం. ఇందులో క్విడ్ ప్రోకో ఏమీ లేదు. విశాఖకు కాగ్నిజెంట్ రాక ఒక మైలురాయి. వారికి కేటాయించిన భూమిలో నిర్మాణం చేపడుతూనే మరోచోట వేయి మందితో ఇంటెరిమ్ సెంటర్‌ను ప్రారంభించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. 99 పైసలకు ఎకరా భూమి ఇస్తే.. పరిశ్రమలు వస్తాయా? అని సీఎం చంద్రబాబు నన్ను ప్రశ్నించారు. ఇది గేమ్‌చేంజర్ అవుతుందని చెప్పి ఒప్పించాం. ఈ రోజు ఎనిమిది ఐటీ కంపెనీలకు శంకుస్థాపనలు చేశాం. వాటి సీఈఓలు ఎవరో నాకు ఇప్పటివరకూ తెలియదు. గతంలో కలవలేదు. గురువారం మంత్రివర్గ సమావేశంలో భూములు కేటాయించి, 24 గంటలు తిరగకుండానే వాటికి భూమి పూజ చేశాం. విశాఖపట్నం ఐటీ, జీసీసీల హబ్‌గా మారుతుంది. హైదరాబాద్ లాగానే విశాఖ కూడా అభివృద్ధి సాధిస్తుంది. కాగ్నిజెంట్ భవనాన్ని ఏడాదికల్లా పూర్తిచేయాలి. దానికి పూర్తి సహకారం అందిస్తాం" అని లోకేశ్ హామీ ఇచ్చారు. అంతకుముందు లోకేశ్ ఐటీ సెజ్ హిల్-3పై కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో లోకేశ్ మాట్లాడారు. యువతే టార్చ్ బేరర్స్ అని, కష్టపడి విజయం సాధించాలని సూచించారు.

మరో 8 కంపెనీలకు శంకుస్థాపన

విశాఖపట్నంలో మంత్రి లోకేశ్ శుక్రవారం కాగ్నిజెంట్‌తో పాటు మరో 8 ఐటీ కంపెనీలకు శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం ఈ కంపెనీలు రూ. 3,740 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. 46,700 మందికి ఉద్యోగాలు కల్పిస్తాయి. ఆ సంస్థల వివరాలు..

సత్వా ఇంటిగ్రేటెడ్ ఐటీ పార్కు

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూపు రుషికొండ హిల్ నంబరు 4పై సత్వా వాంటేజ్ క్యాంపస్‌ను నిర్మిస్తుంది. మొత్తం రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో నిర్మించనున్న క్యాంపస్ ద్వారా 25 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ క్యాంపస్‌లో గ్రేడ్-ఏ కార్యాలయాలు, ప్రీమియం నివాసాలు, ఇంటిగ్రేటెడ్ రిటైల్, హాస్పిటాలిటీ సౌకర్యాలు కల్పిస్తారు.

క్వార్క్స్ టెక్నోసాఫ్ట్

కాపులుప్పాడలో క్వార్క్స్ టెక్నో సాఫ్ట్ ప్రైవేటు లిమిటెడ్ క్యాంపస్ నిర్మిస్తుంది. ఈ యూనిట్ ద్వారా రూ. 115 కోట్ల పెట్టుబడి వస్తుంది. 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

మదర్‌సన్

కాపులుప్పాడ ఫేజ్-1 ఐటీ పార్కులో మదర్‌సన్ టెక్నాలజీ సర్వీసెస్ యూనిట్ ద్వారా రూ. 109.73 కోట్ల పెట్టుబడులు వస్తాయి. తద్వారా 1,775 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

ఫ్లూయెంట్ గ్రిడ్

కాపులుప్పాడలో ఫ్లూయెంట్ గ్రిడ్ ఐటీ క్యాంపస్ నిర్మిస్తుంది. రూ.150 కోట్ల పెట్టుబడితో రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తారు.

ఇమాజిన్నోటివ్ టెక్ సొల్యూషన్స్

కాపులుప్పాడలో ఇమాజిన్నోటివ్ సొల్యూషన్స్ సంస్థ కార్యాలయం స్థాపించి రూ.140 కోట్ల పెట్టుబడితో 2,600 మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది.

ఏసీఎన్ ఇన్ఫోటెక్

విశాఖపట్నంలోని ఐటీ సెజ్ హిల్-2పై ఏసీఎన్ ఇన్ఫోటెక్ (ఏసీఎస్ హెల్త్‌కేర్ ఆర్‌సీఎం సర్వీసెస్) కార్యాలయం నిర్మిస్తుంది. ఈ సంస్థ విశాఖలో రూ. 30కోట్లు పెట్టుబడి పెడుతుంది. 600 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. 12 నెలల్లో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం సూచించింది.

నాన్‌రెల్ టెక్నాలజీస్

ఐటీ సెజ్ హిల్-2పై నాన్‌రెల్ టెక్నాలజీస్ యూనిట్ స్థాపిస్తుంది. ఈ సంస్థ రూ. 50-60 కోట్లు పెట్టుబడి పెట్టి, 567 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది.

టెక్ తమ్మిన

ఐటీ సెజ్ హిల్-2పై టెక్ తమ్మిన ఐటీ క్యాంపస్ నిర్మిస్తుంది. రూ.62 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. వీరి ప్రధాన కార్యాలయం అమెరికాలో ఉండగా, నెదర్లాండ్స్, దుబాయ్, ఇండియాలలో సేవలు అందిస్తోంది.

ఫైబర్‌నెట్ కేసు కొట్టివేత

విజయవాడ ఏసీబీ కోర్టు తీర్పు

చంద్రబాబుకు క్లీన్‌చిట్.. ఇతర నిందితులకూ

విజయవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందంటూ అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై నమోదు చేసిన సీఐడీ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ఆయనతోపాటు మిగిలిన నిందితులకు క్లీన్‌చిట్ ఇచ్చింది. 2014-19 నడుమ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో నిబంధనలను ఉల్లంఘించి వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు టెండర్లను కట్టబెట్టారని, దానివల్ల కార్పొరేషన్‌కు రూ.114 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. నాటి ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి హరికృష్ణ, ఎండీ కె.సాంబశివరావు, టెర్రా సాఫ్ట్ డైరెక్టర్ తుమ్మల గోపాలకృష్ణ, చంద్రబాబు (ఏ-25), ముంబై, ఢిల్లీకి చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వాటి ఉన్నతాధికారులను నిందితుల జాబితాలో చేర్చారు. మొత్తం 99 మందిని సాక్షులుగా పేర్కొన్నారు. కేసులో దర్యాప్తు పూర్తయినట్లు కొద్దిరోజుల క్రితం సీఐడీ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టుకు నివేదిక ఇచ్చారు. అయితే ఖజానాకు ఎలాంటి నష్టమూ వాటిల్లలేదని.. కేసును ఉపసంహరించుకుంటున్నట్లు అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి గత నెల 24న కోర్టులో అఫిడవిట్ దాఖలుచేశారు. ఇందుకు అభ్యంతరం లేదని ప్రస్తుత ఎండీ గీతాంజలి శర్మ కూడా అఫిడవిట్ ఇచ్చారు. కోర్టు తీర్పు వెలువడుతుందనే సమయానికి ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైసీపీ నేత గౌతంరెడ్డి రంగప్రవేశం చేశారు. తీర్పు ఇచ్చే ముందు తన వాదనలను వినాలని ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి విచారణార్హత లేదంటూ న్యాయాధికారి పి.భాస్కరరావు పిటిషన్‌ను గురువారం కొట్టివేశారు. ఆ క్రమంలోనే ఫైబర్ నెట్ కేసును కూడా కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

రాజకీయ కుట్రతోనే..

ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుపై దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. అభియోగాలను నిరూపించలేకపోయింది. అక్రమాలు జరిగలేదని స్పష్టం చేసింది. ఆయనపై అవినీతి ముద్ర వేసి గత ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని తేలిపోయింది.

గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారైంది. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకూ మొత్తం 12 రోజుల పాటు పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి ఎం. హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తేదీల్లో పుష్కరాలు నిర్వహించాలని నిర్ణయిస్తూ టీటీడీ ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ పూర్ణప్రసాద్ దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలియజేశారు.

పొందూరు ఖద్దరుకు జీఐ ట్యాగ్

(మొదటిపేజీ తరువాయి)



హర్షం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో తయారయ్యే వస్తువులకు సహజంగా ఒక నాణ్యత సంక్రమిస్తుంది. అదే వాటి ప్రత్యేకతగా నిలుస్తుంది. ఆ విశిష్టతను దృష్టిలో ఉంచుకుని వాటికి మరింత ప్రాధాన్యం ఇచ్చే విధంగా 'ది జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్(రిజిస్ట్రేషన్ అండ్ ప్రొటెక్షన్)యాక్ట్ 1999లో రూపొందించారు. ఈ చట్టం కింద ఒక భౌగోళిక ప్రాంతం నుంచి వచ్చే ప్రత్యేక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు(జియోగ్రాఫికల్ ఇండికేషన్)వర్తిస్తుంది. పొందూరు ఖద్దరుకు ఈ గుర్తింపు తీసుకువచ్చేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విశేష కృషి చేశారు. 2020 జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో అప్పటి శ్రీకాకుళం ఎంపీ హోదాలో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పొందూరు ఖాదీ ఖ్యాతిని వివరిస్తూ.. జీఐ ట్యాగ్‌ను కేటాయించాలని కోరారు. కేంద్ర మంత్రి అయ్యాక దీనిపై మరింత దృష్టి సారించారు. తాజాగా శుక్రవారం అధికారికంగా పొందూరు ఖాదీకి జీఐ ట్యాగ్ గుర్తింపు ప్రతి అందుబాటులోకి వచ్చింది. ఇంతవరకు బాస్మతి బియ్యం, డార్జిలింగ్ తేయాకు, కాంచీపురం పట్టుచీరలు, పోచంపల్లి చీరలు, మైసూరు పట్టు, కొండపల్లి, నిర్మల్ బొమ్మలు, మైసూర్ శాండల్ సబ్బు.. ఇలా కొన్ని ఉత్పత్తులకు మాత్రమే జీఐ ఉంది. ఇప్పుడు ఆ జాబితాలో పొందూరు ఖద్దరు చేరడంతో జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వాజపేయి విగ్రహావిష్కరణలో మంత్రులు కేశవ్, సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ, జయరాం, వెంకటేశ్వరప్రసాద్ తదితరులు

వాజపేయి అడుగుజాడల్లో మోదీ, బాబు

మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి

అనంతలో మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి దేశంలో అనేక సంస్కరణలను తీసుకువచ్చారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. వాజపేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన సుపరిపాలన యాత్ర శుక్రవారం అనంతపురం చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన వాజపేయి విగ్రహాన్ని మంత్రి సత్యకుమార్, పీవీఎన్ మాధవ్‌తో కలసి కేశవ్ ఆవిష్కరించారు. అనంతరం సభలో ప్రసంగించారు. 'అటల్ అడుగు జాడల్లోనే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నడుపుస్తున్నారు. దేశం, రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు. వాజపేయి చూపిన మార్గంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ బాటలో నడుస్తుంటే.. కూటమిలో చీలికలు తప్పవని వైసీపీ కుట్రలు చేస్తోంది. వాటిని తిప్పి కొడుతూ రోజు రోజుకీ కూటమి బలపడుతోందనేందుకు సాక్ష్యం అనంతపురంలో జరిగిన ఈ విగ్రహావిష్కరణ మహోత్సవమే. సుపరిపాలన యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం కావాలి' అని పయ్యావుల ఆకాంక్షించారు. మాధవ్ మాట్లాడుతూ, 'బీజేపీ, టీడీపీ బంధం ఎన్టీఆర్‌తో మొదలైంది. చంద్రబాబు కొనసాగిస్తున్నారు. వాజపేయి విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయడానికి సీఎం పూర్తి సహాయ, సహకారాలు అందించారు. ఆయనకు ధన్యవాదాలు' అని అన్నారు. 'చిన్న కుటుంబంలో జన్మించి, ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన అటల్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని మంత్రి సత్యకుమార్ అన్నారు.

గుడ్డు ధర పైపైకి..



విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర దూసుకెళ్తోంది! రాష్ట్రంలో శనివారం మార్కెట్‌లో అమ్మాల్సిన గుడ్ల ధరను శుక్రవారం సాయంత్రమే నిర్ణయించి ప్రకటిస్తారు. ఈ మేరకు శనివారం ధరలు చూస్తే హోల్‌సేల్‌గా 100 గుడ్ల ధర విశాఖలో రూ.660గా నిర్ణయించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో రూ.664గా ఖరారు చేశారు. రాష్ట్రంలో ఐదు నెక్ సెంటర్లు (గుడ్ల రేట్లు, మార్కెట్లలో సరఫరాను పర్యవేక్షించేవి) ఉండగా... అనపర్తి, తణుకుల్లో 100 గుడ్లు రూ.665, విజయవాడలో రూ.690, చిత్తూరులో రూ.663గా నిర్ణయించారు. పొరుగున ఉన్న హైదరాబాద్‌లో రూ.656గా ఉంది. అయితే గురువారం ఒడిశాలోని బరంపురంలో రూ.690, చెన్నైలో రూ.670గా ఉంది. మార్కెట్ డిమాండ్‌కు తగినంత ఉత్పత్తి లేకపోవడంతో ధర పెరుగుతోందని నెక్ వర్గాలు చెబుతున్నాయి. 3నెలల క్రితం గుడ్లుపెట్టే కోళ్లకు వ్యాధులు సోకాయి. దాంతో కోళ్లు గణనీయంగా తగ్గాయి. గుడ్ల ఉత్పత్తీ భారీగా పడిపోయింది. ఫారాల్లో పిల్లలు పెరిగి గుడ్లు పెట్టే దశకు రావాలంటే 3 నెలలు పడుతుంది. అందువల్ల రెండు నెలల నుంచి బాగా ఉత్పత్తి తగ్గింది. జనవరి మూడో వారం తర్వాత గుడ్ల ఉత్పత్తి పెరుగుతుందని, అప్పటివరకూ ధరలు ఎక్కువగానే ఉంటాయని రైతులు అంటున్నారు. ఉత్తరాంధ్రలో 75 ఫారాల్లో ప్రతిరోజూ 40-42 లక్షల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. కానీ గత రెండు నెలలుగా 36-38 లక్షలు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఈశాన్య భారతం, ఉత్తరాదికి గుడ్ల ఎగుమతి పెరగడంతో స్థానిక మార్కెట్లలో కొరత వచ్చిందని, ధర పెరగడానికి అదీ ఒక కారణమని రైతులు పేర్కొంటున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.